teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 03 | సంచిక : 389 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | ఆదివారం | 2 జూన్ 2024 | పేజీలు : 08 | వెల ‘ 5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

## రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలకు సోనియా దూరం

### హాజరు కావడం లేదని స్పష్టతనిచ్చిన గాంధీభవన్ వర్గాలు



హైదరాబాద్, జూన్ 01 (తీన్మార్ న్యూస్): రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకలకు సోనియాగాంధీ హాజరు కావడం లేదని గాంధీభవన్ వర్గాలు స్పష్టత ఇచ్చాయి. అనారోగ్యం, ఎండల కారణంగా వైద్యులు చేసిన సూచన మేరకు ఆమె తన షెడ్యూలు విజిట్‌ను రద్దు చేసుకున్నారు. తెలంగాణ ప్రజలకు వీడియో సందేశాన్ని వినిపించనున్నారు. ఆ మెసేజ్‌ను పరేడ్ గ్రౌండ్స్ వేదిక మీద భారీ ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలకు వివరించనున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేండ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా ప్రజలకు ఆమె తన శుభాకాంక్షలను తెలియజేయనున్నట్లు ఆ వర్గాలు పేర్కొన్నాయి. ఉత్సవాలకు రావాల్సిందిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాలుగు రోజుల క్రితం ఢిల్లీ వెళ్ళి ప్రత్యేకంగా సోనియాగాంధీకి వివరించి ఆహ్వానించారు. ఆమె కూడా సానుకూలంగా స్పందించి వస్తాననే హామీ ఇచ్చారు. కానీ చివరి నిమిషాల్లో ఆమె అనారోగ్యం దృష్ట్యా వైద్యుల సూచన మేరకు పర్యటనను రద్దు చేసుకున్నారు.



# ప్రజాపాలనలో "ప్రభుత్వ" ఉద్యోగుల తీరు ప్రశ్నార్థకం

ఉద్యోగం ఓచోట.. ఉండేది మరోచోట




రాను.. పోను.. "సమయం" ప్రజా సేవలో వృధా
ఉద్యోగం ఉన్నచోటే నివాసం ప్రజాపాలనకు జవాబుదారితనం
ప్రభుత్వ అధికారులకు ఐడి కార్డు అలంకారప్రాయమేనా
ఉద్యోగుల నియామవళి అమలులో నిర్లక్ష్యం

తెలంగాణ బ్యూరో, జూన్ 01 (తీన్మార్ న్యూస్): ప్రజల ద్వారా ఏర్పడిన ప్రభుత్వాల ప్రధాన కర్తవ్యం ప్రజాపాలనా, ప్రజాసేవా.. రాష్ట్ర అభివృద్ధి. కాగా ప్రజాపాలనలో ప్రభుత్వం ఆదేశాలను.. చట్టాలను అనుసరిస్తూ ప్రజాపాలన పారదర్శకంగా అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వ ఉద్యోగులపై ఉంటుంది. ప్రజాపాలనలో ఉద్యోగుల తీరు మరియు వారి బాధ్యతలు అనేవి చాలా కీలకమైన అంశాలు. కానీ ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో ఈ అంశం అనేది ఒక సవాలుగా ఉన్నదని చెప్పవచ్చు. ఉదాహరణ ప్రభుత్వ ఉద్యోగుల నియామవళి చట్టాల ఆధారంగా ప్రతీ ప్రభుత్వ ఉద్యోగి కూడా ప్రజా పాలనలో.. ప్రజా సేవలో పారదర్శకంగా ఉండుటకు

మిగతా 2 లో




## ఎగ్జిట్ పోల్స్ ఆధిక్యం కాంగ్రెస్‌కే ఆపరేషన్ చాణక్య అంచనా

దేశవ్యాప్తంగా బీజేపీకి ఆధిక్యం అంచనా వేసిన ఆపరేషన్ చాణక్య
దేశ రాష్ట్ర లోక్ సభ స్థానాలపై ఆపరేషన్ చాణక్య ఎగ్జిట్ పోల్స్

తెలంగాణ బ్యూరో, జూన్ 01 (తీన్మార్ న్యూస్): దేశమంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్న ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు వచ్చేశాయి. దేశవ్యాప్తంగా ఏడు దశల్లో జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్ శనివారం సాయంత్రం 6 గంటలకు ముగిసింది. దీంతో సర్వే సంస్థలు ఎగ్జిట్ పోల్స్ ఫలితాలను విడుదల చేశాయి. తెలంగాణలో 17 లోక్‌సభ స్థానాలకు ఇటీవల

మిగతా 2 లో

## తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ గా మారిన హయ్యర్ ఎడ్యుకేషన్ పేరు

హైదరాబాద్, జూన్ 01 (తీన్మార్ న్యూస్): టిఎస్ స్థానంలో టీజీ అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన క్రమంలో ప్రభుత్వ శాఖల పేర్లను మారుతున్నాయి. తాజాగా తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఉన్న హయ్యర్ ఎడ్యుకేషన్ ను తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ గా ప్రభుత్వం

మిగతా 2 లో

## లంచం ఫిర్యాదుకు ప్రత్యక్షమవున్న ఏసీబీ

### శాఖ ఏదయినా సరే.. బుక్ చేయడమే విధిగా అడుగులు

### గజగజ వణికిస్తున్న గత ఐదు నెలల ఏసీబీ ట్రాక్ రికార్డ్



హైదరాబాద్, జూన్ 01 (తీన్మార్ న్యూస్): లంచం ఈ మాట వినిపిస్తే ఏసీబీ ప్రత్యక్షమవుతోంది. పోలీస్, రెవెన్యూ, ఇరిగేషన్, ఆర్టీఏ ఇలా ఏ శాఖ అయినా సరే డోన్ట్ కేర్ అంటోంది. లంచావతారులను ట్రాప్ చేసి మరీ పట్టుకుంటోంది. కన్నింగ్ ఆఫీసర్లకు జైలులో చిప్ప కూడు తినిపిస్తోంది. గత ఐదు నెలల్లో ఏసీబీ అధికారుల ట్రాక్ రికార్డ్ చూస్తే అక్రమార్కులు గజగజ వణికిపోతున్నారు. తెలంగాణలో అవినీతి అధికారులపై ఫోకస్ పెట్టింది ఏసీబీ. అక్రమాలకు పాల్పడుతున్న అధికారులను

మిగతా 2 లో



## దశాబ్ది ఉత్సవాల హాజరుపై కేసీఆర్ కీలక నిర్ణయం

రేవంత్ రెడ్డికి 22 పేజీలతో కేసీఆర్ బహిరంగ లేఖ
వేడుకలకు బీఆర్ఎస్ హాజరు కాలేదని తేల్చిన కేసీఆర్

వివరాలు 2 లో

## సింగరేణి కాలరీస్లో అక్రమ నియామకాలపై సీఐడీ ఎంక్వైరీ

8 బృందాలుగా.. నెల రోజులుగా దర్యాప్తు
అన్ఫిట్ అయినోళ్ల సంఖ్య 14వేల మందికి పైనే
రూ. 450 కోట్లు చేతులు మారాయనే ఆరోపణలు




తెలంగాణ బ్యూరో, జూన్ 01 (తీన్మార్ న్యూస్): తెలంగాణ సింగరేణి కాలరీస్ కంపెనీలో మెడికల్‌బోర్డు ద్వారా అక్రమ పద్ధతుల్లో నియామకాలు పొందిన వారిపై సీఐడీ ఎంక్వైరీ మొదలుపెట్టింది. సింగరేణి వ్యాప్తంగా ఎనిమిది సీఐడీ బృందాలు విచారణ నిర్వహిస్తుండడంతో దళారుల్లో వణుకు మొదలైంది. గురువారం కొత్తగూడెంలోని సింగరేణి మెయిన్‌హాస్పిటల్‌లో సీఐడీకి చెందిన పలువురు

మిగతా 2 లో



## కేరళ తీరాన్ని తాకిన నైరుతి రుతుపవనాలు

### తెలంగాణలోని కొన్ని జిల్లాలకు ఎల్లో అలెర్ట్

హైదరాబాద్, జూన్ 01 (తీన్మార్ న్యూస్): కేరళ తీరాన్ని తాకిన నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయి. కేరళలోని మిగిలిన ప్రాంతాల్లో, తమిళనాడులోని మరి కొన్ని ప్రాంతాలలోకి అవి ప్రవేశించాయి. అలాగే, ఏపీలోని రాయలసీమ, కర్ణాటకలోని కొన్ని ప్రాంతాలలో నైరుతి రుతుపవనాలు ప్రవేశించడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. దీంతో ఆంధ్రప్రదేశ్ లో వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పారు. నేటి నుంచి నాలుగు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని, పలు జిల్లాల్లో పొడి వాతావరణం, వడగాలులు కూడా వీచే అవకాశం ఉందని

మిగతా 2 లో

## లోక్ సభ ఓట్ల లెక్కింపునకు మూడంచెల భద్రత

జూన్ 4న లిక్కర్ షాపులు బంద్
జూన్ 5న 24 రౌండ్లలో నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు
మీడియాతో సీఈవో వికాస్‌రాజ్ వెల్లడి



తెలంగాణ బ్యూరో, జూన్ 01 (తీన్మార్ న్యూస్): లోక్ సభ ఓట్ల లెక్కింపునకు మూడంచెల భద్రత ఏర్పాటు చేసినట్టు సీఈవో వికాస్ రాజ్ తెలిపారు. శనివారం బీఆర్కే భవన్ లో ఆయన మీడియాతో మాట్లాడుతూ మధ్యాహ్నం 3 గంటలలోపు ఫలితాలు వెలువడుతాయని చెప్పారు. చేవెళ్ల, మల్కాజ్ గిరిల్లో రెండేసి

మిగతా 2 లో

## ప్రారంభమైన ఇంటర్ కొత్త విద్యాసంవత్సరం

### జూన్ 1 నుండి ప్రారంభమైన తరగతులు



హైదరాబాద్, జూన్ 01 (తీన్మార్ న్యూస్ ): తెలంగాణలోని ఇంటర్ కాలేజీలలో కొత్త విద్యాసంవత్సరం జూన్ 1 శనివారం నుంచి ప్రారంభమైనవి. ఇంటర్‌లో కొత్తగా చేరిన విద్యార్థులతోపాటు ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు తరగతులు ప్రారంభంకానున్నాయి. రాష్ట్రంలో మొత్తం 3,269 కాలేజీలు ఉండగా, శుక్రవారం వరకు 2,483 కళాశాలలకు

మిగతా 2 లో



## రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ బతికి ఉండాలని కోరుకుంటున్నా

### సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని

గోదావరిఖని, జూన్ 01 (తీన్మార్ న్యూస్): కేసీఆర్ ఓడిపోయి తప్పించుకున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ఇల్లందు క్లబ్ లో జరిగిన ఏఐటీయూసీ కేంద్ర కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ బతికి ఉండాలని కోరుకుంటున్నామన్నారు. ప్రభుత్వ లోగో పై బీఆర్ఎస్ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. ప్రజల ఆకాంక్షలు నెరవేరే విధంగా కొత్త ప్రభుత్వం

మిగతా 2 లో

## ఉమ్మడి పాలమూరు జిల్లాలో నకిలీ పత్తివిత్తనాలు కలకలం

అధికారులు దాడులు చేస్తున్నా అదుపుకాని నకిలీకి కట్టడి

నకిలీ పత్తివిత్తానాలపై రైతాంగం అందోళనలు



ఉమ్మడి పాలమూరు జిల్లాలో నకిలీ పత్తివిత్తనాలు కలకలం రేపుతున్నాయి. ప్రతీఏటా వానకాలం సీజన్ ప్రారంభానికి ముందు పోలీసులు, వ్యవసాయ అధికారులు దాడులు చేస్తున్నా ఈ నకిలీకి కట్టడి పడటం లేదు. అసలు మూలాలు అన్వేషణను గాలికొదిలి కేవలం ఎరువులు, సీడ్ దుకాణాల్లో మాత్రమే తనిఖీలు చేసి చేతులు దులుపుకుంటున్నారు అధికారులు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో రెండు ప్రాంతాల్లో నకిలీ పత్తివిత్తానాలను పట్టుకోవడంతో రైతాంగం అందోళనలో మునిగిపోయింది.

తెలంగాణ బ్యూరో, జూన్ 01 (తీన్మార్ న్యూస్): నకిలీ పత్తి విత్తనాలు ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో రైతాంగాన్ని కలవరపెడుతున్నాయి. వర్షకాలం సీజన్ ప్రారంభం కావడంతో దుక్కిదున్ని పంటలు వేద్దామనుకున్న అన్నదాతకు నకిలీ విత్తనాల భయం పట్టుకుంది. పోలీసులు టాస్క్ ఫోర్స్, వ్యవసాయశాఖ అధికారులు సంయుక్తంగా నకిలీ నియంత్రణకు చర్యలు

మిగతా 2 లో

# తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ గా మారిన హయ్యర్ ఎడ్యుకేషన్ పేరు

మొదటి పేజీ తరువాయి

పేరు మార్చింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ బి వెంకటేశం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే టిఎస్పిఎస్సీ టిజిపిఎస్సీ గా పేరు మార్చిన సంగతి తెలిసిందే. దీంతో తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గా మారింది. ఇక, టీఎస్ఆర్టీసీని టీజీఎస్ఆర్టీసీగా మార్చారు. ఇప్పటికే రాష్ట్రంలో వాహనాదారులు ఇకనుంచి టీజీగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ప్రభుత్వం జీవో జారి చేసింది.

# సింగరేణి కాలరీస్లో అక్రమ నియామకాలపై సీఐడీ ఎంక్వైరీ

మొదటి పేజీ తరువాయి

ఆఫీసర్లు ఎంక్వైరీ చేశారు. సింగరేణి వ్యాప్తంగా కొత్తగూడెంలోని సింగరేణి మెయిన్ హాస్పిటల్లో నెలకు ఒకసారి, కొన్ని సందర్భాల్లో నెలకు రెండు సార్లు మెడికల్ ఫిట్నెస్ పరీక్షలు నిర్వహిస్తుంటారు. ఇలా ఇప్పటివరకు మెడికల్ బోర్డు పరీక్షల్లో సుమారు14వేల మంది కార్మికులు అన్‌ఫిట్ కాగా, వీరి తర్వాత వీరి వారసులకు ఉద్యోగాలు వచ్చాయి. ఇందులో దళారులు, అధికారులు, సిబ్బంది కలిసి దాదాపు రూ.450 కోట్ల వరకు దండుకున్నారన్న ప్రచారం కార్మికవర్గాల్లో సాగింది. దీంతో స్పందించిన సింగరేణి సీఎండీ బలరాం నాయక్ విచారణ చేయాలని సీఐడీకి లెటర్ రాశారు. దీంతో దర్యాప్తు సంస్థ రంగంలోకి దిగింది. మెడికల్ బోర్డులో పారదర్శకతకు పెద్దపీట వేయడంతో పాటు ఇప్పటివరకు అక్రమాలు జరిగాయంటూ ఆరోపణలు రావడంతో సింగరేణి సీఎండీ బలరాం నాయక్ మూడు నెలల కింద సీఐడీ ఎంక్వైరీ కోరారు. దీంతో మెడికల్ బోర్డులో చక్రం తిప్పుతున్న దళారులు, అక్రమాలకు పాల్పడుతున్న ఆఫీసర్లు, బీఆర్ఎస్, టీబీజీకేఎస్ తో పాటు పలు యూనియన్‌లీడర్ల ప్రమేయంపై సీఐడీ దృష్టి సారించింది. సింగరేణిలోని ఇల్లెందు, కొత్తగూడెం, మణుగూరు, భూపాలపల్లి, మంచిర్యాల, శ్రీరాంపూర్, మందమర్రి, ఆర్జీ-1,2,3 తో పాటు మరికొన్ని ఏరియాల్లో ఎనిమిది సీఐడీ బృందాలు విచారణ కొనసాగిస్తున్నాయి. ఒక్కో బృందంలో ముగ్గురు ఆఫీసర్లు ఉండగా ఎనిమిది బృందాలు ఎప్పటికప్పుడు కో ఆర్డినేట్ చేసుకుంటూ పని చేస్తున్నాయి. ఇప్పటికే కొత్తగూడెంలోని సింగరేణి మెయిన్ హాస్పిటల్ నుంచి ఇన్వాలిడేషన్ అయిన వారి వివరాలతో పాటు మెడికల్‌బోర్డుకు అప్లై చేసిన వారి డిటెయిల్స్ కూడా తీసుకున్నట్టు సమాచారం. సింగరేణి వ్యాప్తంగా మెడికల్‌బోర్డులో జరిగిన అవినీతిపై సీఐడీ బృందాలు చేస్తున్న ఎంక్వైరీతో దళారులను హడలిపోతున్నారు. భూపాలపల్లి, కొత్తగూడెం, ఇల్లెందు, మణుగూరు ఏరియాలో వరంగల్ రేంజ్ సీఐడీ బృందాలు ఎంక్వైరీ చేస్తున్నాయి. మొదటి దశలో అన్ ఫిట్‌అయిన కార్మికుల వద్దకు వెళ్లి విచారణ జరుపుతున్న సీఐడీ, రెండో దశలో అన్‌ఫిట్ కాకుండా ఫిట్‌ఫర్ జాబ్‌అయిన వారిని ఎంక్వైరీ చేయనున్నట్టు తెలిసింది. విచారణలో భాగంగా సింగరేణి వ్యాప్తంగా పలు పోలీస్ స్టేషన్లలో మెడికల్‌బోర్డు దందాపై నమోదైన కేసుల వివరాలను తెలుసుకుంటున్నారు. సింగరేణిలోని ఇంటెలిజెన్స్ విభాగంలో పనిచేసిన పలువురిని కూడా విచారించినట్టు సమాచారం. సింగరేణి కాలరీస్ కంపెనీలో ఇన్వాలిడేషన్ దళారులకు కాసుల వర్షం కురిపిస్తోంది. అనారోగ్య సమస్యలతో డ్యూటీ చేయలేని వారిని మెడికల్ బోర్డు అన్‌ఫిట్‌గా ప్రకటిస్తే వారి వారసులకు ఉద్యోగాలు వస్తాయి. అయితే, కొంతమంది అన్‌ఫిట్ కాకపోయినా, ఎలాంటి అనారోగ్యం లేకపోయినా వారి వారసులకు ఉద్యోగాలు ఇప్పించుకోవడం కోసం మెడికల్‌బోర్డుకు వస్తుంటారు. ఇక్కడి నుంచే దళారుల దందా మొదలవుతోంది. కార్మికులను అన్‌ఫిట్‌చేయించడానికి లక్షల్లో దండుకుంటున్న దళారులు మెడికల్ బోర్డులోని ఆఫీసర్లు, సిబ్బందికి తలా ఇంత ఇస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఒక్కో కార్మికుడి నుంచి రూ. 5లక్షల నుంచి రూ. 7 లక్షల వరకు తీసుకుంటున్నారని సమాచారం. అన్‌ఫిట్ కోసం దరఖాస్తు చేస్తున్న కార్మికుల సంఖ్యను బట్టి మెడికల్ బోర్డు నిర్వహిస్తారు. కొన్ని సందర్భాల్లో నెలకు రెండు నుంచి మూడు మెడికల్ బోర్డులు జరిగిన సందర్భాలున్నాయి. ఒక్కోసారి దాదాపు 150 నుంచి 200 మంది కార్మికులను యాజమాన్యం మెడికల్ బోర్డుకు పిలుస్తుంది. ఇందులో దాదాపు 120 నుంచి 150 మందికి పైగా అన్‌ఫిట్‌అవుతున్నారు. ఇలా అన్‌ఫిట్ అయిన వారిలో దాదాపు 75శాతం మంది దళారులకు పైసలిచ్చిన వారేనన్న ఆరోపణలు వస్తున్నాయి. ఈ దళారుల్లో మెయిన్ హాస్పిటల్‌లో పనిచేసే ముఖ్యమైన వారితో పాటు హెడ్డాఫీస్, మైన్స్ లో పనిచేసే కొందరు ఆఫీసర్లు, ఉద్యోగులు, బీఆర్ఎస్ తతులీడర్లు, టీబీజీకేఎస్‌తో పాటు పలు యూనియన్ లీడర్లు ఉన్నట్టుగా సీఐడీ అధికారులు గుర్తించారు.

# దశాబ్ది ఉత్సవాల హాజరుపై కేసీఆర్ కీలక నిర్ణయం

హైదరాబాద్, జూన్ 01 (తీన్మార్ న్యూస్): తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం అట్టహాసంగా నిర్వహించేందుకు సిద్ధమైంది. ఈ క్రమంలో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన అందరిని ఈ వేడుకలకు ఆహ్వానించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగానే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ప్రముఖ పాత్ర పోషించిన బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్కు సైతం ఇన్విటేషన్ పంపింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నిర్వహిస్తోన్న దశాబ్ది ఉత్సవాలకు హాజరు కావడంపై కేసీఆర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డికి కేసీఆర్ 22 పేజీలతో కూడిన బహిరంగ లేఖ రాశారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు బీఆర్ఎస్ హాజరు కావడం లేదని కేసీఆర్ తేల్చి చెప్పారు.

బీఆర్ఎస్‌ను రాష్ట్ర ప్రభుత్వం అడుగడుగునా అవమానించిందని సీఎం రేవంత్ ప్రభుత్వ వికృత పోకడలను నిరసిస్తూ ఈ వేడుకల్లో పాల్గొనడం లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్వహించే వేడుకలకు హాజరు కావాలని తనకు ఆహ్వానం పంపిందని అందుకే ఈ లేఖ రాసినట్లు పేర్కొన్నారు.

# రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ బతికి ఉండాలని కోరుకుంటున్నా

మొదటి పేజీ తరువాయి

పని చేయాలని సూచించారు. రాష్ట్రంలో ఏ రంగం సంతృప్తి కరంగా లేదన్నారు. పదేండ్లలో సింగరేణి ని విచ్చలవిడిగా దోచుకున్నారని ఆరోపించారు. దేశానికి బీజేపీ అత్యంత ప్రమాదకారి అని, ఆ పార్టీ విషపూరితమైన పాము లాంటిదన్నారు. అధికారం కోసం మోదీ ఎంతటికైనా దిగజారుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ గెలుపులో కమ్యూనిస్టు పార్టీ భాగస్వామ్యం ఉందన్నారు. డబ్బులతో పని లేని ఎన్నికలు రావాలని కోరుకుంటున్నామని ఆయన చెప్పారు.

# ఎగ్జిట్ పోల్స్ ఆధిక్యం కాంగ్రెస్ కే ఆపరేషన్ చాణక్య అంచనా

మొదటి పేజీ తరువాయి




ఎన్నికలు జరిగాయి. ప్రధాన రాజకీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ హోరాహోరీ తలపడ్డాయి. ప్రధాన పోటీ కాంగ్రెస్, బీజేపీ మధ్యే ఉంటుందని సర్వే సంస్థలు అంచనా వేశాయి. కాంగ్రెస్ 8 స్థానాలు, బీజేపీ 7, బీఆర్ఎస్ 1, ఎంఐఎం 1 కైవసం చేసుకుంటుందని ఆపరేషన్ చాణక్య సంస్థ ప్రకటించింది. బీఆర్ఎస్ పార్టీకి ఒక్క సీటు మెదక్ నుండి, ఎంఐఎం ఒక్క సీటు హైదరాబాద్ నుండి అంచనా వేసింది. బీజేపీ అభ్యర్థి మాధవీలత గట్టిపోటీ ఇచ్చినప్పటికీ హైదరాబాద్ స్థానాన్ని ఎంఐఎం పార్టీ నిలబెట్టుకుందని వెల్లడించింది. ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్, చేవేళ్ల, మల్కాజగిరి, జహీరాబాద్, సికింద్రాబాద్ స్థానాల్లో బీజేపీ గెలిచే ఛాన్స్ ఉందని ఆపరేషన్ చాణక్య సంస్థ అధినేత దాత్తాత్రేయ రాజేందర్ వెల్లడించారు. మహబూబ్ నగర్ లో గట్టిపోటీ ఉన్నప్పటికీ బీజేపీ అభ్యర్థి డీకే అరుణ స్వల్ప ఆధిక్యంతో గెలుస్తారని జోస్యం చెప్పారు. కాగా దేశ వ్యాప్తంగా లోక్ సభ ఎన్నికలు 543 స్థానాలకు జరగగా అందులో బీజెపి ముందంజలో 335 నుండి 340 సీట్లు వచ్చే అవకాశం ఉన్నట్లు మరియు రెండవ స్థానంలో ఇండియ అలీయన్స్ 105 నుండి 113 సీట్లు, మూడవ స్థానంలో ఎన్డిఏ 85 నుండి 90వరకు సీట్లు వచ్చే అవకాశం ఉన్నట్లు ఆపరేషన్ చాణక్య సంస్థ అంచనా వేసింది.

# ప్రజాపాలనలో "ప్రభుత్వ" ఉద్యోగుల తీరు ప్రశ్నార్థకం






మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వాలు, చట్టాలకు అనుగుణంగా హౌస్ రెంట్ అలవెన్స్ పొందుతూ విధులు నిర్వర్తించే ప్రదేశానికి నిర్ణిత దూరంలో నివాసం ఉంటూ ప్రజలకు సేవలందించాల్సి ఉంటుంది అలాగే హౌస్ రెంట్ అలవెన్స్ యొక్క ముఖ్య ఉద్దేశ్యం కూడా. కాగా రాష్ట్రంలో ప్రస్తుతం ఎక్కువ మొత్తంలో ప్రభుత్వ ఉద్యోగులు విధులు నిర్వర్తించే చోట నిర్నిత పరిధిలో నివాసం ఉండకుండా.. చట్టాలను ఉల్లంగిస్తూ.. హౌస్ రెంట్ అలవెన్స్ పొందుతూ నిత్యావసరాల మరియు విలాసాల సౌకర్యార్థం సుదూర ప్రాంతాల్లో నివసిస్తున్నారు. ఈ పరిస్థితుల వల్ల ఇలాంటి ఉద్యోగులు విధులు నిర్వర్తించడంలో కార్యాలయానికి లెట్ గా రావడానికి, కార్యాలయం నుండి ముందే నివాసానికి పోవడానికి అవుతున్న సమయాల ద్వారా వాస్తవ విధుల సమయపాలనలో సమయం తగ్గుతున్నది.

ఉదాహరణ ఒక ఉద్యోగి విధులు నిర్వర్తిస్తున్న కార్యాలయానికి 100 కి. మీ దూరంలో పట్టణంలో నివసిస్తే ఆ ఉద్యోగి నివాస స్థలం నుండి బయల్దేరి ట్రాఫిక్ కారణంగా, భద్రత కారణంగా, సమయానికి అనుగుణంగా లేని రవాణా కారణంగా కార్యాలయానికి లెట్ గా రావడం అంతే కాక ఇదే కారణాల వల్లా ముందుగానే వెళ్లడం వల్ల ప్రతీ రోజు సుమారు 2గంటల సమయం ప్రజా సేవలో దుర్వినియోగం అవుతున్నది. ఈ రెండు గంటలలో ఒక్కో ఉద్యోగి ఎంత మంది ప్రజల సమస్యలను పరిష్కరించడానికి అవకాశం ఉంటుందో ఆలోచిస్తే.. ఇలాంటి ఉద్యోగుల పట్ల ప్రజలు అసహనం వ్యక్తం చేయడం ఆశ్చర్యం ఏమీ కాదు.

**ప్రజాపాలనలో "ప్రభుత్వ" ఉద్యోగుల తీరు ప్రశ్నార్థకం**

ప్రజాపాలనలో ఉద్యోగుల తీరు అనేది ప్రజల నమ్మకం మరియు విశ్వాసం పై నిలబడే అంశం. ఉద్యోగులు తమ బాధ్యతలను ఎంత నిబద్ధతతో నిర్వహిస్తారో అది ప్రజాపాలనలో వారి పాత్రను నిర్ణయిస్తుంది. కానీ ప్రస్తుతం రాష్ట్రంలో ఏంతో మంది ఉద్యోగులు చట్టాలకు భిన్నంగా, బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తూ సుదూర ప్రాంతాలలో నివసిస్తూ ఉండడం వల్ల కార్యాలయంలో కేటాయించాల్సిన విధుల సమయపాలనలో తేడాల వల్ల, ప్రయాణంలో కలిగే మానసిక ఘటనల వల్ల ఆ ప్రభావం ప్రజలకు అందించే సేవలపై పడుతున్నది.

**ఉద్యోగం ఓ చోట.. ఉండేది మరోచోట**

ఉద్యోగం మరియు నివాస స్థలం ఒకే చోట ఉండడం వల్ల ఉద్యోగులు తమ సేవలను మరింత బాధ్యతాయుతంగా మరియు సమయానుసారంగా అందించగలరు. దీనికి ప్రభుత్వం తగిన సత్వర చర్యలకు పునుకోవాల్సిన అవసరం ఉంది.

**రాను.. పోను.. "సమయం" ప్రజా సేవలో వృధా**

ఉద్యోగులు తమ సమయాన్ని ప్రజాసేవలో సమర్థవంతంగా ఉపయోగించడం వల్ల ప్రజాపాలన మరింత ఫలప్రదంగా మారుతుంది. ఈ సందర్భంగా ప్రజల సమస్యల పరిష్కారంలో జాప్యం తగ్గుతుంది.

**ఉద్యోగం ఉన్నచోటే నివాసం ప్రజాపాలనకు జవాబుదారితనం**

ఉద్యోగం ఉన్న చోటే నివాసం ఉండడం వల్ల ఉద్యోగులు తమ సేవలను మరింత సులభంగా మరియు సమయానుసారంగా అందించగలరు. తద్వారా ప్రజలకు ప్రజాపాలన పై నమ్మకం పెరుగుతుంది.

**ప్రభుత్వ అధికారులకు ఐడి కార్డు అలంకారప్రాయమేనా**

ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేస్తున్న అధిక మొత్తంలో ప్రభుత్వ ఉద్యోగులు తమ ఐడీ కార్డులను విధిగా ధరించడం లేదు. ప్రభుత్వ కార్యాలయాలను సాధారణ ప్రజలను సందర్శించిన సందర్భంలో వారిని గందరగోళానికి గురిచేస్తున్నది. ఎవరు ప్రభుత్వ ఉద్యోగో తెలువడం లేదు. ఐడీ కార్డులు ధరించకపోవడం ప్రభుత్వ మార్గదర్శకాలను ఉల్లంఘించడమే అవుతుంది. ఒక సామాన్యుడు ఒక ప్రభుత్వ కార్యాలయానికి వెళితే అందులో ఎవరు ఏ అధికారో తెలిసే అవకాశం లేకుండా పోతున్నది. ప్రభుత్వోద్యోగులందరూ విధి నిర్వహణలో ఐడీ కార్డులు ధరించేలా మార్గదర్శకాలను పాటించేలా సంబంధిత ఉన్నత అధికారులు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ప్రజా పాలనా సౌలభ్యం కోసం తప్పక ఉన్నది. ఈ మార్గదర్శకాలు అధికారుల పనితీరులో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంచుతుంది. సాధారణ ప్రజలలో విశ్వాసాన్ని పెంపొందించడంలో సహాయపడుతుంది. అధికారులు ప్రభుత్వం ఇచ్చిన ప్రభుత్వ గుర్తింపు కార్డును ప్రజలకు కనబడేలా ధరించాలని దేశంలోని అనేక రాష్ట్రాల హైకోర్టులు ఇప్పటికే ఆదేశాలను జారీ చేయడం జరిగింది. కావున కింది స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు ప్రతి ప్రభుత్వ ఉద్యోగి తమ బాధ్యతగా ఐడీ కార్డు ప్రజలకు కనబడేలా ధరించడానికి ప్రజా పాలనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి.

# విడుదలైన గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష హాల్ టికెట్లు

తెలంగాణ బ్యూరో, జూన్ 01 (తీన్మార్ న్యూస్): గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష హాల్ టికెట్లు శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి టిజిపిఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని అధికారులు తెలిపారు. ఈనెల 9న ఉ.10:30 నుంచి మ. 1:00 గంట వరకు పరీక్ష జరగనుంది. మెయిన్ పరీక్షలు అక్టోబర్ 21 నుంచి నిర్వహించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. 563 పోస్టుల భర్తీకి ఈ పరీక్షలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. తెలంగాణ గ్రూప్ 1 ప్రిలిమ్స్ కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ముందుగా కమిషన్ వెబ్ సైట్ https://www.tspsc.gov.in లోకి వెళ్లాలి. టీఎస్పిఎస్సీ గ్రూప్ 1 ప్రిలిమ్స్ హాల్ టికెట్ - 2024 ఆప్షన్ పై క్లిక్ చేయాలి. మీ ఓటీఆర్ వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. సబ్మిట్ బటన్ పై నొక్కితే మీ అడ్మిట్ కార్డు డిస్ ప్లే అవుతుంది. ప్రింట్ లేదా డౌన్లోడ్ ఆప్షన్ పై నొక్కి కాపీని పొందవచ్చు. తెలంగాణలో 563 గ్రూప్-1 పోస్టుల భర్తీ కోసం కొద్దిరోజుల కిందట తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. గతంలో ఇచ్చిన నోటిఫికేషన్ ను రద్దు చేసి మరికొన్ని పోస్టులను కలిపి ఈ ప్రకటన ఇచ్చింది. ఇందులో భాగంగా జూన్ 9న ప్రిలిమ్స్ పరీక్షను నిర్వహించనుంది. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష జరుగుతుంది. మీ ఓటీఆర్ వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. ప్రింట్ లేదా డౌన్లోడ్ ఆప్షన్ పై నొక్కి కాపీని పొందవచ్చు.

# లంచం ఫిర్యాదుకు ప్రత్యక్షమవున్న ఏసీబీ

మొదటి పేజీ తరువాయి

వేటాడుతోంది. ఆదాయానికి మించి ఆస్తులు పోగేసిన వారిని టార్గెట్ చేసుకుని ఏసీబీ ముందుకు సాగుతోంది. అవినీతికి పాల్పడుతున్న అధికారులను ట్రాప్ చేసి మరీ పట్టుకుంటోంది. ఐదు నెలల్లో దాదాపు 50కి మందికిపైగా అధికారులపై కేసులు ఫైల్ చేసింది. అక్రమాస్తుల కేసులో సీసీఎస్ ఏసీపీ ఉమామహేశ్వరావుకు చిప్పకూడు తినిపించారు ఏసీబీ అధికారులు. ఫిర్యాదుదారుడు, నిందితుడు ఇద్దరి నుంచీ డబ్బు వసూలు చేయడంలో ఉమామహేశ్వరరావు మార్కే డిఫరెంట్. ల్యాండ్ సెటిల్మెంట్ కేసుల్లో ఉమామహేశ్వరరావు బాగా దండుకున్నట్టు గుర్తించారు. ఈ కన్నింగ్ ఏసీపీకి 14రోజుల రిమాండ్ విధించి జైలుకు పంపించింది ఏసీబీ. విచారణకు ఉమామహేశ్వరరావు సహకరించడం లేదని ఏసీబీ అధికారులు చెప్తున్నారు. గత జనవరిలో హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణను ట్రాప్ చేసి పట్టుకున్నారు ఏసీబీ అధికారులు. హెచ్ఎండీఏలో కింగ్ మేకర్‌గా శివబాలకృష్ణ అక్రమ వసూళ్లతో కోట్లాది రూపాయలు కూడబెట్టాడు. డబుల్ రోల్-డబుల్ క్యాష్ పద్ధతిలో బిల్డర్లకు, రియల్టర్లకు, ఇన్‌ఫ్రా ఓనర్లకు, ల్యాండ్ వెంచర్ల యజమానుల ఫైల్స్‌కి గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు. బినామీల పేరుతో వందల ఎకరాలు కూడబెట్టాడు. ఈ అవినీతి తిమింగలాన్ని కూడా ఏసీబీ అధికారులు జైలుకు పంపించారు. నాంపల్లి ఇరిగేషన్ కార్యాలయం దాడులు చేసి నలుగురు ఇరిగేషన్ అధికారులను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. లక్ష రూపాయలు లంచం తీసుకుంటుండగా ఈఈ బన్సీలాల్‌తో పాటు ఇద్దరు ఏఈలు, సర్వేయర్‌ను ట్రాప్ చేశారు. నలుగురు ఇరిగేషన్ అధికారులను నాంపల్లి ఏసీబీ కార్యాలయానికి తరలించారు. హైదరాబాద్ కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌లోనూ ఏసీబీ అధికారులు తనిఖీలు చేశారు. ఓ కేసు విషయంలో 3లక్షలు లంచం తీసుకుంటూ సీఐ వీరస్వామి, ఎస్సై షఫీ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. అవినీతి ఆరోపణలు ఎక్కువగా వినిపిస్తున్న ఆర్టీఏ కార్యాలయాలపై ఏసీబీ నజర్ పెట్టింది. లారీ, టాక్సీ డ్రైవర్ల గేటపుల్లో ఆఫీసుల్లోకి ఎంట్రీ ఇచ్చి అక్రమార్కుల భరతం పడుతున్నారు అధికారులు. మహబూబాబాద్ ఆర్టీఏ ఆఫీస్‌లో పని చేస్తున్న ఐదుగురు ప్రైవేట్ ఏజెంట్లను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. నగదు స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్ పరిధిలోని ఖైరతాబాద్, మలక్‌పేట్, నాగోల్, అత్తాపూర్,బండ్లగూడ, మహబూబ్‌నగర్, సిద్దిపేట ఆర్టీఏ కార్యాలయాల్లో సోదాలు చేశారు. పలువురు బ్రోకర్లతో పాటు అవినీతి అధికారులను అదుపులో తీసుకుని విచారించారు. మహబూబ్ నగర్, నల్లగొండ ఆర్టీఏ కార్యాలయంపై ఏసీబీ దాడులు చేసింది. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో రూ. 25వేలు లంచం తీసుకుంటూ మహిళా ఎస్ఐ రాజ్యలక్ష్మి ఏసీబీ దొరికిపోయింది. కరీంనగర్ జిల్లా హుజురాబాద్‌లో 20 వేలు లంచం తీసుకుంటూ హుజురాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ ఏసీబీకి చిక్కాడు. లంచం తీసుకుంటూ నల్గొండ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సోమేశ్వర్ రెడ్ హ్యాండెడ్‌గా ఏసీబీ అధికారులకు దొరికాడు. ఇలా చెప్పుకుంటూ పోతే ఆశాఖ, ఈశాఖ అనే తేడా లేకుండా అవినీతి అధికారుల భరతం పడుతోంది ఏసీబీ.

**కేరళ తీరాన్ని తాకిన నైరుతి రుతుపవనాలు**

తెలిపారు. తెలంగాణలోని అదిలాబాద్, కొమురం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో వడగాలుల నేపథ్యంలో ఎల్లో అలెర్ట్ ప్రకటించారు. ఆదివారం తెలంగాణలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, పలు పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. మరికొన్ని జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురుస్తాయి.

# కొండగట్టుకు పోటెత్తిన అంజన్న భక్తులు

## హనుమాన్ జయంతి నేపథ్యంలో పెద్ద సంఖ్యలో భక్తులు



కొండగట్టు, జూన్ 01 (తీన్మార్ న్యూస్): జగిత్యాల జిల్లాలోని కొండగట్టు అంజన్న ఆలయానికి భక్తులు పోటెత్తారు. పెద్ద హనుమాన్ జయంతి నేపథ్యంలో పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. హనుమాను దీక్ష విరమణ కోసం రాష్ట్ర నలుమూలల నుంచి మాలదారులు తరలిరావడంతో రద్దీ నెలకొంది. రామనామ స్మరణతో ఆలయ పరసరాలు మారుమోగుతున్నాయి. ఆలయంలో హనుమాన్ జయంతి ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. అప్పటి నుంచి భక్తులు దీక్ష విరమణకు తలరివస్తున్నారు. ఇప్పటికే ఆలయానికి చేరుకున్నవారు అంజన్నను దర్శించుకుని, దీక్షను విరమిస్తున్నారు. శనివారం మధ్యాహ్నం వరకు దీక్షాపరుల రద్దీ కొనసాగుతుందని అధికారులు తెలిపారు. కాగా, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటుచేశారు. ఉత్సవాలను జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా పరిశీలించారు.

# ప్రారంభమైన ఇంటర్ కొత్త విద్యాసంవత్సరం

మొదటి పేజీ తరువాయి

ఇంటర్ బోర్డు అఫిలియేషన్ ఇచ్చింది. వీటిలో 1,443 ప్రైవేట్ కాలేజీలు ఉన్నాయి. అయితే మిక్స్డ్ ఆక్యుపెన్సి భవనాల్లోని ప్రైవేటు కాలేజీలపై బోర్డు ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో ఆయా కాలేజీల్లోని సెకండ్ ఇయర్ విద్యార్థుల భవితవ్యంపై అయోమయం నెలకొంది.

తెలంగాణలోని జూనియర్ కళాశాలలకు వేసవి సెలవులు మే 31తో ముగిసాయి. వేసవి సెలవుల నేపథ్యంలో రాష్ట్రంలోని అన్నిరకాల జూనియర్ కాలేజీలకు మార్చి 31 నుంచి సెలువులు ఇచ్చిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో ఇంటర్ ప్రవేశాల ప్రక్రియ మే 9న ప్రారంభమైన సంగతి తెలిసిందే. మే 31 వరకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. జూన్ 30 నాటికి మొదటి దశ ప్రవేశ ప్రక్రియ పూర్తిచేయనున్నారు. మొదటి దశ ప్రవేశాలు పూర్తికాగానే రెండోదశ ప్రవేశాలకు సంబంధించిన షెడ్యూల్ విడుదల కానుంది. అటు పాఠశాలల్లో యూనిఫాం, షూ, బుక్స్, స్టేషనరీ అమ్మకూడదంటూ హైదరాబాద్ డీఈఓ ఆదేశాలు ఇచ్చారు. హైదరాబాద్ జిల్లాలో నడుస్తున్న తెలంగాణ రాష్ట్ర/సీబీఎస్ఈ/ఐసీఎస్ఈ పాఠశాల ప్రాంగణంలో యూనిఫారాలు, షూ %డ% బెల్ట్ మొదలైనవాటిని విక్రయించకూడదని కోర్టు ఆదేశాల ప్రకారం, పాఠశాల కౌంటర్‌లో పుస్తకాలు/నోట్ పుస్తకాలు/స్టేషనరీ విక్రయాలు ఏవైనా ఉంటే, వాణిజ్యేతరంగా, లాభాపేక్ష లేకుండా ఉండాలని పేర్కొన్నారు.

# లోక్ సభ ఓట్ల లెక్కింపునకు మూడంచెల భద్రత

మొదటి పేజీ తరువాయి

కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. లెక్కింపు కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ డివైజ్ లు అనుమతించబోమని అన్నారు. కౌంటింగ్ హాలు నుంచి వంద మీటర్ల వరకు ఎవరికీ అనుమతి ఉండదని పేర్కొన్నారు. లెక్కింపు హాలు మొత్తం సీసీ టీవీ పర్యవేక్షణలో ఉంటుందని అన్నారు. స్ట్రాంగ్ రూం నుంచి కౌంటింగ్ హాల్ వరకు ప్రత్యేకమైన దారిలో సీసీ టీవీ మానిటరింగ్ ఉంటుందని అన్నారు. చొప్పదండి, యాకుత్ పురా, దేవరకొండలో అత్యధికంగా 24 రౌండ్లలో ఓట్లను లెక్కిస్తారని చెప్పారు. ఆర్మూర్, భద్రాచలం, అశ్వారావుపేటలో 13 రౌండ్లలో ఓట్ల లెక్కింపు ఉంటుందని చెప్పారు. 34 లొకేషన్లలో కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. తొలుత పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కిస్తారని అన్నారు. ఉదయం 8 గంటలకు కౌంటింగ్ మొదలవుతుందని తెలిపారు. 2.80 లక్షల పోస్టల్ బ్యాలెట్లను 276 టేబుళ్లపై లెక్కిస్తారని వివరించారు. ఒక్కో టేబుల్ వద్ద ఒక్కో అబ్జర్వర్ ఉంటారని అన్నారు. కౌంటింగ్ పూర్తయ్యాక ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్లో ఐదు పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన వీవీ ప్యాట్లను లెక్కిస్తారని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 10 వేల మంది సిబ్బంది అవసరమని, యాభై శాతం మందిని అదనంగా స్పేర్ లో పెట్టుకుంటున్నామని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 49 మంది అబ్జర్వర్లను ఈసీఐ నియమించిందని అన్నారు.

**లిక్కర్ షాపులు బంద్**

కౌంటింగ్ జరిగే జూన్ 4వ తేదీ ఉదయం నుంచి రాత్రి వరకు లిక్కర్ షాపులు బంద్ ఉంటాయని చెప్పారు. ర్యాలీలపై స్థానిక పోలీసులు నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. మధ్యాహ్నం మూడు గంటల వరకు ఫలితాలు వెలువడే అవకాశం ఉందన్నారు.

**5న పట్టభద్రుల ఎమ్మెల్సీ కౌంటింగ్**

ఈ నెల 5వ తేదీన పట్టభద్రుల ఎమ్మెల్సీ కౌంటింగ్ నల్లగొండలో నిర్వహిస్తామని చెప్పారు. 24 టేబుల్స్ లో కౌంటింగ్ జరుగుతుందని, ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుందని వికాస్ రాజ్ తెలిపారు. ఇందుకోసం అన్ని ఏర్పాటు చేశామన్నారు.

# ఉమ్మడి పాలమూరు జిల్లాలో నకిలీ పత్తివిత్తనాలు కలకలం

మొదటి పేజీ తరువాయి



తీసుకుంటున్నామంటున్నప్పటికి మార్కెట్లో చలామణీ అవడం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. నకిలీ విత్తనాలకు సంబంధించి మూలం ఏంటో తెలిసినప్పటికీ ఆ దిశగా చర్యలు ఉండడం లేదని అన్నదాతలు వాపోతున్నారు. ఇటీవలే జిల్లాలోని రెండు ప్రాంతాల్లో నకిలీ విత్తనాలు పట్టుబడడంతో అన్నదాతలు మరింత భయానికి గురవుతున్నారు. ఏప్రిల్ 24న మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం గోప్లాపూర్‌లో 221కేజీల బీటీ-3 రకం పత్తి విత్తనాలను టాస్క్ ఫోర్స్, వ్యవసాయ అధికారులు సంయుక్తంగా పట్టుకున్నారు. అలాగే 27న కొడంగల్ మండలం హస్నాబాద్‌లో 9.72క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని రెండు ప్రాంతాల్లో నకిలీ విత్తనాలు కలకలం సృష్టించడంతో రైతులు విత్తనాలు కొనుగోలు విషయంలో సందిగ్ధంలో పడుతున్నారు. ఈ నకిలీ విత్తన మాఫీయాలో సంబంధించి మార్కెటింగ్‌లో ఏపీకి చెందిన వారే కీలకంగా వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా గుంటూరు, పల్నాడు, ప్రకాశం జిల్లాలకు చెందిన వారు ప్రధాన పాత్ర పోషిస్తున్నట్లు అధికారుల విచారణలో తేలుతోంది. నకిలీ గుట్టును వదిలేసి కేవలం పై పై తనిఖీలతో పోలీసులు, అధికారులు చేతులు దులుపుకుంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తీన్మార్
తెలుగు దినపత్రిక

# ఉచిత హామీలు...అవినీతేనా

ఎన్నికల వేళ రాజకీయ పార్టీలు ప్రకటించే మేనిఫెస్టోపై దేశ అత్యున్నత న్యాయస్థానం ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ఎన్నికల సందర్భంగా రాజకీయ పార్టీలు తమ మ్యానిఫెస్టోలో చేసే వాగ్దానాలు అవినీతి కిందకు రావని సుప్రీంకోర్టుపేర్కొంది. ఎన్నికల చట్టాలప్రకారం మేనిఫెస్టోలోని పథకాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రజలకు ఆర్థిక సహాయం చేసినట్లు అవుతుందని వ్యాఖ్యానించింది. ఎన్నికల వేళ మేనిఫెస్టో ప్రకటించడం అవినీతి చేయడంతో సమానమని పిటిషనర్ చేసిన వాదనను తోసిపుచ్చింది. జస్టిస్ సూర్యకాంత్ జస్టిస్ వీకే విశ్వనాథన్ లతో కూడిన ధర్మాసనం స్పందిస్తూ.. పిటిషనర్ వాదన విచిత్రంగా ఉందని అభిప్రాయపడింది. తగిన సమయంలో దీనిపై నిర్ణయం తీసుకోవచ్చని తెలిపింది. కర్ణాటకలో గతేడాది అసెంబ్లీ ఎన్నికలు జరిగిన సంగతి తెలిసిందే. చామరాజనగర్ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి బీజెడ్ జమీర్ అహ్మద్‌ఖాన్ గెలుపొందారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తన మ్యానిఫెస్టోలో అనేక హామీలు ప్రకటించింది. దీనిపై శశాకం జె శ్రీధర అనే వ్యక్తి స్థానిక హైకోర్టును ఆశ్రయించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన ఐదు హామీలు అవినీతి కిందకే వస్తాయని పిటిషన్ దాఖలు చేశారు. కాంగ్రెస్ పార్టీ నుంచి గెలుపొందిన జమీర్‌పై అనర్హత వేటు వేయాలని కోరుతూ శశాంక శ్రీధర్ హైకోర్టును ఆశ్రయించారు.రాజకీయ పార్టీలు అధికారం చేపట్టేందుకు అలవిగాని హామీలు ఇస్తూ ప్రజలను మభ్య పెడుతున్నారని పిటిషన్‌లో ఆరోపించారు. వీటి కారణంగా ప్రజలు ప్రలోభాలకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఇష్టారీతిన మేనిఫెస్టోలు, హామీలు ఇచ్చి అధికారం చేపట్టిన తరువాత వాటిని విస్మరిస్తున్నారని పిటిషన్‌లో ఆరోపించారు. ఈ కారణంగా రాజకీయ పార్టీలు ఇచ్చే హామీలు కూడా అవినీతికి కిందకే వస్తాయని, వీటిపై తగిన ఆదేశాలు ఇవ్వాలని కోరారు.జరిపిన కర్ణాటక హైకోర్టు పిటిషనర్ వాదనలను తోసిపుచ్చింది. తాము అమలు చేయాలనుకుంటున్న విధానాల గురించి ఏదైనా పార్టీ ప్రకటించడాన్ని అవినీతిగా పరిగణించలేమని పేర్కొంది. ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 123 కింద మేనిఫెస్టోను అవినీతిగా పరిగణించలేమని తెలిపింది. వాటిని సంక్షేమ విధానాలుగానే చూడాలని, ఆర్థికపరంగా అవి సరైనవేనా కాదా అనేది వేరే విషయమని అభిప్రాయపడుతూ పిటిషన్‌ను కొట్టివేసింది. దీంతో శశాంక దేశ అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. కర్ణాటక హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం పార్టీల మేనిఫెస్టోల్లోని హామీలను ప్రజలు నమ్మితే ఎవరేం చేస్తారని ప్రశ్నించింది. మేనిఫెస్టోను అవినీతిగా పరిగణించలేమని పిల్‌ను తోసిపుచ్చింది.ఎన్నికల సమయంలో పార్టీ ప్రణాళికలను విడుదల చేయడం చట్టబద్ధమైనప్పటికీ వాటి అమలుకు నైతిక బాధ్యత వహించవలసిన అవసరం పార్టీలకు ఉండడం లేదు. అలవికాని హామీలు ఇవ్వడం, ఓటర్లను ప్రలోభ పెట్టడం, గెలిచాక నిలబెట్టుకోలేక పోవడం రివాజుగా మారింది. తమిళనాడులో ఉచిత చీరలు, ప్రెషర్ కుక్కర్లు, వాషింగ్ మిషన్లు, టెలివిజన్లతో ప్రారంభమైన 'రేవిడీ సంస్కృతి' నేడు దేశం అంతా విస్తరించింది. ముఖ్యంగా ప్రాంతీయ పార్టీలు ఉచిత వాగ్దానాలకు బాగా అలవాటు పడ్డాయి. ఉచిత కరెంటు, గ్యాస్ సిలిండర్లు, టికెట్ లేని బస్సు ప్రయాణం, నిరుద్యోగ భృతి, రుణమాఫీ, స్కూటీలు, లాప్టాప్ లు, తాళిబొట్లు, పెళ్లికి సహాయం, తదితర పేర్లతో ఓటర్లను ప్రలోభపెడుతున్న పార్టీలు ఆర్థికవ్యవస్థను అనారోగ్యానికి గురిచేస్తున్నాయి. రాజకీయ పార్టీలు నేడు ఉచితాలకు సంక్షేమ పథకాలకు మధ్య విభజన రేఖను చెరిపివేస్తున్నాయి. ఆర్థికంగా వెనుకబడిన పేద, మధ్యతరగతి ప్రజలకు రోజువారి కనీస సదుపాయాలు రాయితీ ధరతో సులభంగా పొందేందుకు ఇచ్చే సంక్షేమ పథకాలను, ఎలాంటి హేతుబద్ధత లేకుండా విలాసాలను కూడా అవసరాలుగా భ్రమింపజేస్తూ ఉచితంగా ఇస్తూ అవి సంక్షేమ పథకాలుగా పార్టీలు చెబుతున్నాయి. అధికారమే పరమావధిగా సరికొత్త ఉచిత హామీలు ఇవ్వడంలో పార్టీలు తమలో తామే పోటీపడుతున్నాయి. ఉచితాలు నిష్పక్షపాత ఎన్నికలు అనే భావనకు విఘాతంగా మారుతున్నాయి. ప్రజల డబ్బుని ఎగురవేసి ఓట్లు సంపాదించే మార్గాలుగా పార్టీలు ఉచితాలను తీర్చిదిద్దుతున్నాయి. ఉచిత విద్యుత్తు, ఉచిత రవాణా లాంటి దారి తెన్నులేని, ప్రణాళిక లేని పథకాలు ఆయా సంస్థలను నిర్వీర్యం చేసి మొత్తంగా మూసివేతకు దారి తీయవచ్చు. ఇప్పటికే అనేక రాష్ట్రాలు రుణ భారం పెరిగి ప్రాధాన్య రంగాలపై తగిన నిధులను వెచ్చించలేకపోతున్నాయి. బడ్జెట్ పై ఒత్తిడి పెరగటం, విద్య, ఆరోగ్య రంగాలకు నిధుల కొరత, దేశ స్థూల ఉత్పత్తి సామర్థ్యం, ఆర్థిక సమతుల్యం దెబ్బ తినటం, వాంఛనీయం కాని వస్తు సేవల వినియోగం పెరగటం, వంటి నష్టాలు కలుగుతాయి. సంక్షేమం పేరుతో బడ్జెట్ లో సింహం భాగం ఖర్చు చేయడం వల్ల సామాజిక అభివృద్ధి, మౌలిక సదుపాయాల వృద్ధి, ఆధునికీకరణ జరగకపోవడం, సమాజం వెనుకబాటుకు గురికావడం జరుగుతుంది. ఉచితాలపై కమిటీ వేయాలి మేనిఫెస్టోలోని హామీలతో వనరుల వివరాల సమర్పణ తప్పనిసరి చేయడమే గాక, అమలు చేయని పార్టీల గుర్తింపును రద్దు చేసే అధికారం ఎన్నికల సంఘానికి ఇవ్వాలి. ఉచితానుచితాలను నిర్ణయించేలా, ఉచితాలకు సంక్షేమ పథకాలకు మధ్య విభజన రేఖను గుర్తించేందుకు నిపుణుల కమిటీని నియమించాలి. రుణ భారం పెంచే ఆర్థికవృద్ధిని నష్టపరిచే ఉచితాలను రద్దు చేయాలి. ఈసీ అధికారాలపై గల పరిమితులను తొలగించాలి. సంక్షేమ పథకాలు పేద ప్రజలకు వరంగా మారాలి గానీ, పార్టీలకు ఓట్ల వరంగా మారకుండా చూడాలి. రాజకీయ పార్టీల భవిష్యత్తును, అధికారాన్ని నిర్ణయిస్తున్న ఈ ఉచితాల వల్ల సానుకూల, వ్యతిరేక ఫలితాలు కలుగుతున్నాయి. సరైన ప్రణాళికతో ఉత్పాదకతను పెంచేలా పథకాలు ఉంటే ఆర్థిక అభివృద్ధికి దోహదకారి అవుతాయి. ఎంపిక చేసిన వస్తు సేవల ఉత్పత్తి పెరగటం, ఆదాయ అసమానతలు తగ్గటం, దీర్ఘకాలికంగా శ్రామిక శక్తి ఉత్పాదకత పెరగటం జరుగుతుంది. ప్రజలు పేదరికం నుంచి బయటపడడం, ప్రజలకు కనీస అవసరాలు తీర్చడం, మధ్యతరగతి వర్గాలు మిగిలిన డబ్బును పొదుపుకు మళ్ళించడం, దినసరి కూలీలకు భద్రత సమకూరటం, వృద్ధులు అసహాయులకు అపన్నహస్తం అందించటం, విద్య, వైద్య సదుపాయాల కల్పన వల్ల జీవన ప్రమాణం పెరిగి మానవ అభివృద్ధి జరుగుతుంది. ప్రజల వ్యక్తిగత ఆదాయాలు పెరిగి వస్తు వినియోగ సంస్కృతి పెరగటం, డిమాండ్ సప్లై చైన్లు పెరగటం, ఆదాయ వృద్ధి వల్ల స్థూల దేశీయ ఉత్పత్తి పెరగటం సంక్షేమ పథకాల ఉద్దేశమై ఉండాలి. కానీ సంక్షేమమంటే 'ఓటు పథకం'గా మార్చేశారు.

# నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి ప్రజా సమస్యలపై పోరాడిన యోధుడు మండవ మైసయ్య

## – సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి



గరిడేపల్లి, జూన్ 01(తీన్మార్ న్యూస్): నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి ప్రజా సమస్యలపై ఎర్రజెండా నాయకత్వంలో పోరాడిన యోధుడు కామ్రేడ్ మండవ మైసయ్య అని సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్ రెడ్డి అన్నారు. మండలంలోని పొనుగోడు గ్రామంలో ఈరోజు అనారోగ్యంతో మృతి చెందిన సిపిఎం సీనియర్ నాయకులు మండవ మైసయ్య పార్థివ దేహం పై పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొనుగోడు గ్రామంలో సిపిఎం పార్టీ నిర్మాణాన్ని విస్తరించడంలో ఉద్యమాన్ని కాపాడడంలో మైసయ్య పాత్ర మరువలేనిది అన్నారు. అందే నరసయ్య సుందరి బసవయ్యలు చేపట్టిన ఎర్రజెండా బాటలో నడుస్తూ ఎర్రజెండా నాయకత్వంలో ప్రజా సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించారని తెలిపారు. గ్రామంలో పార్టీ నాయకుల మీద శత్రువుల దాడులను నిర్బంధాలను ఎదుర్కొంటూ కేసులు పెట్టి కుటుంబాన్ని ఇబ్బందుల పాలు చేసిన ఎర్రజెండాను విడవలేదని అన్నారు. గ్రామంలో సిపిఎం పార్టీ సర్పంచి ఎంపీటీసీగా గెలిపించడంలో కీలకపాత్ర పోషించి గ్రామ అభివృద్ధికి ప్రజా సమస్యల పరిష్కారానికి అలుపెరగని పోరాటం నిర్వహించాడని అన్నారు. రాజకీయ విలువలకు తిలోదకాలిస్తూ పూటకో పార్టీ మారుతున్న నేటి పరిస్థితుల్లో మైసయ్య చిన్నతనం నుండి సిపిఎం పార్టీలో కడవరకు కొనసాగడం హర్షనీయమని అన్నారు. కామ్రేడ్ మైసయ్య మృతికి సిపిఎం పార్టీ జిల్లా కమిటీ పక్షాన వారి కుటుంబానికి సంతాపం సానుభూతి తెలిపారు. నమ్మిన సిద్ధాంతం కోసం కడవరకు కమ్యూనిస్టుగా బ్రతికిన మైసయ్య ఆశయ సాధన కోసం అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కోట గోపి, సిపిఎం మండల కార్యదర్శి ఎస్కే.యాకుబ్, గ్రామ శాఖా కార్యదర్శి నందిపాటి మట్టయ్య, మండల నాయకులు తుమ్మల సైదయ్య, దోసపాటి భిక్షం, బొల్లెపల్లి శ్రీనివాస్, చామకూరి వెంకటప్పయ్య, మండవ వెంకటేశ్వర్లు, సైదులు, తిరుపయ్య, సుందరయ్య, తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు



## – మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్

పాలకీడు, జూన్ 01(తీన్మార్ న్యూస్): నకిలీ విత్తనాలు ఎరువులు అమ్మితే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు సబ్ ఇన్స్పెక్టర్ లక్ష్మి నర్సయ్య తో కలిసి శనివారం నాడు పాలకీడు మండలం, గుడుగుంట్లపాలెం రైతు వేదిక నందు మండల టాస్క్ ఫోర్స్ టీం విత్తన డీలర్ లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ యొక్క డీలర్ స్టాక్ రిజిస్టర్ మెయింటెయిన్ చేయాలని కోరారు. రైతులకు కావాల్సిన వరి విత్తనాలు మరియు పత్తి విత్తనాలు అందుబాటులో ఉంచాలని రైతులకు ఎటువంటి ఇబ్బందీ కలుగకుండా విక్రయించాలని కోరారు. విత్తనాలు విక్రయించేటప్పుడు రైతులకు తప్పనిసరిగా బిల్ రాసి ఇవ్వాలని ఆదేశించారు. మండలంలో నకిలీ విత్తనాలు అమ్మిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ నర్సయ్య, వ్యవసాయ విస్తరణ అధికారులు శ్రీకాంత్, వెంకటేష్, శారద, మరియు డీలర్లు పాల్గొన్నారు.

# తల్లిదండ్రుల ఆశయ సాధనకు యువత కృషి చేయాలి

– ఓటమి గెలుపుకు నాంది కావాలి
– క్రిడలతో పాటు విద్యలో రాణించి, ఉన్నత స్థాయికి చేరుకోవాలి
– తూడి వెంకటమ్మ – సాయిరెడ్డి ల స్మారక క్రికెట్ టౌర్నమెంట్ ముగింపు కార్యక్రమం
– కాంగ్రెస్ పార్టీ మండల సమన్వయ కర్త తూడి శ్రీనివాస్ రెడ్డి
– ఉమ్మడి జిల్లా క్రికెట్ టౌర్నమెంట్‌లో విన్నర్‌గా పెద్దమందడి, రన్నర్‌గా అడ్డాకుల జట్టు



వనపర్తి ప్రతినిధి, జూన్ 01(తీన్మార్ న్యూస్): యువత తల్లిదండ్రుల ఆశయ సాధనకు కృషి చేయాలని, ఓటమి గెలుపుకు నాంది కావాలని పెద్దమందడి కాంగ్రెస్ పార్టీ మండల సమన్వయకర్త తూడి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మే 23వ తేదీన మద్దిగట్ల గ్రామంలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తూడి శ్రీనివాస్ రెడ్డి, తూడి ప్రభాకర్ రెడ్డిల తల్లిదండ్రులైన తూడి వెంకటమ్మ, తూడి సాయిరెడ్డిల స్మారకార్థం ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ టౌర్నమెంట్‌ను వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ టౌర్నమెంట్‌లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 36 జట్లు పాల్గొన్నాయి. శనివారం ఫైనల్ మ్యాచ్‌లో పెద్దమందడి – అడ్డాకుల జట్లు పోటీ పడగా మొదటగా బ్యాటింగ్ ఎంచుకున్న పెద్దమందడి జట్టు 15 ఓవర్లలో 133 పరుగులు చేయగా , రెండవ స్థానంలో బ్యాటింగ్ చేసిన అడ్డాకుల జట్టు 22 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. శనివారం సాయంత్రం తూడి శ్రీనివాస్ రెడ్డి ప్రథమ స్థానంలో గెలుపొందిన పెద్దమందడి జట్టుకు రూ.50వేల నగదుతో పాటు షీల్డ్‌ను బహుకరించారు. అలాగే రెండవ స్థానంలో గెలుపొందిన అడ్డాకుల జట్టుకు రూ.30వేల నగదుతో పాటు షీల్డ్‌ను అందజేశారు. ప్లేయర్ ప్లే జట్టుగా కానాయపల్లి జట్టుకు షీల్డ్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో తూడి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ నేటి విద్యార్థులు, యువత క్రీడలతో పాటు విద్యలో రాణించి భవిష్యత్తులో అత్యున్నత స్థాయిలో స్థిరపడి ఇటు తల్లిదండ్రులకు, ఇటు పుట్టి పెరిగిన ప్రాంతానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆయన సూచించారు. యువత మేధావులను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఖిల్లాఘణపురం కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త సాయిచరణ్ రెడ్డి, సబ్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, మంగంపల్లి రాఘవేందర్ శెట్టి, పెద్దమందడి, మద్దిగట్ల, వెల్టూరు మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, మాజీ జడ్పీటీసీ వెంకటస్వామి, పుట్టవోని నారాయణ, ఆర్.శ్రీనివాస్ రెడ్డి, చాపల సత్యారెడ్డి, రాంచంద్రయ్య గౌడ్, రాఘవేందర్, కేశవులు గౌడ్, మద్దిగట్ల వివేకానంద, యువజన సంఘం సభ్యులు నాగేష్ యాదవ్, ఖాజా మైనోద్దిన్, బాలకృష్ణ, పరమేష్ యాదవ్, వంశీనాథ్ గౌడ్, రాములు యాదవ్, బాబు సాగర్, తదితరులు పాల్గొన్నారు.

# మూలమలలో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు



ఆత్మకూర్, జూన్ 01(తీన్మార్ న్యూస్): మండల పరిధిలోని మూలమల్ల గ్రామంలో స్వస్తి శ్రీ క్రోధి కృత నామ సంవత్సరం ఉత్తరాయణం వసంత రుతువు, వైశాఖమాసం కృష్ణపక్షం దశమితిథి హనుమాన్ జన్మదినం సందర్భంగా గ్రామంలోని స్థానిక హనుమాన్ దేవాలయంలో హనుమాన్ విగ్రహానికి పంచామృత అభిషేకం ఆకు పూజ మహా మంగళహారతి మూలమల గ్రామ పెద్దలు గ్రామ పూజారి శ్రీధర్ జోషి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రసాద వితరణ చేశారు అదేవిధంగా సాయంత్రం గ్రామంలో హనుమాన్ విగ్రహాన్ని భజన గీతాలతో, కోలాటాల నడుమ వీధి వీధినా ఊరేగిస్తూ శోభాయాత్ర నిర్వహించారు. ఇట్టి కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఐక్యతకు నిదర్శనం గ్రామదేవతల పండుగలు



## – ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తి ప్రతినిధి, జూన్ 01(తీన్మార్ న్యూస్): గ్రామాలలో జరుపుకునే గ్రామ దేవతల పండుగలు గ్రామంలోని ప్రజలందరికీ ఐక్యతను చాటుతాయని, కలిసికట్టుగా అందరూ నిర్వహించుకునే పండుగలు గ్రామ ప్రజల ఐక్యతను చాటుతాయని ఆయన అన్నారు. శనివారం ఖిల్లా ఘనపురం మండలం మామిడిమడ గ్రామంలో నిర్వహించిన కోట మైసమ్మ దేవాలయ ఉత్సవాల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోట్ల మైసమ్మకు మహిళలు బోనాలు సమర్పించే కార్యక్రమంలో పాల్గొని బోనాలెత్తిన మహిళలతో పాటు ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు.

ఆలయంలోని మైసమ్మకు ఆయన కొబ్బరికాయలు కొట్టి నైవేద్యాన్ని సమర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామస్తులందరూ ఐక్యంగా ఉండాలని ఐక్యమత్యంతోనే ఎటువంటి అభివృద్ధి పనులైన చేసుకోవచ్చని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు వెంకట్రావు సాయి చరణ్ రెడ్డి, గ్రామ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# హోపూరి సురేష్ శెట్టి సేవలకు గుర్తింపుగా డాక్టరేట్

**– వనపర్తి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో సురేష్ శెట్టి కి ఘన సన్మానం**



వనపర్తి ప్రతినిధి, జూన్ 01(తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా కేంద్రానికి చెందిన ఆర్యవైశ్య నాయకులు పూరి సురేష్ శెట్టి డాక్టరేట్ పొందిన సందర్భంగా శనివారం వనపర్తి జిల్లా ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో షాలువా కప్పి పూల మాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు అంబటి స్వామి, పూదురు పవన్ కుమార్ లు మాట్లాడుతూ సురేష్ శెట్టి కరోనా కాలంలో ఆయన ఆరోగ్యాన్ని లెక్కచేయకుండా కరోనా పేషెంట్స్ దగ్గరికి వెళ్లి మాస్కులు, అన్నదానం, శానిటైజర్లు ఉచితంగా పంపిణీ చేశారని వారు చెప్పారు. కృష్ణపట్నం ఆనందయ్య మందును, నిత్యవసర వస్తువులు, పలు రకాల సేవా కార్యక్రమాలు శ్రీ వాసవి సేవా సమితి, వాసవి క్లబ్ ద్వారా సేవలు అందించారని వారు వెల్లడించారు. ఆయన నిస్వార్థ సేవలకు గుర్తింపుగా తమిళనాడులోని ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ యూనివర్సిటీ వారు డాక్టర్ రేట్ పట్టా ఇచ్చి ఆయనను ఘనం సత్కరించారని వారు చెప్పారు. పూరి సురేష్ శెట్టి నిత్యం ప్రజా సేవలో ఉండటం గర్వకారణమని వారు కొనియాడారు. పూరి సురేష్ శెట్టి వనపర్తి ప్రెస్ క్లబ్ కు గౌరవ సలహా దారులుగా సేవలు అందిస్తున్నారని వారు చెప్పారు. భవిష్యత్తు లో ఆయన మరిన్ని సేవలు అందించాలని వారు ఆకాంక్షించారు. ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు గంధం రవి, కాటేపాగ ఉస్సేన్, కానమోని ఆంజనేయులు, కార్యదర్శి కడమంచి శేఖర్, సాయి రాం, తదితరులు సన్మానించారు.

# ముంపు ప్రాంతాలపై యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలి

**జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి.శ్రీజ**



ములుగు, జూన్ 01 (తీన్మార్ న్యూస్): జిల్లాలోని ముంపు ప్రాంతాలను పై యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి.శ్రీజ నీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా అదనపు కలెక్టర్ పి.శ్రీజ నీటి పారుదల శాఖ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే వర్షాకాలంలో విపత్తు నిర్వహణపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. జిల్లాలోని చెరువులు, కుంటలు, ప్రాజెక్టులు, వాటి ప్రస్తుత నీటి నిలువ, పూర్తి నీటి నిల్వ సామర్థ్యం, కరకట్టల పరిస్థితి ఏవిధంగా ఉంది అనే ప్రాథమిక సర్వే నిర్వహించి పూర్తి వివరాలు అందించాలని నీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా నీటిపారుదల శాఖ అధికారి అప్పలనాయుడు, ములుగు ఈ ఈ నారాయణ, అకులవారి ఘనపురం డి ఈ యశ్వంత్, భద్రాచలం డి ఈ గోపాల కృష్ణ, ఏఈలు, జె ఏ లు తదితరులు పాల్గొన్నారు.

# అమ్మ ఆదర్శ పాఠశాల పనులు సకాలంలో పూర్తి చేయాలి

**అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి.శ్రీజ**



వెంకటాపూర్, జూన్ 01 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ప్రభుత్వం పాఠశాలల్లో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాల పనులు సకాలంలో పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి.శ్రీజ అన్నారు. శనివారం అదనపు కలెక్టర్ పి శ్రీజ వెంకటాపూర్ మండలం ఎల్లారెడ్డిపల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, జవహర్ నగర్ గ్రామం లోని కస్తూర్బా గాంధీ పాఠశాల మరియు ఆదర్శ పాఠశాల ను ఆకస్మికంగా తనిఖీ చేసి, పనుల పురోగతిని, నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ నాణ్యతలో రాజీ పడకూడదని, విద్యార్థులకు ఉపయోగపడే అత్యవసర పనులను త్రాగునీరు, మూత్రశాలల మరమ్మతులు, ఎలక్ట్రిఫికేషన్ లాంటి కనీస అవసరాలను అమ్మ ఆదర్శ పాఠశాల పనులలో ఎంపిక చేసి పూర్తి చేయడం జరుగుచున్నదని తెలిపారు. కేజీబీవీ వెంకటాపూర్ పాఠశాలలో విద్యార్థుల అవసరాల కోసం మౌలిక సదుపాయాలు కోసం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా పనులు పూర్తి చేసుకోవాలని, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పాఠశాల పున ప్రారంభం కంటే ముందే పూర్తి చేసుకోవాలని కేజీబీవీ ప్రత్యేక అధికారిని ఆదేశించారు. జరుగుతున్న పనులను ప్రతిరోజు పర్యవేక్షణ చేస్తూ నాణ్యతతో కూడిన పనులను సకాలంలో పూర్తి చేయవలసిందిగా ఏ ఈ లను, మండల విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి పాణిని, సమగ్ర శిక్ష ప్లానింగ్ కోఆర్డినేటర్ అర్షం రాజు, ములుగు, వెంకటాపూర్ మండలాల తాత్కాలిక ఇన్చార్జి మండల విద్యాశాఖ అధికారి సూర్యనారాయణ, ఏఈ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

**– దాతల సహకారంతో మహా అన్నదాన కార్యక్రమం**





గరిడేపల్లి, జూన్ 01(తీన్మార్ న్యూస్): సూర్యాపేట జిల్లా, గరిడేపల్లి మండల కేంద్రంలో కాకతీయుల కాలంలో స్వయం భుగా వెలసిన అభయా ంజనేయ స్వామి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిం చారు. అభయాంజనేయ స్వామి జన్మ దినోత్సవ వేడుకల్లో భాగంగా శనివారం వేకువ జామున ప్రారంభమైన పూజా కార్యక్రమాలలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, పంచామృతాభిషేకాలు, సహస్రనామార్చన, ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. పూజా కార్యక్రమం అనంతరం గ్రామంలోని యువకులు జై హనుమాన్ జై జై హనుమాన్ అంటూ గ్రామంలోని ప్రధాన రహదారులలో 200 బైకులతో ర్యాలీ నిర్వహించారు. మధ్యాహ్నం దాతల సహకారంతో సుమారు 4000 మందితో మహా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం అభయాంజనేయ స్వామి ఉత్సవ విగ్రహాలతో గ్రామ పురవీధులలో డీజే చప్పుళ్లతో, కోలాట బృందం, భక్తజన బృందం భారీ సంఖ్యలో ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు సుదర్శనం వరదరాజన్ ఆచార్యులు, గ్రామ ప్రత్యేక అర్చకులు సుదర్శనం శ్రీనివాసచార్యులు, బాల అర్చకులు సుదర్శనం సీతారామ ఆచార్యులు, గ్రామ పురోహితులు కొంపెల్లి కృష్ణశాస్త్రి, హనుమాన్ దీక్ష స్వాములు, అభయాంజనేయ స్వామి భక్తులు, సీతారామచంద్రస్వామి భక్తులు, శివాలయం భక్తులు, లక్ష్మీనరసింహస్వామి భక్తులు, అయ్యప్ప స్వామి భక్తులు, గుండాలమ్మ తల్లి భక్తులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, కుల మతాలకతీతంగా పాల్గొని విజయవంతం చేశారు.

# రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

**ములుగు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి**






ములుగు, జూన్ 01 (తీన్మార్ న్యూస్): రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. జూన్ 2 తేదీ కలెక్టరేట్ కార్యాలయం ఆవరణలో జరగనున్న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల మహోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామని శనివారం జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 2వ తేదీ ఉదయం అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. పండుగ వాతావరణంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరుపుకోవాలని, గ్రామపంచాయతీలలో ప్రత్యేక అధికారులు జాతీయ పతాకాన్ని ఆవిషరించాలని సూచించారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు-2024 సందర్భంగా జరుగనున్న కార్యక్రమాల వివరాలు ఉదయం 8.50 గంటలకు కలెక్టర్ కార్యాలయానికి జిల్లా ఎస్పి చేరుకుంటారు. ఉదయం 8.55 నిమిషాలకు కార్యాలయానికి జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి చేరుకుంటారు. ఉదయం 09.00 గంటలకు జిల్లా కలెక్టర్ జాతీయ జెండాను ఆవిష్కరించి జాతీయ గీతాలాపన చేస్తారు. ఉదయం 9:05 నిమిషాలకు జిల్లా కలెక్టర్ గౌరవ వందనం స్వీకరిస్తారు. ఉదయం 9.10 నిమిషాలకు జిల్లా కలెక్టర్ తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం గురించి ప్రసంగిస్తారు. ఉదయం 9.15 నిమిషాలకు కార్యక్రమం ముగుస్తుంది. ఈ వేడుకలకు అధికారులు, ప్రజలు, విద్యార్థులు, మీడియా ప్రతినిధులు హాజరుకావాలని తెలిపారు.

# హనుమాన్ జయంతి కి పూజ సామాగ్రి పంపిణీ

**– దేవాలయంలో ప్రత్యేక పూజలు**

**– రెండు నెలలకు 26 రకాల పూజా సామాగ్రి పంపిణీ**

**– సామాజిక కార్యకర్త దిడ్డి ప్రవీణ్ కుమార్**



దేవరకద్ర ప్రతినిధి, జూన్ 01(తీన్మార్ న్యూస్): హనుమాన్ జయంతిని పురస్కరించుకొని శనివారం మహబూబ్ నగర్ మండలం యెనుకొండ గ్రామ పరిధిలో గల శ్రీశ్రీశ్రీ పోబ్బతి ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధూప, దీప, నైవేద్యంలతో పాటు దేవాలయాలకు తమ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పూజా సామాగ్రిని పంపిణీ చేస్తున్నట్లు సామాజిక కార్యకర్త, నేను సైతం స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు దిడ్డి ప్రవీణ్ కుమార్ తెలిపారు. దేవాలయంలో ప్రతిరోజు నిత్యం పూజకు అవసరమయ్యే ధూపం, దీపం నూనె, కర్పూరం, అగరవత్తులు తోపాటు మొత్తం 26 రకాలైన పూజ సామాగ్రిని పంపిణీ చేసినట్లు ఆయన కోరారు. గతంలో పలు దేవాలయాలకు తమ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పూజ సామాగ్రి పంపిణీ చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అప్పుడు, ఇప్పుడు ఏ ఒక్కరి నుండి ఒక్క రూపాయి చందాలు వసూలు చేయకుండా స్వచ్ఛందంగా తమ సంస్థ ఆధ్వర్యంలో దాదాపు రెండు నెలలకు సరిపడా పూజా సామాగ్రిని పలు దేవాలయాలకు పంపిణీ చేసినట్లు ప్రవీణ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీశ్రీశ్రీ పోబ్బతి ఆంజనేయస్వామి దేవాలయం కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కౌంటింగ్ పనులు ఏకాగ్రతతో నిర్వర్తించాలి

**– జిల్లా కలెక్టర్ హనుమంతు కే. జేండగే సూచన**





భువనగిరి, జిల్లా ప్రతినిధి, జూన్ 01(తీన్మార్ న్యూస్): కౌంటింగ్ పనులను పూర్తి ఏకాగ్రత్తతో నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరు హనుమంత్ కే.జెండగే కౌంటింగ్ సిబ్బందికి సూచించారు. ఈనెల 4 న స్థానిక అరోరా ఇంజనీరింగ్ కాలేజీలో 14- భువనగిరి పార్లమెంట్ నియోజక వర్గం సంబంధించి 7 అసెంబ్లీ సెగ్మెంట్లకు చెందిన కౌంటింగ్ పనుల దృష్ట్యా శనివారం నాడు కలెక్టరేటు సమావేశ మందిరంలో కౌంటింగ్ సూపర్వైజర్లు, అసిస్టెంట్ కౌంటింగ్ సూపర్వైజర్లు, మైక్రో అబ్జర్వర్లకు పోస్టల్ బ్యాలెట్, ఇవిఎం కౌంటింగ్, ఇటిపిబిఎస్ కౌంటింగ్ విధులపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా రెండవ విడుత శిక్షణా కార్యక్రమం నిర్వహించబడింది. కౌంటింగ్ నిర్వహణ పూర్తి ఏకాగ్రతతో నిర్వర్తించాలని, ఏజెంట్ల సమక్షంలో కౌంటింగ్ వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలని జిల్లా కలెక్టరు వారికి సూచించారు. శిక్షణా కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టరు కె.గంగాధర్, జనగాం జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టరు పింకేశ్ కుమార్, ఇబ్రహింపట్నం అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి కే.అనంతరెడ్డి, జిల్లా పరిషత్ సిఇఓ శోభారాణి, జిల్లా విద్యాశాఖ అధికారి కె.నారాయణరెడ్డి, కలెక్టరేటు పరిపాలన అధికారి జగన్మోహనప్రసాద్, జిల్లా లీడ్ మేనేజరు రామకృష్ణ, జిల్లా స్థాయి మాస్టం ట్రైనర్స్ నర్సిరెడ్డి, హరినాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# రామన్నపేట లో ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

**– ఘనంగా నిర్వహించిన కాంగ్రెస్ శ్రేణులు**

**– అనంతరం ఆసుపత్రిలో పండ్ల పంపిణి**



రామన్నపేట, జూన్ 01(తీన్మార్ న్యూస్): నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం పుట్టినరోజు వేడుకలను శనివారం మండల కేంద్రంతోపాటు జనంపల్లి గ్రామంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని సుభాష్ సెంటర్లో కేక్ కట్ చేయగా, జనంపల్లి, వెల్లంకి గ్రామాలలో కూడలి ప్రాంతంలో కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సిరిగిరెడ్డి మల్లారెడ్డి ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ చేశారు. అనంతరం పుట్టినరోజు శుభాకాంక్షలు తెలపడానికి కార్యకర్తలు నాయకులు నకరేకల్ కు బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పూస బాలమణి బాలనరసింహ, జడ్పిటిసి పున్న లక్ష్మీ జగన్మోహన్, టిపిసిసి అధికార ప్రతినిధి మేడి రవిచంద్ర, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పున్న రమేష్, జినుకుల ప్రభాకర్, ఎంపీటీసీ మాడూరి జ్యోతి రామచందర్ రావు, ఎంపీటీసీ మహమ్మద్ రెహాన్, కాంగ్రెస్ పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు గాదె శోభారాణి, పట్టణ అధ్యక్షులు మొహమ్మద్ జమీరుద్దీన్, నాయకులు గోదాసు పృథ్వీరాజ్, ఎండి అక్రమ్, జేల్లా వెంకటేష్, సేవాదళ్ నియోజకవర్గం అధ్యక్షులు మోటే రమేష్, సాల్వేరు లింగం, తదితరులు పాల్గొన్నారు.



# ప్రముఖ వ్యాపార వేత్తకు సన్మానం



ఆలేరు, జూన్ 01(తీన్మార్ న్యూస్): ఆలేరు పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపార వేత్త గుండు శ్రీశైలంను హనుమాన్ జయంతి సందర్భంగా ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, డాక్టర్ వంగపల్లి అంజయ్య స్వామి వారిని సన్మానించారు. ఈ సందర్భంగా నాగర్ కర్నూలు జిల్లా ఉమామహేశ్వర దేవస్థానం లడ్డు ప్రసాదాన్ని అందజేసి శాలువాతో సత్కరించి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆలేరు హెచ్ఎంటీవీ రిపోర్టర్ గుండు మహేందర్, సత్య రిపోర్టర్ గుండు మధుసూదన్, వార్త రిపోర్టర్ కూల్ల సిద్ధులు, తదితరులు పాల్గొన్నారు.

# టెన్త్ ఎగ్జామ్స్ కు అంతా రెడీ

హైదరాబాద్: తెలంగాణలో జూన్ 3 నుంచి ప్రారంభంకానున్న పదోతరగతి సప్లిమెంటరీ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కృష్ణారావు మే 27న ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది సప్లిమెంటరీ పరీక్షలకు మొత్తం 51,237 మంది హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో 31,625 మంది బాలురు ఉండగా.. 19,612 మంది బాలికలు ఉన్నారన్నారు. పరీక్షల కోసం రాష్ట్రవ్యాప్తంగా 170 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. పరీక్షలకు సంబంధించిన హాల్‌టికెట్లను ఇప్పటికే ఆయా పాఠశాలలకు పంపామని, వెబ్‌సైట్ నుంచి కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని కృష్ణారావు తెలిపారు.ప్రకటించిన షెడ్యూలు ప్రకారం జూన్ 3 నుంచి 13 వరకు పదోతరగతి అడ్వాన్స్‌డ్ పరీక్షలు నిర్వహించనున్న సంగతి తెలిసిందే. సైన్స్ పరీక్షలు ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు, ప్రథమ భాషలో కాంపోజిట్ కోర్సుల పరీక్షలు ఉదయం 9.30 నుంచి 12.50 గంటల వరకు నిర్వహిస్తారు.ఇక మిగిలిన అన్ని పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు నిర్వహించనున్నారు .ప్రారంభానికి రెండు రోజుల ముందు వరకు రూ.50 ఆలస్య రుసుం చెల్లించి దరఖాస్తులు సమర్పించవచ్చు. సప్లిమెంటరీ పరీక్షకు సంబంధించి ఒకటి నుంచిమూడు సబ్జెక్టుల వరకు దరఖాస్తు చేసుకునేవారు రూ.110,మూడుకంటే ఎక్కువ సబ్జెక్టులకు రూ.125 ఫీజుగా చెల్లించాలి.

పరీక్షల షెడ్యూలు ఇలా..

- జూన్ 3న: తెలుగు, ఫస్ట్ లాంగ్వేజ్ కాంపోజిట్ కోర్సు-1, కాంపోజిట్ కోర్సు-2 పరీక్షలు
- జూన్ 5న: సెకండ్ లాంగ్వేజ్
- జూన్ 6న: ఇంగ్లిష్
- జూన్ 7న: మ్యాథమెటిక్స్
- జూన్ 8న: భౌతికశాస్త్రం (ఫిజికల్ సైన్స్)
- జూన్ 10న: జీవశాస్త్రం (బయాలజీ)
- జూన్ 11న: సాంఘికశాస్త్రం (సోషల్ స్టడీస్)
- జూన్ 12న: ఓఎస్ఎస్‌సీ (ఓరియంటెల్ సెకండరీ స్కూల్ సర్టిఫికేట్) ప్రధాన భాష (సంస్కృతం, అరబిక్) పేపర్-1,
- జూన్ 13న: ఓఎస్ఎస్‌సీ ప్రధాన భాష (సంస్కృతం, అరబిక్) పేపర్-2 పరీక్షలు జరుగుతాయి.

ఈ ఏడాది మార్చి 18 నుంచి ఏప్రిల్ 2 వరకు పరీక్షలు నిర్వహించిన సంగతి తెలిసిందే. పరీక్షలకు మొత్తం 5,05,813 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్ష రాసినవారిలో 4,91,862 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఫలితాల్లో మొత్తం 91.31 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఈసారి కూడా బాలికలే పైచేయి సాధించారు. బాలికలు 93.23 శాతం ఉత్తీర్ణులు కాగా, బాలురు 89.42 శాతం ఉత్తీర్ణులయ్యారు. ఫలితాల్లో 99.09 శాతంతో నిర్మల్ జిల్లా మొదటి స్థానంలో నిలవగా, 98.65 శాతం ఉత్తీర్ణతతో సిద్ధిపేట జిల్లా రెండోస్థానంలో, 98.27 శాతం ఉత్తీర్ణతతో సిరిసిల్ల జిల్లా మూడో స్థానంలో నిలిచింది. ఇక 65.10 ఉత్తీర్ణతతో వికారాబాద్ జిల్లా అట్టడుగు స్థానంలో నిలిచింది. పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు జూన్ 3 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు.

# ఆత్మకూరులో ఘనంగా శ్రీ ఆంజనేయస్వామి జన్మదినోత్సవం వేడుకలు





ఆత్మకూర్, జూన్ 01(తీన్మార్ న్యూస్): ఆత్మకూరు పట్టణ కేంద్రంలో వైశాఖమాసం కృష్ణపక్షం దశమతిథి హనుమాన్ జన్మ దినోత్సవం సందర్భంగా పట్టణ కేంద్రంలోని నేతాజీ నగర్ లో గల శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో ఆంజనేయ స్వామికి ఆత్మకూరు మున్సిపల్ చైర్ పర్సన్ గాయత్రి రవికుమార్ యాదవ్, ఆత్మకూర్ కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు రహమతుల, పట్టణ అధ్యక్షులు నల్గొండ శ్రీనివాసులు, మండల అధ్యక్షులు పరమేష్, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పట్టణ కేంద్రంలో భారీ ఎత్తున హనుమాన్ శోభాయాత్రను నిర్వహించారు.

# తగ్గిన పర్సంటేజ్...!

వరంగల్: సాధారణ ఎన్నికలను తలపించేలా తెలంగాణలో ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగాయి. చిన్న చిన్న చెదురుముదురు ఘటనలు మినహా వరంగల్ ఖమ్మం నల్గొండ పట్టభద్రుల శాసనమండలి ఉప ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. అయితే మునుపటి ఎన్నికలతో పోలిస్తే.. ఈసారి ఉప ఎన్నికలో పోలింగ్ పర్సంటేజ్ తగ్గింది. పట్టబద్రులు ఓటరు నమోదు చేసుకోవడంలోను కొంత అలసత్వం వహించారు. ఊహించని విధంగా పోలింగ్ శాతం తగ్గడం ఆందోళన కలిగిస్తోంది.2021లో పట్టభద్రుల ఎన్నికలు జరగగా 5 లక్షల5 వేల565 ఓటర్లకు గాను 3లక్షల 87 వేల 989 మంది గ్రాడ్యుయేట్స్ వారి ఓటు హక్కు వినియోగించుకున్నారు. అప్పుడు 76.73శాతం పోలింగ్ నమోదైంది. ఈసారి సాయంత్రం 4 గంటల వరకు 68.65 శాతం పోలింగ్ నమోదైంది. 4 గంటల్లోపు క్యూలైన్లలో నిల్చున్న వారికి ఓటేసేందుకు అధికారులు అవకాశం కల్పించారు. ఈసారి మొత్తంగా పోలింగ్ పర్సంటేజ్ 72.37 % నమోదైనట్లు ఎన్నికల సంఘం అధికారులు ప్రకటించారు.గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్ రెడ్డి 12 వేల 806 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన జనగామ శాసనసభ స్థానం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుపొందారు. దీంతో ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది.ఈసారి ఉప ఎన్నికల్లో కొత్తగా మళ్లీ పట్టభద్రుడు ఓటు నమోదు చేసుకోవాలని సూచించిన నేపథ్యంలో లాస్ట్ టైం కంటే తక్కువ మంది 4 లక్షల 63 వేల 839 మంది పట్టభద్రులు ఓటరు నమోదు చేసుకున్నారు. అటు పోలింగ్ విషయంలో చేతులెత్తేశారు. ఇక పార్లమెంట్ ఎన్నికల బిజీలో పడ్డ కొందరు మంత్రులు, ఎమ్మెల్యేలు ఇతర ప్రజాప్రతినిధులు కూడా ఓటు హక్కు నమోదు చేయించుకోలేదు. ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల పరిధిలోని 34 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 605 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ప్రక్రియ కొనసాగింది. ఈ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల బరిలో మొత్తం 52 మంది అభ్యర్థులు ఉన్నారు.గత ఎన్నికలతో పోల్చితే పోలింగ్ పర్సంటేజ్ తగ్గడం కొందరి అభ్యర్థులను కలవర పెడుతుంటే.. మరికొందరిలో కాన్ఫిడెన్స్ పెంచుతుంది. నమోదైన పోలింగ్ పై అభ్యర్థులు ఎవరిపాటికి వారు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. పోలింగ్ ముగిసిన క్షణం నుంచి పోలింగ్ పర్సంటేజ్ తగ్గడం ఎవరికి లాభం? ఎవరికి నష్టం? అనే చర్చ తీవ్రంగా జరుగుతోంది. ప్రభుత్వ వ్యతిరేక ఓటర్లే తరలివచ్చి ఓటు హక్కు సద్వినియం చేసుకున్నారని.. ఆ ఓటు కచ్చితంగా తన విజయానికి దోహదపడుతుందని బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్ రెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీపై ఉన్న విశ్వాసంతో విద్యావంతులు తనను మొదటి ప్రాధాన్యత ఓటుతోనే శాసన మండలికి పంపుతారని సంపూర్ణ విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.అటు బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్ రెడ్డి కూడా గెలుపు విశ్వాసంతో ఉన్నారు. తనలాంటి విద్యావంతుని ప్రశ్నించే గొంతుకను శాసనమండలికి పంపడం కోసం విద్యావంతులంతా కంకణం కట్టుకున్నారని.. ప్రభుత్వ వ్యతిరేక ఓట్లే తనకు పట్టం కడతాయని ధీమా వ్యక్తం చేస్తున్నారు. అయితే ప్రభుత్వ అనుకూల ఓట్లే దాదాపుగా నమోదయాయని అవి తన విజయానికి దోహదపడతాయని కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్న ధీమాతో ఉన్నారు. ఓటర్లు తనకు మద్దతుగా నిలిచారని కాన్ఫిడెన్స్ వ్యక్తం చేశారు.ఓవైపు లాస్ట్‌టైం కంటే పోలింగ్ పర్సెంటేజ్ తగ్గడంతో.. పట్టభద్రులు ఈసారి పట్టం కడతారోనన్న ఉత్కంఠ నెలకొంది. ఈ ఎమ్మెల్సీ ఉపఎన్నిక ఓట్ల లెక్కింపును జూన్ 5న చేపట్టి, ఫలితాలు వెల్లడించనున్నారు

# వాహనాలు ఇలా.. పనులు ఎలా?



కరీంనగర్ :స్వచ్ఛ సర్వేక్షణ్‌లో సత్తా చాటుతున్న కరీంనగర్ నగరపాలక సంస్థ పారిశుద్ధ్య పనుల నిర్వహణలో డీలా పడుతోంది. పరిశుభ్రతలో పోటీ పడిన బల్దియా ప్రస్తుతం వెనుకబడే పరిస్థితి వచ్చింది. కార్మికులతో తప్ప యంత్రాలతో పనులు ఆశించిన స్థాయిలో జరగడం లేదు. నగరంలోని 60 డివిజన్ల నుంచి చెత్త సేకరణ మొదలుకొని, నిల్వ చేసిన చెత్తతో పాటు మురుగునీటి కాల్వల ద్వారా వచ్చిన పూడికను డంపింగ్‌యార్డుకు తరలిస్తారు. వీటికి ట్రాక్టర్లు అవసరం. తారు రోడ్లను ఊడ్చేందుకు వినియోగిస్తున్న స్వీపింగ్ మిషన్లు సైతం పాడయ్యాయి. ప్రతిరోజు తారు రోడ్లను ఊడ్చేందుకు ఊడ్చే యంత్రాలను వినియోగిస్తున్నారు. వీటికి తరుచుగా బ్రష్‌లు అరిగిపోవడం, హైడ్రాలిక్ పరికరాలు చెడిపోతుండటంతో ఇబ్బందులు పడుతున్నారు. అయినప్పటికి తాత్కాలికంగా మరమ్మతులు చేసుకొని వీటిని రోడ్లపై ఊడుస్తున్నారు. ఒక్కో రహదారిని రెండుసార్లు ఊడిస్తే తప్ప శుభ్రం కావడం లేదు. బ్రష్‌లు సరిగా లేకపోవడంతో ఊడిచే సమయంలో విపరీతమైన దుమ్ములేస్తోంది. వీటికి రెండేళ్ల నుంచి సర్వీసింగ్ చేయించలేదు. డంపింగ్‌యార్డులో ఎక్స్‌లేటర్, పొక్లెయిన్, బుల్డోజర్, బ్లేడ్ డోజర్ వాహనాలు ఉండగా ఆయిల్ మార్చి బకెట్ పళ్లు బిగించాలి. గేర్ బాక్స్, డైనమా మార్చాలి. బ్లేడ్ ట్రాక్టర్‌కు ముందు, వెనకాల టైర్లు అరిగిపోయాయి. జెట్టింగ్ మిషన్‌కు 30 మీటర్ల స్ప్రింగ్ పైపు, జెట్ నౌజల్ అవసరం. స్వచ్ఛ ఆటోలకు టైర్లు, ఆయిల్ మార్చడం, హైడ్రాలిక్ ఆయిల్, సర్వీసింగ్, కమాన్ పట్టీలు చెడిపోయాయి. ఫాగింగ్ మిషన్లలన్నింటికీ చిన్న, చిన్న సాంకేతిక సమస్యలు ఉన్నాయి. కంప్యాక్టర్ వాహనాల్లో టైర్లు అవసరం. వెల్డింగ్ చేయాల్సి ఉంది. దంపన్‌ప్లేసర్ మిషన్లకు కీపింగ్ వర్క్స్, ఫోర్ వీలర్ ఆటో సర్వీసింగ్, ఆయిల్ మార్పిడి చేయాలి. స్వీపింగ్ మిషన్లకు సైడ్, మధ్యలోని బ్రష్‌లు అరిగి పోయాయి. హైడ్రాలిక్ విధానం పని చేయడం లేదు. మోటార్లు రిపేర్ చేయించాల్సి ఉండగా సైడ్ రబ్బర్లు వేయించాలి.చెత్త తరలింపునకు ఆటంకాలు పారిశుద్ధ్య పనులకు సంబంధించిన వాహనాలు మొరాయిస్తున్నాయి. ట్రాక్టర్లు అయితే ఎక్కడ ఆగిపోతాయో తెలియని గందరగోళం నెలకొంది. ట్రాక్టర్‌కు ఉండే డబ్బా (ట్రాలీలు) ఎక్కడికక్కడే ఊడిపోతుంది. తాళ్లతో కట్టుకొని కాలం వెల్లదీస్తున్నారు. వీటికి వెల్డింగ్ అవసరం. సెల్ఫ్ మోటార్లు, టైర్లు, బ్యాటరీలు, ఇంజిన్ రిపేర్, వైరింగ్ పనులు చేయకపోవడంతో కార్మికులు నానావస్థలు పడుతున్నారు. కొన్ని చోట్ల రెండు డివిజన్లకు ఒక ట్రాక్టర్ ఉండగా అదీ కూడా సక్రమంగా రాకపోవడంతో చెత్త పేరుకుపోతోంది.

# చేప పిల్లల పంపిణీ ఉన్నట్టా? లేనట్టా?



నిర్మల్, : కేసీఆర్ ప్రభుత్వం మత్స్యకారులను ఆర్థికంగా ఆదుకునేందుకు ఉచితంగా చేపపిల్లల పంపిణీ పథకానికి శ్రీకారం చుట్టింది. దాదాపు ఎనిమిదేండ్లపాటు యేటా వానకాలం ప్రారంభానికి ముందే చెరువులు, రిజర్వాయర్లలో చేప పిల్లలను వదలడానికి ప్రణాళికలు రూపొందించే వారు. మే నెల చివరి నాటికి టెండరు ప్రక్రియ కూడా పూర్తి చేసి.. జూన్, జూలై మాసాల్లో చెరువుల్లోకి కొత్తనీరు చేరగానే వదిలేవారు. కాగా.. ఈ యేడు చేపపిల్లల పథకం అమలుపై నీలినీడలు కమ్ముకుం టున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా పంపిణీపై మాట కూడా లేదు. దీంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు లేకపోవడంతో అధికారులు కార్యాచరణ రూపొందించలేదు. ఈసారి చేపపిల్లల పంపిణీ ఉంటుందా? ఉండదా? అన్న అయోమయంలో మత్స్యకారులు ఉన్నారు. నిర్మల్ జిల్లాలో 214 మత్స్యకార సంఘాలు ఉండగా 13,300 మంది సభ్యులు ఉన్నారు. 19 మండలాల పరిధిలో 644 చెరువులు ఉన్నాయి. వీటితోపాటు ఎస్సారెస్పీ, కడెం, స్వర్ణ, గడ్డెన్న వాగు ప్రాజెక్టులు ఉన్నాయి. ఆయా రిజర్వాయర్లు, చెరువుల్లో గతేడాది వర్షాకాలంలో 4.75 కోట్ల ఉచిత చేప పిల్లలను విడుదల చేయాలని మత్స్యశాఖ అధికా రులు ప్రతిపాదించారు. వీటికి అప్పటి ప్రభుత్వం ఆమోద ముద్ర వేసింది. ఆ మేరకు చేప పిల్లలను సరఫరా చేసే కాంట్రాక్టర్ల కోసం మే నెలలో టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి జూలై, ఆగస్టు మాసాల్లో చేప పిల్లలను చెరువులు, రిజర్వాయర్లలో విడుదల చేసింది. కాగా.. పెంచిన చేపలను మార్కెట్‌కు తరలించి విక్రయించేందుకు వాహనాలు, వలలను సబ్సిడీపై అందజేసి కేసీఆర్ ప్రభుత్వం మత్స్యకారులకు అండగా నిలిచింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు చేప పిల్లల పంపిణీపై ఊసెత్తక పోవడంతో మత్స్యకారులు మండిపడుతున్నారు. అయితే ఈ విషయమై జిల్లా అధికారులను సంప్రదించగా.. పార్లమెంటు ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున జూన్ 4 తర్వాత స్పష్టత వచ్చే అవకాశం ఉ ఒందంటున్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే టెండర్ ప్రక్రియను పూర్తి చేయకపోతే ఈ సంవత్సరం ఉచిత చేపపిల్లల పంపిణీ ఉ ఒడదనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. మత్స్యకారుల సమస్యలను ఈ కాంగ్రెస్ ప్రభు త్వం ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. వర్షాకాలం ప్రారంభమవు తున్నా.. ఇంతవర కు చేప పిల్లల కోసం టెండర్లు పిలువ లేదు. మత్స్యకార శాఖకు ఇంతవరకు మంత్రి కూడా లేదు. తమకు రావాల్సిన సబ్సిడీలు, ఇతర బెనిఫిట్స్ ఏవీ కూడా రావడం లేదు. గతంలో ఏ ప్రభుత్వాలు కూడా గంగ పుత్రులను ఇంతగా నిర్లక్ష్యం చేయలేదు. కేసీఆర్ ప్రభుత్వంలో చేపల సీడ్ కోసం మార్చి నెల నుండే టెండర్లను పిలిచి మే నెలాఖరు వరకు పూర్తి చేసేవారు. జూన్ నుంచి ఆగస్టు లోపు సీడ్ కూడా పంపిణీ జరిగి చెరువుల్లో వదిలేవారు. ప్రభుత్వం వెంటనే స్పందించి చేపపిల్లల పంపిణీకి చర్యలు తీసుకోవాలి.

# సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులకు మంచి రోజులు

హైదరాబాద్: రాష్ట్రంలో ని రిజిస్ట్రార్ కార్యాలయాలను కార్పొరేట్ ఆఫీసులకు ధీటుగా తీర్చిదిద్దాలని ప్రభు త్వం నిర్ణయించింది. రాష్ట్రంలోని 141 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో చాలావరకు అద్దె ఆఫీసుల్లోనే కొనసాగుతున్నాయి. చా లా ఏళ్లుగా ఇరుకు ఆఫీసుల్లో పనిచేయలేక అధికారులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలోనే వాటి స్థానం లో కార్పొరేట్ కార్యాలయాలను తలదన్నే రీతిలో అధునాతన భవనాలు నిర్మించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయిం చారు. ప్రస్తుతం రిజిస్ట్రేషన్లకు వచ్చే వారు కూర్చోవడానికి కొన్నిచోట్ల కుర్చీలు లేకపోవడం తో చెట్ల కింద బయట వారు సర్దుకుపోతున్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యే వర కు కార్యాలయాల్లో వారు నిలబడాల్సిన ప రిస్థితి నెలకొంది. రానున్న రోజుల్లో అ లాం టి పరిస్థితి రాకుండా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను కార్పొరేట్ ఆఫీసులను తలదన్నేలా తీర్చిదిద్దాలని సిఎం ఆదేశించారు.రాష్ట్రంలో మొత్తం 141 సబ్ రిజిస్ట్రార్ కా ర్యాలయాలుండగా వాటిలో 37 మాత్రమే సొంత భవనాల్లో నడుస్తుండగా ప్రస్తుతం నిర్మాణం పూర్తి చేసుకున్న ఆదిలాబాద్‌లో ని బోథ్,' మేడ్చల్ జిల్లా శామీర్‌పేట సబ్ రి జిస్ట్రార్ ఆఫీసులను ఎన్నికల కోడ్ తర్వాత ప్రారంభించాలనిప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం 104 ఆఫీసులు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. 52 చోట్ల కార్యాలయాలకు అవసరమయ్యే భవనాల నిర్మాణానికి ప్రభుత్వ భూమి కూడా కేటాయించారు. భూములు సిద్ధంగా ఉన్న చోట వీలైనంత త్వరగా మోడల్ రిజిస్ట్రేషన్ ఆఫీసులను నిర్మించాలని ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారు. మిగతా 52 సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులకు సరిపడా స్థలాలను అన్వేషించాలని, పబ్లిక్ యుటిలిటీ కింద సేకరించిన స్థలాలు అందుబాటులో ఉంటే అక్కడే నూతన భవనాలు నిర్మించాలని ముఖ్యమంత్రి సూచించారు. మొదటి దశలో ఆదాయం ఎక్కువగా తెచ్చిపెడుతున్న రంగారెడ్డి, మేడ్చల్, హైదరాబాద్, సంగారెడ్డి జిల్లాల పరిధిలోని సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల నిర్మాణాలకు ప్రాధాన్యమివ్వాలని ఆయన నిర్ణయించారు.అక్కడికి వచ్చే క్రయ, విక్రయదారులు తమ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముగిసేంత సేపు మంచి ఆతిథ్యమిచ్చే, ఆహ్లాదంగా ఉండే కార్పొరేట్ లుక్, వెయిటింగ్ హాల్, తాగునీటి సదుపాయం, కేఫ్‌టేరియా లాంటి అన్ని సదుపాయాలుండాలని సిఎం అధికారులకు సూచించారు. అవన్నీ ఉండేలా ఈ నిర్మాణాలు చేపట్టాలని ఆయన అధికారులకు సూచించారు. ఎక్కువ రిజిస్ట్రేషన్లు జరిగే చోట సిబ్బంది కొరత లేకుండా చూడాలని సిఎం అధికారులను ఆదేశించారు. ఆదాయం తక్కువగా ఉన్న జిల్లాల ఆఫీసుల నుంచి ఎక్కువ పని ఉన్న చోటుకు సిబ్బందిని సర్దుబాటు చేయాలని కూడా ఆయన ఆదేశించారు.

# డిఫాల్డ్ మిల్లర్లకే పెద్దపీట...

హైదరాబాద్: రాష్ట్రంలో మిల్లర్లకు ప్రతి సీజన్‌లో ప్ర భుత్వం సిఎంఆర్ కింద ఇచ్చే ధాన్యాన్ని తిరిగి ఇవ్వకుండా రూ. వేల కోట్లు ఎగవేసే దందాలో మిల్లర్ల అసోసియేషన్ పెద్దల ముసుగులోని గద్దలే ప్రధాన పాత్ర వహిస్తున్నారని తెలుస్తోంది. ఎప్పటి మాదిరినే ఈ సీజన్‌లో ప్రభుత్వానికి మిల్లర్లు ఇవ్వాల్సిన 35లక్షల టన్నుల ధాన్యం మొత్తం పక్కదారి పట్టడానికి మిల్లర్ల ముసుగులోని ఒక డాన్ కీలక పాత్ర పోషించినట్లు ఆ వర్గాల ద్వారా తెలిసింది. దాదాపు రూ. 7 వేల కోట్ల విలువ చేసే 33 లక్షల టన్ను ల ప్రభుత్వ ధాన్యం మాయం కావడానికి డాన్ తెర వెనుక ఆశీస్సులే కారణమని తెలుస్తున్నది. హైదరాబాద్ కేంద్రంగా ఈ డాన్ జిల్లాల వారీగా అక్రమ మిల్లర్ల దగ్గర నుంచి కోట్లు వసూలు చేసి అధికారులకు, నేతల కు లక్షలు ఎర వేసి ప్రభుత్వానికి ప్రతి ఏటా సిఎంఆర్ ధాన్యాన్ని మా యం చేసే తతంగాన్ని వి జయవంతంగా నడిపిస్తున్నారు.ప్రభుత్వ ధాన్యంతో వేల కోట్ల వ్యా పారం చేసి వందల కోట్లు ఆర్జించే అక్రమ మిల్లర్లు జిల్లా స్థాయిలో అ ధికారులకు కార్లు, బంగారం, వజ్రాలు ఎర వే యడంతో వారు కఠిన చర్యలు తీసుకోకుండా ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. జిల్లాల స్థా యిలో సిఎంఆర్ ధాన్యం ఎగవేత ప్రతియేటా షరా మామూలుగా మా రి ప్రభుత్వానికి వేల కోట్ల నష్టం వచ్చినా రాష్ట్ర పౌర సరఫరాల శా ఖ కూడా కొరడా ఝుళిపించక పోవడంతో ధాన్యం ఎగవేత అడ్డూఅదుపూ లేకుండా సాగుతోంది. రాష్ట్ర స్థాయిలోని అధికారులను, కీలక రాజకీయ నేతలను కూడా మిల్లర్ల ముసుగులోని డాన్ ప్రభావితం చేస్తున్నారు. ఇదంతా తెలియక ప్రభుత్వం నెత్తీనోరూ బాదుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అధికారంలో ఎవరు ఉన్నా వారిని బుట్టలో వేసుకొని సిఎంఆర్ ఎగవేతను విజయవంతంగా నడిపించడంలో ఆ డాన్ కృతకృత్యులవుతున్నా పట్టించుకొనేవారు కరువయ్యారు.ఈ దళారీ గద్ద అటు ప్రభుత్వాన్ని, ఇటు అధికారులను, నేతలను డబ్బు సంచులతో ప్రభావితం చేసి మిల్లర్లు డిఫాల్ట్‌గా మారే పరిస్థితిని కల్పిస్తున్నారు. జిల్లా స్థాయిలో జాయింట్ కలెక్టర్లు, డిఎస్ఒ లు, కొందరు నేతలు ఈ విషపు దందాలో తెలియకుండానే పాత్రధారులు అవుతున్నారు. రాష్ట్ర స్థాయిలో పౌర సరఫరాల శాఖ కార్యాలయాన్ని భ్రష్టు పట్టడానికి ఈ పెద్ద గద్దనే ప్రధాన కారణమని చెబుతున్నారు. ప్రస్తుత యాసంగి సీజన్‌లో 35 లక్షల టన్నుల ధాన్యానికి రెండు లక్షల టన్నుల ధాన్యమే రికవరీ కావడం దాదాపు 7 వేల కోట్ల ధాన్యాన్ని మిల్లర్లు పక్క దారి పట్టించడానికి కూడా ఈ గద్దనే కారణమని చెబుతున్నారు. రాష్ట్రంలో అధికార, విపక్షాల మధ్య బియ్యం వార్ జరుగుతున్న నేపథ్యంలో అసలు ఈ దందా వెనక సూత్రధారులు, పాత్రధారులను ప్రభుత్వం వదిలి వేస్తున్నది. నల్లగొండ జిల్లా సూర్యాపేట మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇమ్మడి సోమ నరసయ్య ఒకరే ఈ సీజన్‌లో రూ. 100 కోట్ల ధాన్యాన్ని మాయం చేశారుకానీ ఇదే అధ్యక్షుడు గతంలో వివిధ పేర్ల మీద రూ. 236 కోట్ల దాకా ధాన్యం ప్రభుత్వానికి తిరిగి అప్పగించే విషయంలో డిఫాల్ట్ అయ్యారు. అయినా ఇతనికే పదేపదే సిఎంఆర్ ధాన్యం అప్పగింత వెనక జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి దాకా జరిగిన డబ్బు సంచుల బాగోతమే కీలక పాత్ర కనిపిస్తున్నది. సూర్యాపేట జిల్లాలో కోదాడకు చెందిన ఓ అక్రమ మిల్లర్ రూ. 35 లక్షల విలువ చేసే ఇన్నోవాను జిల్లా స్థాయి అధికారికి గిఫ్ట్‌గా ఇచ్చారంటే ఈ దందాలో ముడుపుల పాత్ర ఎలా ఉందో తెలియజెప్పుతున్నది. ఈ సీజన్‌లో కొత్త ప్రభుత్వం టెండర్ల విషయంలో విఫలం కావడానికి రాష్ట్ర స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారుల ఉదాసీనత, బియ్యం మాఫియా తెర వెనక పాత్ర కీలకంగా ఉంది. ఈ సీజన్‌లో 33 లక్షల టన్నుల సిఎంఆర్ ధాన్యాన్ని ఎగ్గొట్టిన మిల్లర్ల వివరాలు బయటకు రావడం లేదు. దాదాపు ఏడు వేల కోట్ల విలువచేసే ధాన్యం వివిధ జిల్లాల్లో పక్కదారి పట్టింది. మిల్లర్లు అక్రమంగా సిఎంఆర్ కేటాయింపులు పొంది ఆ ధాన్యాన్ని మిల్లింగ్ చేయకుండా కొందరు, చేసి కొందరు మార్కెట్‌లో అమ్మి సొమ్ము చేసుకొని ప్రభు త్వానికి పంగనామాలు పెట్టారు.ఈ సీజన్‌లో సిఎంఆర్ కేటాయింపుల ఆధారంగా వివరాలు తీసుకొని జిల్లాలవారీగా ప్రభుత్వానికి ధాన్యం అప్పగించని మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకుంటే మొత్తం సూత్రధారులు బయటికి వచ్చే అవకాశం ఉంది. పక్కదారి పట్టడం ఇప్పటి విషయం కాదు. ఇది గడచిన కొన్నేళ్ళుగా కొనసాగుతూనే ఉన్నది. ధాన్యం అప్పగించని మిల్లర్లకు ధాన్యం కేటాయింపుల విషయంలో మిల్లర్ల అసోసియేషన్ పెద్దలే ఆమ్యామ్యాలతో ప్రభుత్వానికి పంగనామం పెట్టిస్తున్నారు. కనీసం ఐదు కోట్ల రూపాయల విలువ చేసే మిల్లు ఇంకా చెప్పాలంటే బాయిలర్ లేని మిల్లులకు కూడా రూ. 50 కోట్ల విలువ చేసే ధాన్యాన్ని కేటాయించడం మూలంగానే ప్రతి ఏడాది ధాన్యం గోల్ మాల్ జరుగుతున్నది. ప్రభుత్వం వేల కోట్లు నష్టపోతుంటే ఆ మేరకు అక్రమ మిల్లర్లు కోట్లకు పడగలెత్తుతున్నారు. వారికి హైదరాబాదు నుంచి ఆశీస్సులు అందిస్తున్న గద్దలు వంద రూపాయలు అక్రమ మిల్లర్ల నుంచి తీసుకుంటే పది రూపాయలు అధికారులకు, నేతలకు విదిలిస్తూ ధాన్యం కుంభకోణాన్ని 'యథా రాజా తథా ప్రజ'లా కొనసాగిస్తున్నారు.వేల కోట్ల రూపాయల ధాన్యాన్ని మిల్లర్లకు సిఎంఆర్ రూపంలో అప్పగించే విషయంలో పారదర్శకత లేదు. స్పష్టమైన విధానపర నిర్ణయం లేకపోవడంతోనే మిల్లర్ల అక్రమాలు చోటు చేసుకొంటున్నాయి. సిఎంఆర్ ధాన్యాన్ని కేటాయించడానికి స్పష్టమైన మార్గదర్శక సూత్రాలు రూపొందించాలి. ముఖ్యంగా మిల్లుల కెపాసిటిని క్షేత్రంలో నిర్ధారించాలి. అవసరమైతే ఆ మిల్లు కరంటు సామర్థాన్ని తెలుసుకోవాలి. మిల్లర్ల క్రెడిబులిటీని కూడా జిల్లా స్థాయి అధికారులు నిర్ధారించుకోవాలి. ఆ తర్వాతే వారికి అర్హత, సామర్థం ప్రకారం ధాన్యం అప్పగించాలి. కాని ఇక్కడ స్పష్టమైన పాలనాపరమైన విధాన నిర్ణయం లేకపోవడాన్ని ఆసరాగా చేసుకొని అసోసియేషన్ ముసుగులోని గద్దలు బియ్యం దందాను అప్రతిహతంగా కొనసాగిస్తున్నారు.

# ఫుడ్ సేఫ్టీ అధికారుల దండయాత్ర..

హైదరాబాద్: హోటల్ నిర్వాహకులారా.. తస్మాత్ జాగ్రత్త.. అడ్డదిడ్డమైన ఐటమ్స్.. అస్సలు అపరిశుభ్రంగా లేని కిచెన్స్‌లో వండి. కస్టమర్స్ మొఖాన కొట్టి.. డబ్బులు గల్లా పెట్టేలో వేసుకుంటామంటే కుదరదు ఇక. ఇకపై ఒళ్లు దగ్గర పెట్టుకొని మసలండి. ఎప్పుడు ఎటువైపు నుంచి అధికారులు ఎంట్రీ ఇస్తారో తెలీదు. కేసులు నమోదు చేస్తారో అంతకన్నా తెలీదు. హైదరాబాద్ రెస్టారెంట్స్ ఓనర్స్‌కు మాత్రమే కాదు ఈ వార్నింగ్..తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రెస్టారెంట్స్‌కు ఫుడ్ సెఫ్టీ అధికారులు ఇస్తున్న డెడ్లీ వార్నింగ్ ఇదిఇప్పటికే భాగ్యనగరం షేక్ అయ్యింది ఫుడ్ సెఫ్టీ అధికారుల సోదాలతో.. అస్సలు స్టార్‌లు లేని కాకా హోటల్, రెస్టారెంట్స్నుంచి మొదలుపెడితే.. ఫైవ్ స్టార్ హోటల్స్ వరకు దేన్ని వదలకుండా రెయిడ్స్ చేస్తున్నారు. యాజమాన్యాల గుట్టు రట్టు చేస్తున్నారు. ఇప్పుడు వారి నజర్‌ను జిల్లాలవైపు ఫోకస్ చేశారు. ఇక తెలంగాణ వ్యాప్తంగా ఉన్న అన్ని జిల్లాల్లో సోదాలు షురూ చేశారు.కంపు కొడుతున్న కిచెన్స్ ఉన్నాయా.. ఇక కడిగేయండి. కుళ్లిపోయిన మీట్ ఉందా.. దానిని పడేయండి. ఎక్స్‌పైరీ దాటిన ప్రొడక్ట్స్.. కల్తీ మసాలాలు.. ప్రమాదకరమైన కలర్స్.. అన్నీ తీసి చెత్తబుట్టలో వేయండి. హోటల్స్ అండ్ రెస్టారెంట్స్‌ను ఇప్పటికైనా క్లీన్ చేయండి. ఇన్నాళ్లు తెలిసో.. తెలియకో.. ఏ చేతితో అయితే రోగాల బారిన పడేలా ఫుడ్‌ను తినిపించారో.. ఇప్పుడదే చేతితో శుచి, శుభ్రతతో కూడిన మంచి పదార్థాలతో వంట చేయండి. ఎందుకంటే ఎప్పుడు ఏ వైపు నుంచి అధికారులు వస్తారో అస్సలు తెలీదు మరీ.మీరు మార్కెట్‌కు వెళ్లినప్పుడు ఒక మాట వినే ఉంటారు. ఇలా పుచ్చిపోయిన.. కుళ్లిపోయిన కూరగాయలను ఎవరు కొంటారని ప్రశ్నిస్తే.. ఎవరో హోటల్ వాళ్లు వచ్చి కొంటారు.. ఏదీ వేస్ట్ కాదని చెబుతుంటారు వ్యాపారులు. సో దీన్ని బట్టే అర్థమవుతోంది మనం తినే వంట పదార్థాలు ఎంత శుచి, శుభ్రతతో ఉంటాయో.. అంటే ఇదే నిజమని కాదు.. బట్ దాదాపుగా నిజం ఇది. నాట్ ఓన్లీ కూరగాయలు.. నాన్ వెజ్ దగ్గరా అంతే..మసాలాలు.. అల్లం, వెల్లుల్లి.. ఆఖరికి నూనెతో సహా.. వంటలో వాడే అన్ని దో నెంబర్ మాల్ అనే ప్రచారం ఉంది. సో.. ఇకపై ఇలాకొనుగోలు చేసే వ్యాపారులు.. కాస్త ఒకటికి పది సార్లు ఆలోచించండి. ఇకపై ఇలాంటి పనులు చేయడం మానండి.. అలా కాదని చేస్తే మాత్రం ఆ తర్వాత పోలీస్ స్టేషన్‌లు, కోర్టుల చుట్టూ తిరగడం పక్కా.. అందుకే కాస్త ఒళ్లు దగ్గర పెట్టుకొని వ్యాపారాలు చేయడం మంచిది. ఎందుకంటే ప్రస్తుతం ఒకటి, రెండు జిల్లాల్లోనే మొదలైనా.. రాష్ట్రవ్యాప్తంగా అతి త్వరలో సోదాలు జరగడం పక్కా.ఇప్పటికే కరీంనగర్, ఖమ్మంలోని పలు రెస్టారెంట్స్‌పై దండయాత్ర మొదలైంది. అపోలో పిష్, రొయ్యలు, పాలక్, వండిన మటన్, చికెన్.. ఇలా అన్ని పాడైనవే దొరికాయి. మటన్, చికెన్ లాంటి వాటిని సగం ఉడకబెట్టి అర్డర్ వచ్చినప్పుడు వాటిని వండి వడ్డిస్తున్నట్టు గుర్తించారు. మిగిలిపోయిన అహారాన్ని తిరిగి ఫ్రై చేసి వడ్డీస్తున్నారని కూడా తేల్చేశారు. వారితోటే ఆ వంటకాలను డస్ట్ బీన్ లో పడేలా చేశారు.సో.. మళ్లీ చెబుతున్నాం.. ప్రజలు కూడా కాస్త అప్రమత్తంగా ఉండాలి. హోటల్ యాంబియెన్స్‌పై ఉన్న శ్రద్ధ.. కాస్త కిచెన్‌పై కూడా పెట్టండి. ప్రస్తుతం తనిఖీల్లో చాలా చోట్ల రీయూజ్‌డ్ ఆయిల్ వాడుతున్నట్టు గుర్తించారు. చాలా కిచెన్స్ జిడ్డు కారుతున్నాయి.. ప్రశ్నించే వారు లేరని.. ఇష్టం వచ్చినట్టు వ్యవహారిస్తున్నారు. సో ఇలాంటి హోటల్స్‌లో తింటే.. జేబుకు చిల్లు పడటంతో పాటు.. ఆరోగ్యానికి కూడా తూట్లు పడతాయి. అందుకే కాస్త జాగ్రత్తగా ఉండటం చాలా అవసరం

# హైదరాబాద్ లో తిరుగుతున్న బూచోళ్లు

హైదరాబాద్: హైదరాబాద్ కేంద్రంగా పిల్లల్ని విక్రయిస్తున్న ఓ ముఠాను పట్టుకుంటే సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి.పిల్లలు లేని దంపతులే టార్గెట్‌గా కిడ్నాప్ ముఠాలు విచ్చలవిడిగా విజృంభిస్తున్నాయి. పేదలు, అమాయకుల పిల్లల్ని ఎత్తుకొచ్చి నిలువునా అమ్మేస్తున్నాయి కిడ్నాప్ ముఠాలు. తాజాగా హైదరాబాద్ మేడిపల్లి కేంద్రంగా పిల్లలను అక్రమంగా తరలిస్తున్న ఓ ముఠాను పోలీసులు గుట్టురట్టు చేశారు. ఢిల్లీ, పూణే నుంచి చిన్న పిల్లలను తీసుకొచ్చి హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తోంది ఓ కిలాడీ ముఠా. 3 నెలల పసికందుల నుంచి ఏడాది పిల్లల వరకు విక్రయిస్తోందీ గ్యాంగ్. ఈ ముఠాపై పక్కా నిఘా పెట్టిన పోలీసులు.. 16 మంది చిన్నారులను కాపాడారు.శోభారాణి, స్వప్న,షేక్ సలీం సహా 11 మంది నిందితులు పిల్లల విక్రయ రాకెట్‌లో భాగమైనట్టు పోలీసుల విచారణలో తేలింది. పీర్జాదిగూడలోని ఫస్ట్ ఎయిడ్ సెంటర్ అడ్డాగా ఆర్ఎంపీ శోభారాణి ఎప్పటి నుంచో ఈ దందా నడుపుతున్నట్టు పోలీసులు గుర్తించారు. పిల్లలు లేనివారికి అక్రమంగా చిన్నారులను అమ్మేసి లక్షలకు దండుకుంటున్నారు. ఇప్పటివరకు 50 మందిని విక్రయించినట్టు విచారణలో తేలింది.కాపాడిన 16 మంది పిల్లలను వారి తల్లిదండ్రుల దగ్గరకు అప్పజెప్పుంటే.. కొనుగోలు చేసిన దంపతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లక్షలు పోసి కొన్నాం. పైగా ఇన్ని రోజులు మమకారంతో పెంచుకున్నాం మా పరిస్థితి ఏంటంటూ బోరున ఏడుస్తున్నారు.అయితే అక్రమంగా పిల్లలు కొన్నందుకు వాళ్ల మీద కూడా కేసులు నమోదు చేస్తున్నారు అధికారులు. ఎవరికైనా పిల్లలు లేకపోతే.. దత్తత తీసుకోవాలనిపిస్తే.. చట్టబద్ధంగా తీసుకోవాలి. అంతేగానీ ఇలా అక్రమంగా కొనుగోలు చేసి నేరాలకు పాల్పడొద్దంటూ హెచ్చరిస్తున్నారు పోలీసులు..

# జూన్ 3 నుండి 19వ తేదీ వరకు బడిబాట కార్యక్రమం

సిద్దిపేట: కలెక్టర్ కార్యాలయంలోని మినీ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి బడిబాట కార్యక్రమ నిర్వహణపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బడి ఈడు పిల్లలందరూ తప్పనిసరిగా బడిలో ఉండాల్సిందేనని అన్నారు. మే 3వ తేదీ నుండి 19వ తేదీ వరకు గ్రామాలు మరియు మున్సిపాలిటీలలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించి, విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయులు మాత్రమే కాకుండా ఈ కార్యక్రమంలో అన్ని శాఖల ప్రభుత్వ అధికారులు పాల్గొని ఇంటింటికి వెళ్లి డ్రాప్ అవుట్ విద్యార్థులను గుర్తించి తల్లిదండ్రులతో మాట్లాడి బడుల్లో చేర్పించాలని అన్నారు. అదేవిధంగా ఎంతో కష్టపడి వేలాది రూపాయలు ఫీజులు చెల్లించి ప్రైవేటు మరియు కార్పొరేట్ స్కూళ్లలో తమ పిల్లలను చదివించే తల్లిదండ్రుల వద్దకు వెళ్లి ప్రభుత్వ పాఠశాలలో ఉన్న వసతులు, ఉచిత విద్య మరియు కాంపిటేటివ్ పరీక్షలలో ఉన్నతంగా నిలిచి ఉద్యోగాలు పొందిన ఉపాధ్యాయులు చదువు చెబుతారు కాబట్టి ఇన్ని వసతులున్న ప్రభుత్వ పాఠశాలలకే విద్యార్థులను పంపించాలని మోటివేట్ చేయాలని అన్నారు. అడ్మిషన్ దొరకని ప్రభుత్వ పాఠశాలల గురించి తల్లిదండ్రులకు చెప్పి విద్యార్థులు లేక మూతపడిన ప్రభుత్వ పాఠశాలలో కూడా మళ్లీ విద్యార్థులు వచ్చేలా తల్లిదండ్రులకు మోటివేషన్ చేయాలని అన్నారు. పేరెంట్స్ మీటింగ్ పెట్టాలని, విద్యార్థులను బడుల్లో చేర్పించడంలో పూర్వ విద్యార్థులకు భాగస్వామ్యాన్ని కల్పించాలని, మహిళా స్వయం సహాయక సంఘాలు, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, గ్రామ పెద్దలు మరియు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులను భాగస్వాములను చేయాలని అన్నారు. ముఖ్యంగా అసలే పాఠశాలలకు వెళ్ళని విద్యార్థులపై ప్రధానంగా ఫోకస్ పెట్టాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ తదితర వసతి గృహాలలో కూడా ఉచిత భోజన, వసతి పొంది చదువుకునే విధానంపై కూడా ఈ బడిబాట కార్యక్రమంలో వివరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి కవిత, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి సరోజ, డిఆర్డివో జయదేవ్, సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీనివాస్, డిడబ్ల్యూఓ శారద, డివిజనల్ పంచాయతీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నయీమ్ డైరీపై ఫోకస్

హైదరాబాద్: 2016 ఆగస్టు 8.. ఇది నయీం ఎన్‌కౌంటర్ జరిగిన డేట్.. అటు ఇటుగా ఎనిమిదేళ్లు అయ్యింది. ఈ ఎన్‌కౌంటర్ జరిగి జనాలకు నయీం పీడా విరగడైంది.. ఇది నిజం.. బట్ నయీం బాధితులకు న్యాయం జరిగిందా? నయీంకు అండగా ఉన్న పొలిటిషియన్స్‌కు, పోలీసు అధికారులకు తగిన శాస్త్రి జరిగిందా? దీనికి కాన్ఫిడెంట్‌గా యస్ అని ఆన్సర్ చెప్పలేము. ఎందుకంటే ఇంకా వీడని చిక్కు ముడులు అనేకం. తేలని డైరీ లెక్కలు అనంతం.. సో.. ఈ లెక్కలను తేల్చాలని చూస్తోంది ప్రస్తుత రేవంత్ సర్కార్.. బీఆర్ఎస్ పాలనలో అడ్రస్ లేకుండా పోయిన ఈ కేసును మళ్లీ తిరిగి తవ్వాలని డిసైడ్ అయ్యారు.నయీం ఎన్‌కౌంటర్ తర్వాత ఏం జరిగింది? 602 మొబైల్స్.. 130 డైరీలు.. 1,050ఎకరాల భూమికి సంబంధించిన.. 750 రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్.. భారీగా నగదు.. ఇవీ నయీం డెన్ నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్న కొంచెం లిస్ట్..

అసలు నిజంగా పోలీసులు సీజ్ చేసిన సొమ్మెంత? బంగార మెంత? డెన్‌లో దొరికిన పెన్ డ్రైవ్‌లు ఎన్ని ? అందులో ఏముంది ? సీజ్ చేసిన వాటిని ఎక్కడ పెట్టారు? ఇలా అనేక ప్రశ్నలు ఇప్పటికీ కూడా మిస్టరీనే.. ఇవన్నీ పక్కన పెడితే అసలు నయీం డైరీలో ఏముంది అన్నది అత్యంత గోప్యంగా ఉంచారు. కొన్ని రోజుల పాటు హడావుడి చేసిన అప్పటి టీఆర్ఎస్ సర్కార్.. మెల్లిమెల్లిగా ఇష్యూను డైవర్ట్ చేసింది. పేరుకు స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్‌ను ఏర్పాట చేసినా..విచారణ మాత్రం ఆటకెక్కింది అనేది హండ్రెడ్ పర్సెంట్ ట్రూత్.197..నయీంపై ఉన్న కేసుల సంఖ్య ఇది.. 125.. ఇది అరెస్ట్ అయిన నయీం అనుచరుల సంఖ్య. అయితే చార్జ్‌షీట్ దాఖలు చేసింది మాత్రం కేవలం 18 కేసుల్లో మాత్రమే.. మరి మిగిలిని కేసుల సంగతేంటి? ఇదే ఇప్పుడు నయీం బాధితులు వేస్తున్న ప్రశ్న. ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ తమకు న్యాయం జరగలేదు అని నెత్తి నోరు బాదుకుంటున్నారు. అయితే విచారణ ముందుకు జరగపోవడానికి మెయిన్ రీజన్ నయీం డైరీ అని తెలుస్తోంది. ఎందుకంటే ఈ డైరీలో ఉన్నది పోలీస్ ఉన్నతాధికారులు, కొందరు రాజకీయ నేతల పేర్లు. ఒక్కసారి చర్యలు తీసుకోవడం షురూ అయితే.. శ్రీకృష్ణ జన్మస్థానానికి వెళ్లే నేతలు, పోలీసుల సంఖ్య పెద్దగానే ఉన్నట్టు కనిపించింది. అందుకే కొందరు పోలీసులపై తాత్కాలికంగా చర్యలు తీసుకొని.. చాలా మందికి క్లీన్‌చిట్ ఇచ్చేశారు. ఇక రాజకీయ నేతలపై చర్యలు తీసుకున్నారన్న ఊసే వినిపించలేదు.. కనిపించలేదు.. ఆ తర్వాత వార్తల్లో నయీం అన్న పేరే వినిపించడం మానేసింది.కాలం గడిచే కొద్ది.. ఈ కేసు కాలగర్భంలో కలిసిపోతుందని అంతా అనుకున్నారు. బట్.. నయీం వల్ల నాశనమైన జీవితాల సంఖ్య చాలా పెద్దది. అందుకే ఇప్పటికీ కూడా న్యాయం చేయండి మహాప్రభో అంటున్నారు. ఎందుకంటే నయీం, అతని అనుచరులు కబ్జాలు చేసిన భూములు. ఇప్పటికీ అసలు యజమానులకు చేరలేదు. అందుకే మళ్లీ తెరపైకి ఈ గ్యాంగ్‌స్టర్ కేసు వచ్చింది. తెలంగాణ పోలీసులు మళ్లీ ఈ కేసును తవ్వుతున్నారు. నయీం డైరీలో ఉన్న వీఐపీల పేర్లపై ఆరా తీయడం షురూ చేశారు. అసలు ఏ కేసు విచారణ ఏ దశలో ఉందో తెలుసుకుంటున్నారు. సో.. ఈసారి నయీం డైరీ మిస్టరీ ఇకవీడే సమయం కనిపిస్తోంది. అందులో ఉన్న నేతలు, పోలీస్ పెద్దల గుట్టు రట్టు కానుంది..

# పాలు విరిగాయని భార్యను చితకబాదిన భర్త

హైదరాబాద్: కట్టుకున్న భర్తే కిరాతకుడిగా మారాడు. పొయ్యిపై వేడి చేసిన పాలు విరిగాయన్న నెపంతో అత్తింటి వారు ఆ అబలపై తమ ప్రతాపం చూపారు. అదనపు కట్నం తెమ్మంటూ రాచి రంపాన పెట్టారు. ఒళ్లంతా వాతలు తేలేలా మెటల్ పైపుతో మూడ్రోజుల పాటు కొట్టి నరకం చూపారు. ఈ అమానవీయమైన ఘటన మధురానగర్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఎల్లారెడ్డిగూడలో జరిగింది. పోలీసులు, బాధితుల కథనం ప్రకారం.. సనత్నగర్ అల్లాఉద్దీన్ కోఠికి చెందిన హీనా బేగం(28) వివాహం నాలుగేళ్ల కిందట ఎల్లారెడ్డిగూడకు చెందిన కారు డ్రైవర్ అక్మల్ హుస్సేన్(42)తో పెద్దల సమక్షంలో జరిగింది. కట్నకానుకల కింద రూ.2 లక్షల నగదు, నాలుగున్నర తులాల బంగారం, ఇతర లాంచనాలు ఇచ్చి ఘనంగా పెండ్లి చేశారు.అప్పటికే అక్మల్ హుస్సేన్కు మొదట పెండ్లి అయిన విషయాన్ని దాచిపెట్టారు. తర్వాత బేగంకు తెలిసినా సర్దుకుని కాపురం చేయసాగింది. కొన్నేళ్ల పాటు వీరి కాపురం సజావుగానే సాగడంతో ఓ కుమారుడు, కుమార్తె జన్మించారు. పెండ్లి అయినప్పటి నుంచి భర్త అక్మల్ హుస్సేన్, అత్త అఫ్రోజ్ బేగం, ఆడపడుచు సోని, మరుదులు తబ్రేజ్, అయ్యూబ్ కలిసి హీనాను శారీరకంగా, మానసికంగా హింసించారు. పుట్టింటి నుంచి అదనపు కట్నం తేవాలని ఆమెను చీటికిమాటికి కొట్టారు. కూతురు కాపురం బాగు పడుతుందన్న ఆశతో అప్పు చేసి రూ.2.50 లక్షలు వరకు అత్తింటి వారికి ముట్టజెప్పారు. అయినా అత్తింటి వారి వేధింపులు తగ్గలేదు. కాగా, అత్తింట్లో పొయ్యిపై పాలు వేడి చేసి మరిగించే సమయంలో పాలు విరిగిపోయాయి. దీంతో ఆగ్రహానికి గురైన భర్త, అత్త, ఆడపడుచు, మరిది కలిసి ఆమెపై మెటల్ పైపుతో విచక్షణారహితంగాచితకబాది, ఇంట్లోనే మూడ్రోజుల పాటు నిర్బంధించారు. ఒళ్లంతా గాయాలతో కమిలిపోయింది. మీ కూతురు చనిపోయిందంటూ ఆమె పుట్టింటి వారికి ఫోన్ చేసి చెప్పారు. అపస్మారకస్థితిలో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న కుమార్తెను చూసిన తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. అత్తింటివారి దాడిలో తీవ్రంగా గాయపడిన బాధితురాలిని చికిత్స నిమిత్తం అమీర్పేటలోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# మహారాష్ట్రపై గులాబీ గురి



ముంబై: తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం పుట్టిన భారత రాష్ట్ర సమితి(బీఆర్ఎస్) అలియాస్ తెలంగాణ రాష్ట్ర సమితి(టీఆర్ఎస్)కు జన్మస్థానంలోనే ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. అసెంబ్లీ ఎన్నిల్లో ఓటమి తర్వాత ఆటుపోట్లు ఎదుర్కొంటోంది. లోక్‌సభ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా రాకపోవచ్చని ఆ పార్టీ నేతలే గుసగుసలాడుతు న్నారు. ఫలితాల తర్వాత పార్టీ పరిస్థితి మరింత దిగజారే అవకాశం ఉందని అధినేత గుర్తించారు. దీంతో దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలి అన్నట్లు.. పార్టీ పతారను పక్క రాష్ట్రం మహారాష్ట్రలో చూపెట్టడంపై దృష్టిపెట్టారు. దీంతో తెలంగాణ రాజకీయాల్లో బీఆర్ఎస్ పరిస్థితిపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. మహారాష్ట్రలో మరో నాలుగు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగను న్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణలో అధికారం కోల్పోయిన భారత రాష్ట్ర సమతి.. వచ్చే మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఉనికి చాటాలని భావిస్తోంది. ఈ క్రమంలో ఆ రాష్ట్రంలో తెలుగు వారు ఎక్కువగా ఉన్న అసెంబ్లీ నియోజకవర్గాలపై ఫోకస్ పెట్టింది. తెలుగు వారు ఉండే రాష్ట్రాల్లో పోటీ చేయడానికి కసరత్తు చేస్తోంది.మహారాష్ట్రలో స్థానిక సంస్థల ఎన్నికల సందడి కూడా మొదలు కానుంది. అయితే, బీఆర్ఎస్ వీటిపై కాకుండా అసెంబ్లీ స్థానాలపైనే దృష్టి పెట్టాలని భావిస్తోంది. అధికారంలో ఉన్నప్పుడే మహారాష్ట్రలో పార్టీ విస్తరణ చేపట్టిన గులాబీ బాస్ అక్కడ పార్టీ రాష్ట్ర కార్యాలయం కూడా ప్రారంభించారు. వివిధ పార్టీలకు చెందిన నేతలను బీఆర్ఎస్‌లో చేర్చుకున్నారు. అయితే తెలంగాణ ఎన్నికల్లో ఓటమి తర్వాత, లోక్‌సభ ఎన్నికల ముందు ఆ నేతలంతా తమదారి తాము చూసుకున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో మహారాష్ట్ర నుంచి బీఆర్ఎస్ పోటీ చేయకపోవడమే ఇందుకు కారణం. ఇప్పుడు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తే.. మళ్లీ కొత్త నేతలు వస్తారని కేసీఆర్ భావిస్తున్నారు. ఇంట గెలిచి రచ్చ గెలవాలి అంటారు పెద్దలు.. బీఆర్ఎస్ పరిస్థితి మాత్రం ఇందుకు విరుద్ధంగా ఉంది. ఇంట ఓడిపోయి.. రచ్చ గెలవాలని చూస్తున్నారు ఆ పార్టీ అధినేత కేసీఆర్. గులాబీ బాస్ తీరుతో పార్టీ శ్రేణుల్లో గందరగోళం నెలకొంది. ఇప్పటికే తెలంగాణలో పార్టీ భవిష్యత్ ఏమిటో అర్థం కాని పరిస్థితి. ఈ క్రమంలో కేసీఆర్ మహారాష్ట్రపై దృష్టిపెట్టడం, అక్కడ సత్తా చాటాలని పాకులాడడంపై గుసగుసలాడుతున్నారు. కేసీఆర్ తీరుతో తెలంగాణలో పార్టీ మనుగడే ప్రశ్నార్థకమ వుతుందని గులాబీ నేతలు భావిస్తున్నారు. ఇది పార్టీకి ఏమాత్రం మంచిది కాదని పేర్కొంటున్నారు. అయితే కొందరు మహారాష్ట్ర రాజకీయాలపై దృష్టి పెట్టడం వెనక ఏదో ఎత్తుగడ ఉండే ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. షిండే సార్కర్‌కు మద్దతుగా వచ్చే ఎన్నికల్లో ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు చీల్చేందుకే కేసీఆర్ మహారాష్ట్రపై దృష్టిపెట్టారని ప్రచారం జరుగుతోంది.

# కరోనాకు మించి మహామ్మారి..

న్యూఢిల్లీ : ప్రపంచానికి మరో ముప్పు రాబోతోందా.. కరోనాను మించిన వైరస్ విజృంభించబోతోందా.. ప్రజలు సంసిద్ధంగా ఉండాల్సిందేనా అంటే అవుననే అంటున్నారు. యూకే మాజీ ప్రధాన శాస్త్రీయ సలహాదారు పాట్రిక్ వాలెన్స్. బ్రిటిష్ ప్రభుత్వం మరో మహమ్మారిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ఆయన సూచించారు. ఇదే సమయంలో దీనిని ఎదుర్కొనేందుకు ప్రపంచం సిద్ధంగా లేదని పేర్కొన్నారు. పోవైస్‌లోని హే ఫెస్టివల్‌లో జరిగిన ఒక ప్యానెల్ ఈవెంట్‌లో ఆయన మాట్లాడారు. 2021లో నిర్వహించిన జీ7 సదస్సులో వాలెన్స్ కీలక విషయాలు వెల్లడించారు. కోవిడ్ కన్నా తీవ్రమైన మహమ్మారి ప్రపంచంపై విరుచుకు పడుతుందని తెలిపారు. వేగవంతమైన రోగ నిర్ధారణ పరీక్షలు, వేగవంతమైన టీకాలు, వేగవంతమైన చికిత్స అందించేందుకు సిద్ధంగా ఉండాలి అని సూచించారు.ఇదిలా ఉండగా ప్రపంచ ఆరోగ్య సంస్థ (డిఊూ)విడుదల చేసిన ప్రపంచ ఆరోగ్య గణాంకాల ప్రకారం.. కోవిడ్ ?19 మహమ్మారి జనన సమయంలో ఆయుర్దాయం పుట్టినప్పుడు ఆరోగ్యకరమైన ఆయుర్దాయం (ఊంఒఇ) యొక్క స్థిరమైన లాభం ధోరణిని తిప్పికొట్టింది. కోవిడ్ కారణంగా మనిషి ఆయుర్దాయం తగ్గిందని తెలిపింది. 2019 నుంచి 2021 మధ్య, ప్రపంచ ఆయుర్దాయం 1.8 సంవత్సరాలు తగ్గిందని తెలిపింది. 2012 నాటికి పడిపోయిందని పేర్కొంది. ప్రపంచ ఆరోగ్యవంతమైన ఆయుర్దాయం 2021లో 1.5 సంవత్సరాలు తగ్గి 61.9 సంవత్సరాలకు పడిపోయింది (2012 స్థాయికి తిరిగి వచ్చింది). 2024 నివేదిక కూడా ప్రపంచవ్యాప్తంగా ప్రభావాలు అసమానంగా ఎలా అనుభవించాయో హైలైట్ చేస్తుంది. 2019 మరియు 2021 మధ్య కాలంలో ఆయుర్దాయం సుమారు 3 సంవత్సరాలు, ఆరోగ్యకరమైన ఆయుర్దాయం 2.5 సంవత్సరాలు తగ్గడంతో అమెరికా మరియు ఆగ్నేయాసియా ప్రాంతాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. దీనికి విరుద్ధంగా, పాండమిక్ యొక్క మొదటి రెండు సంవత్సరాలలో పశ్చిమ పసిఫిక్ ప్రాంతం కనిష్ఠంగా ప్రభావితమైంది. ఆయుర్దాయం 0.1 సంవత్సరాల కంటే తక్కువ, ఆరోగ్యకరమైన ఆయుర్దాయం 0.2 సంవత్సరాలలో నష్టపోయింది.

### చైనాల్ మహామ్మారి

వూహాన్ ల్యాబ్‌లో కోవిడ్?19 వైరస్‌ను సృష్టించి దానిని బయటకు వదిలిన డ్రాగన్ కంట్రీ చైనా మరో వైరస్‌ను పుట్టించింది. హెబీ మెడికల్ యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తలు ఎబోలా తరహాలోని మరో కొత్త వైరస్‌ను సృష్టించారు. ఎబోలా మాదిరిగానే ఈ వైరస్ చాలా ప్రమాదకరమైనది. మనిషిని కేవలం మూడు నెలలల్లోనే ఇది చంపేస్తుంది. వ్యాధికారక ప్రభావాలను అధ్యయనం చేసేందుకే శాస్త్రవేత్తలు ఈ వైరస్‌ను సృష్టించారు. అయితే ఇప్పుడు ఈ వైరస్ ప్రయోజనాలు, ప్రమాదాలపై సర్వత్రా చర్చ జరుగుతోంది. కోవిడ్ తరహాలో బయటకు వస్తే ప్రపంచానికి మరో ముప్పు దప్పదన్న ఆందోళన వ్యక్తమవుతోంది. శాస్త్రవేత్తలు కనుగొన్న ఈ వైరస్ స్వభావం సింథటిక్ అని తెలుస్తోంది. ఈ అధ్యయన నివేదిక సైన్స్ డైరెక్ట్‌లో ప్రచురితమైంది. ఎబోలా వైరస్‌ను ఉపయోగించి సృష్టించిన ఈ కొత్త వైరస్‌పై సాగిస్తున్న పరిశోధన వివాదాస్పదంగా మారింది. అయితే ఈ పరిశోధన ఉద్దేశం వివిధ వ్యాధులను నివారించడం. లక్షణాలను పరిశోధించడం అని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ వైరస్ మనిషి శరీరంపై ఎబోలా లాంటి ప్రభావాన్నే చూపుతుంది. పరిశోధకుల బృందం ఎబోలా వైరస్ నుంచి గ్లైకోప్రొటీన్(పీజీ)ని స్వీకరించేందుకు వెసిక్యూలర్ స్టోమాటిటిస్ వైరస్(వీఎస్‌వీ)ని ఉపయోగించిందిఇక ఈ వైరస్‌ను శాస్త్రవేత్తలు సిరియన్ హామ్స్టర్స్(జంతువుల)సమూహంపై పరీక్షించారు. వీటిలో ఐదు మగ, ఐదు ఆడ జాతులు ఉన్నాయి. ఈ జంతువులకు ఈ వైరస్‌ను ఇంజెక్టు చేయగా, వాటిలో ఎబోలా లాంటి లక్షణాలు కనిపించాఇ. మూడు రోజుల్లోనే అవి మృతిచెందాయి. ఈ వైరస్ ఇంజెక్ టచేయగానే కొన్ని జంవుతువుల కళ్లు దెబ్బతిన్నాయి. ఆప్టిక్ నరాలలో తీవ్రమైన ప్రభావం కనిపించింది. 2014?16 మధ్య కాలంలో ఆఫ్రికన్ దేశాలలో ఎబోలా వ్యాప్తి చెందింది. దీనివలన వేలాదిమంది మరణించారు.

# డెక్కన్ సిమెంట్ ఫ్యాక్టరీని మూసివేయాలి

హుజూర్ నగర్: హుజూర్ నగర్ నియోజకవర్గంలో పాలకీడు మండలం మహంకాళిగూడెం గ్రామంలో గ్రామ శివారులోని ఫారెస్టులో ఏమాత్రం అనుమతులు లేకుండా నడుపుతున్న డెక్కన్ సిమెంట్ ఫ్యాక్టరీని వెంటనే మూసీవేయాలని ప్రపంచ పర్యావరణ సంస్థ జాతీయ అధ్యక్షులు డాక్టర్ సిహెచ్ భద్ర డిమాండ్ చేశారు. హైదరాబాద్ హైదర్ గూడ ఎన్ఎస్ఎస్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ఈ ఫ్యాక్టరీ యాజమాన్యం న్యాయస్థానాలను , కాలుష్య నియంత్రణ మండలి, జాతీయ హరిత ట్రిబ్యునల్ నిబంధన లను పూర్తిగా ఉల్లంఘన చేస్తుందని ఆరోపించారు. గత పాలకుల అండతో అధికారులు పూర్తిగా అవినీతిపరులకు వత్తాసు పలుకుతూ పర్యావరణ పరిరక్షణ కోసం పోరాడుతున్న పసుపులేటి సురేష్ ని చంపడానికి అనేక రకాల కుట్రలు పన్నారని ఆరోపించారు. ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి పర్యావరణ పరిరక్షణ కోసం ముందు వరుసలో ఉంటానని అందుకోసం ప్రకృతి నా పరిపాలన సహకరిస్తుందని అనేక సందర్భా లలో ప్రకటించారని గుర్తు చేశారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేసి ఇప్పటివరకు డెక్కన్ సిమెంట్ సంస్థ చేసిన దోపిడీ,అక్రమాలు అన్యాయాల మీద సమగ్ర విచారణ జరిపించాల న్నారు. వేల కోట్ల రూపాయలు సంపాదిస్తూ పర్యావరణ ఉద్యమకా రులను చంపేయాలని చూస్తున్నారన్నారు.ఈ అవినీతికి సహకరిం చిన అధిరులను అరెస్టు చేసి,వారి ఆస్తులు జప్తు చేయాల న్నారు.

## మంథని పట్టణంలో టాస్క్ ఫోర్స్ దాడులు

మంథని: పెద్దపల్లి జిల్లా మంథని మున్సిపాలిటీ లోని లైన్ గడ్డ, గంగాపురి లో అక్రమంగా తరలించడానికి సిద్ధంగా ఉన్న సుమారు 60 క్వింటళ్ళ పిడిఎస్ బియ్యాన్ని టాస్క్ ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు.గంగాపురి గ్రామంలోని ఓ మైదానంలో వేసుకున్న డేరా లో నిల్వ ఉంచిన పిడిఎస్ బియ్యం , లైన్ గడ్డ లో అక్రమంగా రేషన్ బియ్యం ఉన్నాయని సమాచారం అందుకున్న టాస్క్ ఫోర్స్ పోలీసులు రెండు చోట్ల దాడులు చేసి పట్టుకున్నారు.పట్టుకున్న బియ్యాన్ని మంథని పోలీస్ స్టేషన్ కు తరలించారు. మంథని కి చెందిన రాచర్ల రమేష్, సయ్యద్ అస్లాం లను నిందితులుగా గుర్తించినట్లు పోలీసులు వెల్లడించారు.

# మేడిగడ్డ లెక్క తేలుతుందా...?



హైదరాబాద్: మేడిగడ్డ ఓ మేడిపండు.. యస్.. ఇది ఏదో రైమింగ్ కోసం వాడుతున్న పదాలు కాదు. మేడిగడ్డ ఓ డొల్ల అనేది ఎప్పటి నుంచో కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణ. ఇప్పుడివి ఆరోపణలు కాదు.. నగ్న సత్యాలని తేలింది. గతంలో మొరాయించిన గేట్లు ఎత్తేందుకు ప్రయత్నిస్తుంటే వచ్చే శబ్ధాలు విని ఇంజనీర్ల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. బ్యారేజ్ ఇంకేంత కుంగుతుందో అనే భయం పనులను ముందుకు సాగనివ్వడం లేదు.నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఎక్స్‌పర్ట్ కమిటీ ఒక సూచన చేసింది. వర్షాకాలం రాకముందే మేడిగడ్డలో మొరాయించిన గేట్లన్నీ పైకి ఎత్తాలని చెప్పింది. లేదంటే మొత్తం బ్యారేజీకే అసలుకే మోసమని వార్నింగ్ ఇచ్చింది. అయితే ఇలా గేట్లు ఎత్తాలని ఎందుకు నిర్ణయించారో ఒకసారి గుర్తు చేసుకుందాం.. గతేడాది అక్టోబర్ 21న7వ నంబర్ బ్లాక్ కుంగింది. ఈ బ్లాక్‌లోని రెండు పియర్స్‌కు పగుళ్లు ఏర్పాడ్డాయి..దీంతో 19, 20, 21 పియర్ల మధ్య ఉన్న గేట్లను ఎత్తలేకపోయారు. కుంగిన సమయంలో నీటి లీకేజీని ఆపేందుకు ఏకంగా 40 వేల ఇసుక బస్తాలను వేశారు. అయితే ఈ గేట్లను ఎత్తడం అంత ఈజీ కాదు. ఎందుకంటే పునాదులు ఇప్పటికే కుంగాయి.టన్నుల బరువున్న ఈ గేట్లను ఇప్పుడు కదిలిస్తే బ్యారేజీ మరింత కుంగే ప్రమాదం.. సో పునాదులపై ఎలాంటి ప్రెజర్ పడకుండా.. క్రేన్లను ఏర్పాటు చేసి గేట్లను ఎత్తాలన్న దీనికి అనుగుణంగా 15వ నెంబర్‌ను సక్సెస్‌ఫుల్‌గా లిఫ్ట్ చేశారు. బట్ ఎప్పుడైతే 16వ నెంబర్ గేట్‌ను ఎత్తేందుకు ప్రయత్నించారో.. అప్పుడు శబ్ధాలు, ప్రకంపనలు మొదలయ్యాయి. ఏంటా అని చూస్తే.. అసలు కింద మొత్తం అగాథమే ఉందని తేలింది.గుంతలు.. ఇప్పుడు మేడిగడ్డలో ఎక్కడ చూసిన కనిపిస్తున్నవి ఇవే.. వీటిని చూశాక గేట్ల పనుల విషయంలో అడుగు ముందుకు పడటం లేదు. నిజానికి మేడిగడ్డ బ్యారేజీలో గతంలో భారీ ఎత్తున నీటిని నిల్వ చేశారు. ఆ ఒత్తిడితో బ్యారేజీ కింద నుంచి ఇసుక పెద్ద మొత్తంలో కొట్టుకుపోయింది. దీంతో అడుగున పెద్ద అగాథం ఏర్పడిందని ఔఆూం అంచనాకు వచ్చింది. దీని సైజ్ ఏకంగా 12 వేల నుంచి 15 వేల క్యూబిక్ మీటర్ల వరకు ఉండొచ్చనేది ఓ అంచనా.. అయితే ఈ అగాథం ఒకే చోట లేదు.. బ్యారేజీ పొడవులన కొన్ని చోట్ల చిన్నగా.. మరికొన్ని చోట్ల పెద్దగా ఉన్నాయి. ఈ అగాథం కారణంగానే ఏడో బ్లాక్‌లో ప్రస్తుతం పియర్లు కుంగిపోయాయి. ఇప్పుడు రిపేర్లకు కూడా ఈ అగాథలే అడ్డుగా మారాయి.గేట్లను ఎత్తేందుకు ప్రయత్నిస్తే.. ర్యాఫ్ట్‌లు డ్యామేజ్ అవుతున్నాయి. మరిప్పుడు ఏం చేయాలి? పనులు ముందుకు సాగాలంటే ఏం చేయాలి? ప్రస్తుతం ర్యాఫ్ట్ కింద భారీ గుంతలను గ్రౌటింగ్ చేస్తున్నారు. కాంక్రీట్ గ్రౌటింగ్ కోసం రెండు మిషిన్లను తీసుకొచ్చి పనులు ప్రారంభించారు. ఈ పనులు పూర్తి కావాలంటే వారం టైమ్ పడుతుంది. ఈ పనులు సక్సెస్‌ఫుల్‌గా కంప్లీట్ అయితేనే గేట్లు ఎత్తే అవకాశం ఉంది. ఏదీ ఏమైనా వర్షాకాలంలోపు మొత్తం గేట్లు ఎత్తాలి. లేదంటే అప్పుడు వచ్చే వరద కారణంగా మొత్తం బ్యారేజీనే దెబ్బతినే అవకాశం ఉ ంది. మరి గ్రౌటింగ్ పనులు ఫెయిల్ అయితే.. ఈ డౌట్ వచ్చిన ఇంజనీర్స్ ప్లాన్ బీని రెడీ చేశారు. అవసరమైతే మొత్తం గేట్‌నే తొలగించేందుకు రెడీ అవుతున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో మేడిగడ్డ బ్యారేజీకి మరమ్మతు లు చేపట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమైందిఅసలు మేడిగడ్డ బ్యారేజీ కింది భాగంలో బొరియలు ఎగ్జాక్ట్‌గా ఎక్కడున్నాయి.. ? దీని కోసం ఎక్స్‌పర్ట్ కమిటీ మూడు సంస్థలను సూచించింది. ఆ సంస్థలతో అన్ని పరీక్షలు చేయించనున్నారు.

ఆ సంస్థల రిపోర్ట్ ఆధారంగా ఇసుక, సిమెంటు మిశ్రమాన్ని ఆ ఆగాథాల్లో నింపి.. వాటిని పూడ్చివేయనున్నారు. ఇలా ప్రెషర్ గ్రౌటింగ్ చేసిన తర్వాత గేట్లు ఎత్తే పనులు ప్రారంభం కానున్నాయి. అసలు ప్రాజెక్టులో ఈ అగాథాలు ఎందుకు ఏర్పడ్డాయి? దీనికి ఆన్సర్ గత బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యమే అని తెలుస్తుంది. మేడిగడ్డ ప్రాజెక్ట్ 2019లో పూర్తైంది. ఆ ఇయర్‌లో వచ్చిన వరదలకే బ్యారేజ్ దెబ్బతిన్నది. కానీ ఈ విషయాన్ని అప్పటి ఇంజనీర్లు గుర్తించి ప్రభుత్వానికి చెప్పినా.. కేసీఆర్ సర్కార్ పట్టించుకోలేదు.. ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అప్పటి నుంచి ప్రతి ఇయర్.. కొంచెం కొంచెంగా బ్యారేజ్ డ్యామేజ్ అవుతూ వస్తుంది.. చివరికి కుంగిపోయింది. వచ్చే వర్షకాలంలో ఏదైనా జరగరాని ప్రమాదం జరిగితే ఏంటన్నది ఇంజనీర్ల భయం.అసలు మేడిగడ్డ ప్రాజెక్ట్ భవితవ్యం ఏంటి? భవిష్యత్తులో మళ్లీ అది బ్యారేజ్‌గా పనిచేస్తుందా? లేదా? సమాధానాలు రావాలంటే మరికొన్ని రోజులు ఆగాల్సిందే.. అయితే ఒకటి మాత్రం నిజం.. నెక్ట్స్ సీజన్‌కి కూడా బ్యారేజ్‌తో ఎలాంటి ఉపయోగం లేదుఇవన్నీ వ్యాలీడ్ క్వశ్చన్స్.. గత ప్రభుత్వం మౌనాన్ని వీడలేదు.. సమాధానం చెప్పలేదు. కానీ ఈసారి పోలీసులు కాస్త సీరియస్‌గానే దీనిపై ఫోకస్ చేశారు. విషయాలన్నింటిని తవ్వి తీయాలని ప్రభుత్వం కూడా క్లియర్ కట్‌గా ఆదేశించింది. సో త్వరలోనే చాలా బ్రేకింగ్స్ న్యూస్ చూడబోతున్నారు మీరు.

## జీతాలు లేకుండా బ్రతికేది ఎలా?

మెదక్: ఆరు నెలలుగా జీతాలు లేవు.. మేమెట్లా బతికేది.. మాపై ప్రభుత్వం ఎందుకు కక్షగట్టింది.. అందరి ఉద్యోగులకు ఇచ్చినట్టు మాకు కూడా నెలనెలా ఇచ్చి ఆదుకోవాలని గ్రామాల్లో పనిచేస్తున్న పంచాయతీ సఫాయి కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సూరీడు పొడవక ముందే ఇంటింటా తిరుగుతూ చెత్తబండి వచ్చిందమ్మా? తడిపొడిచెత్త వేరుచేసి ఇవ్వండమ్మా?అంటూ గ్రామంలో తిరుగుతూ ఊరును శుభ్రం చేస్తున్న సఫాయి కార్మికుల బాధలు వర్ణణాతీరం. పొద్దంతా కూలి పనిచేసి వచ్చిన డబ్బులతో పూట గడుపుకొనే ఈ రోజుల్లో? ఆరునెలలుగా వారికి జీతాలు అందడం లేదు.మెదక్ జిల్లా చేగుంట మండలంలో సుమారు 150 మందికి పైగా సఫాయి కార్మికులు పనిచేస్తున్నారు. వీరికి గత ఆర్నెల్ల నుంచి జీతాలు రావడం లేదు. కొన్ని గ్రామ పంచాయతీల్లో వారి బాధలు చూడలేక కార్యదర్శులు బయట అప్పుతెచ్చి రెండు, మూడు నెలల జీతాలు ఇచ్చి వారి కుటుంబాలను ఆదుకుంటున్నారు. ప్రత్యేక అధికారుల పాలనలో పంచాయతీలను నడపడం మునుపెన్నడూ లేనంత భారంగా మారిందని, పంచాయతీలో పనిచేస్తున్న కార్మికులకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు విడుదల చేస్తే బాగుండేదని కార్యదర్శులు అంటున్నారు. రోజూ శుభ్రం చేసి, ఊరులోని చెత్తను తొలిగిస్తున్న తమకు జీతాలు చెల్లించాలని సఫాయి కార్మికులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

## చిత్రపురి కాలనీలో చిత్రలు చూడతరమా

హైదరాబాద్: రియల్ ఎస్టేట్ రంగంలో ఇప్పుడు రోజుకో వ్యవహారం వెలుగులోకి వస్తుంది. కానీ, చిత్రపురి కాలనీ చిత్రవిచిత్రాలు ఎన్ని తవ్వినా కొత్తవి బయటపడుతూనే ఉంటాయి. సినిమా వాళ్ల కోసమే కేటాయించబడిన ఈ కాలనీలో అనేక అక్రమాలు జరిగాయనే ఆరోపణలు ఉన్నాయి. పోలీసులకు ఫిర్యాదులు, కోర్టు కేసులు, దర్యాప్తులు ఇలా ఎన్నో ఏళ్లుగా ఎన్నో వివాదాలు కొనసాగుతున్నాయి. తాజాగా చిత్రపురి కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వల్లభనేని అనిల్ కుమార్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. దీంతో మరోసారి ఈ అంశం చర్చనీయాంశమైంది. మణి కొండ ఏరియాలో ఉంటుంది ఈ చిత్రపురి కాలనీ. సినిమా వాళ్లకు ఇళ్ల కేటాయింపునకు సంబంధించి కమిటీ సభ్యులుగా పరుచూ రి వెంకటేశ్వర్ రావు, వినోద్ బాల, చంద్ర మధు, కాదంబరి కిరణ్, మహానందరెడ్డితో పాటు పలువురు ఉన్నారు. చాలామందికి ఇళ్లు కేటాయించారు. కానీ, భారీగా అవకతవకలు జరిగినట్టు ఆరోపణలు వచ్చాయి.దాదాపు 160 మంది నుంచి డబ్బులు వసూలు చేసి ఇళ్లు కేటాయించలేదు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూసిన వారంతా విసుగు చెంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఒకటే ఫ్లాట్‌ను ఇద్దరు, ముగ్గురికి కేటాయించినట్టు బాధితులు చెబుతున్నారు. మాదాపూర్‌కు చెందిన తోట శ్రీపద్మ దగ్గర 12 లక్షలు తీసుకుని ఇల్లు అలాట్ చేశారు. కానీ, అదే ఫ్లాట్‌ను మరొకరికి రిజిస్ట్రేషన్ చేశారు. ఇలా చాలామందికి జరిగింది. దీంతో పోలీసులు ఎంట్రీ ఇచ్చారు.కాలనీ స్కాంలో సొసైటీ ప్రెసిడెంట్ వల్లభనేని అనిల్ కుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతన్ని కస్టడీకి ఇవ్వాలని కోర్టులో పిటిషన్ వేయగా, అందుకు న్యాయస్థానం అనుమతించింది. రెండు రోజుల పాటు అనిల్‌ను కస్టడీకి తీసుకు న్నారు రాయదుర్గం పోలీసులు. అతని నుంచి కూపీ లాగుతున్నారు. ఈ స్కాంలో మిగతా సభ్యుల పాత్రపైనా దర్యాప్తు జరుగుతోంది. బాధితుల డబ్బు ఎక్కడికి వెళ్లింది అన్న కోణంలో విచారణ చేస్తున్నారు పోలీసులు. భారీగా డబ్బులు చేతులు మారినట్టు గుర్తించారు. బాధితుల ఒక్కొక్కరి నుంచి 4 లక్షల నుంచి 40 లక్షల దాకా వసూలు చేసినట్టు పోలీసులు చెబుతున్నారు. ఈ వ్యవహారంలో అనిల్‌తోపాటు వెంకటేశ్వర్ రావు, వినోద్ బాల, చంద్ర మధు, కాదంబరి కిరణ్, మహానందరెడ్డితోపాటు మరికొందరిపై కేసు నమోదైంది. ఆరుగురు పరారీలో ఉన్నారు.

# జూలై 1 నుండి అమలయ్యే నూతన చట్టాల గురించి పోలీస్ అధికారులకు సిబ్బందికి శిక్షణా కార్యక్రమం

### నూతన చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పరిజ్ఞానం పెంచుకోవాలి..

### రెండు రోజుల శిక్షణలో నూతన చట్టాల గురించి నేర్చుకున్న సెక్షన్ల గురించి పోలీస్ అధికారులను సిబ్బందిని అడిగి తెలుసుకున్న అడిషనల్ డీసీపీ యస్. మల్లారెడ్డి

సిద్దిపేట: నూతన చట్టాలపై పూర్తి పరిజ్ఞానము పట్టు సాధించాలని అధికారులకు సిబ్బందికి సూచించారు. అడిషనల్ డీసీపీ యస్. మల్లారెడ్డి పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ ఆదేశానుసారం పోలీస్ అధికారులకు సిబ్బందికి జూలై 1 నుండి అమలయ్యే నూతన చట్టాల గురించి, కమిషనర్ కార్యాలయంలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. కానిస్టేబుల్ నుండి అధికారుల వరకు నెల రోజులలో శిక్షణ పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. నూతన చట్టాలపై పోలీసు సిబ్బంది సంపూర్ణ అవగాహన పెంచుకోవాలని సూచించారు. దేశంలో నేర న్యాయ వ్యవస్థను పూర్తిగా మార్చేందుకు తీసుకోనున్న చర్యలలో భాగంగాకొత్తగా రూపొందించిన, మూడు చట్టాలు – భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్యా అధినియం, ఈ మూడు చట్టాలు రానున్న జూలై 1 2024 నుండి అమలులోకి రానున్నాయి. నేపథ్యంలో పలు కేసుల దర్యాప్తు, విచారణలో పాటించాల్సిన నూతన విధానాలపై సిబ్బందికి పూర్తి పరిజ్ఞానం ఉండాలన్నారు. ప్రతి పోలీసు అధికారికి, సిబ్బందికి నూతన చట్టాలపై అవగాహన ఉంటేనే రానున్న రోజుల్లో బాధితుల నుంచి వచ్చే ఫిర్యాదులను ఎలా స్వీకరించాలి, ఏఏ సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలి, స్టేషన్ బెయిల్ కు ఎవరు అర్హులు, చార్జీషీట్ ఎలా తయారు చేయాలి, నిందితులకు శిక్షలు ఖరారు చేయడంలో దర్యాప్తు అధికారులు ఎలా వ్యవహరించాలి తదితర అంశాలపై కొత్త చట్టంలో మార్పులు చేర్పులు చేశారు అన్నారు. భారత న్యాయ వ్యవస్థ ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నదనీ, అవసరాన్ని బట్టి ప్రజా భద్రత కోసం ఎన్నో చట్టాల రూపకల్పన జరిగిందన్నారు. ఇప్పుడు అమలులోకి రానున్న నూతన చట్టాలు భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియం వంటి అంశాలతో శాంతి భద్రతల పరిరక్షణలో మైలురాయిగా నిలుస్తోందన్నారు. నూతన చట్టాల ద్వారా కేసుల దర్యాప్తు, విధానాలు, విచారణ పద్ధతుల్లో మార్పు వస్తుం దని, ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందిం చేందుకు వీలు దొరుకుతుందన్నారు. ప్రతి ఒక్కొరూ నూతన అంశాలను నేర్చుకోవాలని సూచించారు. ఎస్బి ఇన్స్పెక్టర్ 2 శ్రీధర్, సిసిఎస్ టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ జానకిరామ్ రెడ్డి, ఐటీ సెల్ ఎస్ఐ నరేందర్ రెడ్డి, జగదేవపూర్ ఎస్ఐ చంద్రమోహన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నూతన చట్టాల గురించి పోలీస్ అధికారులకు సిబ్బందికి శిక్షణ ఇవ్వడం జరుగుతుందిఈ శిక్షణలో పోలీస్ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గోవుల రవాణాకు పోలీసులు సహకరిస్తున్నారు

### – రాజాసింగ్.. బిజెపి ఎంఎల్ఏ

హైదరాబాద్: గో రక్షకులయిన హిందూ కార్యకర్తలను పోలీసుల బెదిరిస్తున్నారని ఎమ్మెల్యే రాజాసింగ్ ఆరోపించారు. ఎవరు కూడా గోరక్షణ చేయవద్దు అంటూ పోలీసులు హిందూ కార్యకర్తలకు ఫోన్లు చేస్తున్నారు. గోరక్షణ చేస్తే కేసులు పెడతామని పోలీసులే బెదిరిస్తున్నారు. సుప్రీంకోర్టు తీర్పును పోలీసు అధికారులు, ముఖ్యమంత్రి గౌరవించరా. చట్ట వ్యతిరేకంగా గోవులను తరలిస్తే అరెస్టు చేసి శిక్షించాలని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. అక్రమంగా గోవులను తరలిస్తుంటే పోలీసులే సహకరిస్తున్నారు. గో రక్షణ చేస్తున్న కార్యకర్తలకు ఫోన్ చేస్తూ రౌడీషీట్ ఓపెన్ చేస్తామని పోలీసులు బెదిరిస్తున్నారు. ఇకనుండి గోరక్షణ కోసం నేనే స్వయంగా రంగంలోకి దిగుతాను. నన్ను అరెస్టు చేస్తారా జైలో పెడుతారా అని ప్రశ్నించారు.

# మహిళా సంఘాల ఆర్థిక బలోపేతమే ప్రభుత్వ లక్ష్యం

### త్వరలో మహిళా శక్తి పాలసీ.

### నాణ్యతే కొలమానం

### ప్రాజెక్ట్ ద్వారా మెరుగైన శిక్షణ అందిస్తాం

సూర్యాపేట జిల్లా,: రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానీయా.మహిళా సంఘాల ఆర్థిక బలోపేతానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆదిశగా మహిళా సంఘాలకు మెరుగైన శిక్షణలు కల్పిస్తున్నామని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానీయా అన్నారు. ఆత్మకూరు ఎస్ మండలం లో మహిళ స్వశక్తి కుట్టు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావ్, అదనపు కలెక్టర్ సి.హెచ్. ప్రియాంక తో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ప్రతి విద్యార్థికి ఏక రూప దుస్తులు అందించే లక్ష్యంతో రాష్ట్రంలో 70 లక్షల జతల దుస్తులు కుట్టిచ్చే బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగించామని అన్నారు.

అన్ని జిల్లాలో 45 రోజుల్లో మహిళా స్వశక్తి కుట్టు కేంద్రాల ద్వారా ఎంతో బాధ్యతాయుతంగా దుస్తులు నాణ్యతతో సిద్ధం చేస్తున్నారని సూర్యాపేట జిల్లాలో పర్యటించడం జరిగిందని పేర్కొన్నారు. గతంలో దుస్తులు ప్రయివేట్ సంస్థలకు ఇవ్వడం జరిగిందని తెలిపారు. సంఘాల ఆధ్వర్యంలో కుట్టు కేంద్రాల లో ఒక్కొక్క మహిళా రోజుకు 7 జతలు అందిస్తున్నారని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ప్రభుత్వ పరంగా మంచి భవిష్యత్ ఉంటుందని అన్నారు. ఇప్పటికే అమ్మ ఆదర్శ పాఠశాల లో మహిళ కమిటీలు చేపట్టామని త్వరలో మహిళ పాలసీ చేపట్టనున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో మండలంలో కట్టింగ్ మిషన్లు అందించడం జరుగుతుందని ఇకపై ప్రతి పనిలో



మహిళా సంఘాలకు చేయూత కల్పించనున్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్ వంటి నగరాల్లో మహిళకు మెరుగైన శిక్షణ ఇచ్చి రెడీమేడ్ దుస్తులలో చేయూత కల్పించడం జరుగుతుందని అన్నారు. తదుపరి మహిళలు కుడుతున్న తీరును పరిశీలించి జిల్లాలో 74 శాతం పూర్తి చేసినందుకు మహిళను, జిల్లా యంత్రాంగాన్ని ఈ సందర్భంగా అభినందించారు.అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ లక్ష్యం మేరకు జిల్లాలో 23 మండలాల్లో గల 783 ప్రభుత్వ పాఠశాలలో 43245 విద్యార్థుల దుస్తులకు గాను 62 ప్రాంతాల్లో 721 మహిళా సంఘాల సభ్యులచే ఇప్పటి వరకు 31940 మంది విద్యార్థులకు దుస్తులు సిద్ధం చేశామని అలాగే మిగిలిన దుస్తులు నిర్దేశించిన సమయం లోపు అందించడం జరుగుతుందని అన్నారు. ప్రతి సంవత్సరం మహిళా సంఘాలకు ఆదాయ వనరులు పెంపొందే దిశగా మెరుగైన శిక్షణ కల్పిస్తామని అలాగే ఎక్కడకూడా రాజీ పడకుండా నాణ్యమైన దుస్తులు అందిస్తున్నామని, ప్రతి విద్యార్థి పాఠశాలల పున ప్రారంభం నుండి నూతన దుస్తులు ధరించి వచ్చే విదంగా అన్ని పాఠశాలలు ప్రధానోపాధ్యాయులకు సూచనలు జారీ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్డీఓ మధుసూదన్ రాజు, సిఈ ఓ అప్పారావు, డిఈ ఓ అశోక్, ఏపీ డి సురేష్ కుమార్,ఎంపీడీఓ సంజీవ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అతి సుందరంగా ట్యాంక్ బండ్ పరిసరాలు..



హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ పరిసరాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఆ ప్రాంతాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలు, పూల మొక్కలతో అలంకరిస్తున్నారు. జూన్ 2న ఉదయం సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో జాతీయ జెండా ఆవిష్కరణ, ఇతర కార్యక్రమాలు ఉంటాయి. సాయంత్రం ట్యాంక్‌బండ్‌పై దశాబ్ది అవతరణ దినోత్సవాలు వైభవంగా నిర్వహిస్తారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు, వివిధ రంగాల ప్రముఖులు హాజరవుతారు.

# గంభీర్‌కు సపోర్టు ఇచ్చిన గంగూలీ



న్యూఢిల్లీ: టీమిండియాకు కొత్త హెడ్ కోచ్ ఎవరన్న దానిపై ఇంకా క్లారిటీ లేదు. కానీ రాహుల్ ద్రావిడ్ వారసత్వాన్ని గంభీర్ తీసుకుంటారని ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

ప్రస్తుతం అమెరికాలో జరుగుతున్న టీ20 వరల్డ్‌కప్ తర్వాత ప్రధాన కోచ్ బాధ్యతల నుంచి రాహుల్ ద్రావిడ్ వైదొలగనున్నాడు. అతని కాంట్రాక్టు ముగుస్తున్న నేపథ్యంలో.. ఇప్పుడు కొత్త కోచ్‌ను ఎంపిక చేయడం అనివార్యమైంది. దీని కోసం ఇటీవల బీసీసీఐ దరఖాస్తులు కూడా ఆహ్వానించింది. అయితే రాహుల్ ద్రావిడ్ స్థానంలో గౌతమ్ గంభీర్ వస్తారని కొన్ని మీడియా కథనాలు వ్యాపిస్తున్నాయి. దీనిపై మాజీ బీసీసీఐ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ(%ాశీబతీఖజ +ఖఅస్త్రబశ్రీఎ%)ని ప్రశ్నించారు. ఇండియన్ కోచ్‌ను తాను కూడా ప్రిఫర్ చేస్తానని, ఒకవేళ గంభీర్ కనుక దరఖాస్తు చేసుకుని ఉంటే, అతను ఓ మంచి కోచ్ అవుతాడని గంగూలీ పేర్కొన్నాడు.

ముంబైలో జరిగిన ఇంటర్నేషనల్ ప్రొక్యూర్మెంట్ అండ్ సప్లయ్ చెయిన్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న గంగూలీ మాట్లాడుతూ.. టీ20 వరల్డ్‌కప్ గెలిచే సత్తా భారత్‌కు ఉందని అన్నారు. వరల్డ్‌కప్ గెలిచే అవకాశాలు భారత్‌కు మెరుగ్గా ఉన్నాయని, టీ20 జట్టు తరహాలో ఇండియా ఆడాలని, అద్భుతమైన ట్యాలెంట్ ఉందని గంగూలీ పేర్కొన్నాడు.

# టీమిండియా జట్టుతో కలిసిన విరాట్ కోహ్లీ



న్యూయార్క్: టీ20 వరల్డ్‌కప్ కోసం క్రికెటర్ విరాట్ కోహ్లీ.. అమెరికాలో ఉన్న టీమిండియా జట్టుతో జత కలిశాడు. టీమిండియా వెళ్లిన అయిదు రోజుల తర్వాత ఆ జట్టు బృందంతో కోహ్లీ కలిశాడు.

అయితే శనివారం బంగ్లాదేశ్‌తో జరగనున్న వార్మప్ మ్యాచ్‌లో ఆడేది లేనిది డౌట్‌గానే ఉన్నది. టీమ్ హెూటల్‌లోకి కోహ్లీ చెకిన్ అయ్యాడని, సుదీర్ఘ ఫ్లయిట్ జర్నీ తర్వాత అతను జట్టుతో కలిశాడని, ప్రస్తుతం అతను రెస్టు తీసుకుంటాడని ఓ సీనియర్ బీసీసీఐ అధికారి తెలిపాడు. 16 గంటల పాటు జర్నీ చేయడం వల్ల కోహ్లీ ప్రాక్టీసు మ్యాచ్‌కు అందుబాటులో ఉండకపోవచ్చు అన్ని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. నాసా కౌంటీ క్రికెట్ గ్రౌండ్‌లో బంగ్లాతో ప్రాక్టీస్ మ్యాచ్ జరగనున్నది. ఇటీవల ముగిసిన ఐపీఎల్‌లో కోహ్లీ 15 మ్యాచ్‌లు ఆడాడు. దాంట్లో అతను 741 రన్స్ చేశడు. ఇక జూన్ 5వ తేదీన ఐర్లాండ్‌తో జరగనున్న ఫస్ట్ మ్యాచ్‌కు ముందే అతను మూడు నెట్ ప్రాక్టీస్ సెషన్స్‌లో పాల్గొంటాడని తెలుస్తోంది. శుక్రవారం జరిగిన ట్రైనింగ్ సెషన్‌లో రింకూ సింగ్, శివం దూబే, సిరాజ్‌లు పాల్గొన్నారు. సపోర్టు స్టాఫ్ సమక్షంలో శిక్షణ తీసుకున్నారు.

# రాహుల్ ద్రావిడ్ స్థానంలో గౌతమ్ గంభీర్ !



న్యూఢిల్లీ: టీమిండియా మాజీ క్రికెటర్ గౌతమ్ గంభీర్.. పురుషుల జట్టుకు చీఫ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టేందుకు ఆసక్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుత కోచ్ రాహుల్ ద్రావిడ్ స్థానంలో ఆ బాధ్యతలను గంభీర్ చేజిక్కించుకునే అవకాశాలు ఉన్నట్లు బీసీసీఐ వర్గాల్లో ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

ఐపీఎల్‌లో కోల్‌కతా టీమ్‌కు మెంటర్ పాత్రను సక్సెస్‌ఫుల్‌గా పోషించిన గంభీర్‌కు ఆ అవకాశం దక్కే ఛాన్సు ఉన్నది. గంభీర్‌తో పాటు ఫ్లెమింగ్, ఆండీ ఫ్లవర్ కూడా తొలుత రేసులో ఉన్నారు. కానీ తాజా అంచనాల ప్రకారం గంభీర్‌కే ఆ బాధ్యతలు దక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఐపీఎల్ 2024లో కేకేఆర్ జట్టు ఇచ్చిన ప్రదర్శన అందర్నీ ఆకట్టుకున్నది. దీంతో ఆ జట్టుకు మెంటర్‌గా ఉన్న గంభీర్ గురించి అందరూ డిస్కస్ చేయడం ప్రారంభించారు. ఫైనల్ ముగిసిన తర్వాత కూడా బీసీసీఐ కార్యదర్శి జే షాతో గంభీర్ చాలాసేపు చర్చించినట్లు సమాచారం. అయితే ఆ ఇద్దరి మధ్య ఎటువంటి చర్చ జరిగిందో స్పష్టంగా తెలియదు. కానీ ఓ ఆంగ్ల పత్రిక మాత్రం రాహుల్ ద్రావిడ్ స్థానంలో గంభీర్ చీఫ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టే అవకాశాలు ఉన్నట్లు స్టోరీ రాసింది. జాతీయ జట్టుకు కోచ్‌గా చేసిన అనుభవం గంభీర్‌కు లేకున్నా.. ఐపీఎల్‌లో మెంటర్ పాత్రను పోషించిన తీరు బట్టి అతనికి హెడ్‌కోచ్‌గా బాధ్యతలు కట్టబెడుతారేమో అన్న సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

కోచ్ పదవి కోసం మే 27వ తేదీన బీసీసీఐ దరఖాస్తులు ఆహ్వానించిన విషయం తెలిసిందే. సుమారు మూడు వేల దరఖాస్తులు వచ్చినట్లు తెలుస్తోంది. దాంట్లో సచిన్, మోదీ, అమిత్ షా లాంటి ఫేక్ అప్లికేషన్స్ కూడా ఉన్నాయి. షార్ట్ లిస్టు చేసిన అభ్యర్థుల జాబితాను బోర్డు త్వరలో ఇంటర్వ్యూ చేయనున్నది. క్రికెట్ అడ్వైజరీ కమిటీ నేతృత్వంలో ఈ ప్రక్రియ జరగనున్నది.

# ఐబీఏకు బైబై!

- వరల్డ్ బాక్సింగ్‌తో దోస్తీ
- భారత బాక్సింగ్ సమాఖ్య నిర్ణయం




న్యూఢిల్లీ : భారత బాక్సింగ్ సమాఖ్య (బిఎఫ్ఐ) కీలక నిర్ణయం తీసుకుంది. అంతర్జాతీయ ఒలింపిక్ కౌన్సిల్ (ఐఓసీ) సస్పెన్షన్ ఎదుర్కొంటున్న ఇంటర్నేషనల్ బాక్సింగ్ అసోసియేషన్ (ఐబీఏ)కు బైబై చెప్పేసింది. ఐఓసీ అండతో నూతనంగా ఏర్పాటైన వరల్డ్ బాక్సింగ్ (డబ్ల్యూఓ)తో దోస్తీకి సిద్ధమైంది. ఈ మేరకు బిఎఫ్ఐ అధ్యక్షుడు అజరు సింగ్ శుక్రవారం వరల్డ్ బాక్సింగ్ ప్రెసిడెంట్ బోరిస్‌ను కలిశారు. 'బాక్సింగ్ ఎదుగుదలకు ఒలింపిక్ గేమ్ ముద్ర అవశ్యం. అందుకే వరల్డ్ బాక్సింగ్‌లో చేరేందుకు నిర్ణయం తీసుకున్నాం. బిఎఫ్ఐలో జనరల అసెంబ్లీ సభ్యత్వ దరఖాస్తును ఆమోదించింది. రానున్న వరల్డ్ బాక్సింగ్ ఎగ్జిక్యూటివ్ బోర్డు సమావేశంలో భారత సభ్యత్వంపై ఆమోద ముద్ర పడనుంది' అని అజరు సింగ్ తెలిపారు. ఆర్థిక, సమగ్రత, పరిపాలన పరమైన విభేదాలతో ఇంటర్నేషనల్ బాక్సింగ్ అసోసియేషన్‌పై ఐఓఏ 2019లో నిషేధం విధించింది. టోక్యో ఒలింపిక్స్‌లో బాక్సింగ్ బౌట్లను ఐఓఏ స్వయంగా పర్యవేక్షించింది. పారిస్ ఒలింపిక్స్‌లోనూ బాక్సింగ్ పోటీల నిర్వహణలో ఐబీఏకు ఎటువంటి పాత్ర లేదు. మెజార్టీ జాతీయ బాక్సింగ్ సమాఖ్యలు వరల్డ్ బాక్సింగ్‌లో చేరితే.. త్వరలోనే ఐఓసీ నుంచి వరల్డ్ బాక్సింగ్‌కు అధికారిక గుర్తింపు సైతం లభించనుంది.

# నిశాంత్ దేవ్‌కు పారిస్ 'టికెట్'



ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన భారత బాక్సర్

బ్యాంకాక్: భారత బాక్సర్ నిశాంత్ దేవ్ పారిస్ విమానం ఎక్కనున్నాడు. ప్రతిష్టాత్మక విశ్వ క్రీడలకు అతను అర్హత సంపాదించాడు.

మెగా ఈవెంట్‌కు ఆఖరి అర్హత టోర్నీ అయిన 'వరల్డ్ ఒలింపిక్ క్వాలిఫయర్స్'లో నిశాంత్ పురుషుల 71 కేజీల విభాగంలో సెమీఫైనల్ చేరడం ద్వారా బెర్త్ దక్కించుకున్నాడు. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో అతను 5-0తో వాసిల్ సెటరి (మాల్డోవా)పై ఏకపక్ష విజయం సాధించాడు.

మహిళల 60 కేజీల క్వార్టర్స్‌లో అంకుశిత 2-3తో అగ్నెస్ (స్వీడన్) చేతిలో ఓడి... అరుంధతి 1-4తో జెస్సికా (స్లొవేకియా) చేతిలో ఓడి ఒలింపిక్స్‌కు దూరమయ్యారు. పురుషుల 51 కేజీల ప్రిక్వార్టర్స్‌లో భారత స్టార్ బాక్సర్ అమిత్ పంఘాల్ 5-0తో కిమ్ ఇంక్యూ (కొరియా)పై గెలిచి 'పారిస్'కు అడుగు దూరంలో ఉన్నాడు.

57 కేజీల క్వార్టర్స్‌లో సచిన్ సివాచ్ 4-1 తో శామ్యూల్ కిస్తోహరీ (ఫ్రాన్స్)పై గెలిచి సెమీస్ చేరాడు. ఈ వెయిట్ కేటగిరీలో మూడు బెర్తులు మాత్రమే ఉండటంతో సచిన్ ఫైనల్ చేరాలి లేదంటే 'బాక్స్ ఆఫ్' బౌట్‌లో గెలిస్తే పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధిస్తాడు. పురుషుల 92 కేజీల విభాగం ప్రిక్వార్టర్ ఫైనల్లో భారత బాక్సర్ సంజీత్ 0-5తో అల్ఫోన్సో (అజర్‌బైజాన్) చేతిలో ఓడిపోయాడు.

# సెమీస్‌లో గాయత్రి జోడీ

- క్వార్టర్స్‌లో వరల్డ్ నం.6పై గెలుపు
- భారత యువ జంట సంచలన జోరు
- సింగపూర్ ఓపెన్ సూపర్ 750




సింగపూర్ : భారత వర్ధమాన షట్లర్లు, వరల్డ్ నం.30 పుల్లెల గాయత్రి, ట్రెసా జాలి సంచలనాల జోరు కొనసాగుతుంది. సింగపూర్ ఓపెన్ సూపర్ 750 టోర్నమెంట్‌లో తొలుత వరల్డ్ నం.2 బేక్, లీ (దక్షిణ కొరియా)లను చిత్తు చేసిన గాయత్రి, ట్రెసాలు తాజాగా మరో మెరుపు విజయం నమోదు చేశారు. వరల్డ్ నం.6, దక్షిణ కొరియా జోడీ కిమ్, యాంగ్‌లపై మూడు గేముల ఉత్కంఠ పోరులో మట్టికరిపించారు. ఒక గంట 19 నిమిషాల పాటు సాగిన మారథాన్ మ్యాచ్‌లో ట్రెసా, గాయత్రి జంట 18-21, 21-19, 24-22తో ఉత్కంఠ విజయం సాధించింది. ఆసియా క్రీడల్లో ఎదురైన ఓటమికి సింగపూర్ ఓపెన్‌లో ప్రతీకారం తీర్చుకుంది. వరల్డ్ నం.6 కొరియన్ షట్లర్లపై ట్రెసా, గాయత్రిలకు ఇదే తొలి విజయం కావటం విశేషం. సింగిల్స్ సర్క్యూట్‌లో పి.వి సింధు, హెచ్.ఎస్ ప్రణరు సహా డబుల్స్ స్టార్స్ సాత్విక్, చిరాగ్‌లు ఇప్పటికే నిష్క్రమించారు. సింగపూర్ ఓపెన్ టైటిల్ వేటలో ఇప్పుడు భారత్ నుంచి ట్రెసా, గాయత్రి జోడీ మాత్రమే నిలిచింది.

వెనుకంజ వేసినా.. : మహిళల డబుల్స్ క్వార్టర్‌ఫైనల్లో ట్రెసా, గాయత్రిలకు తొలి గేమ్‌లో కలిసి రాలేదు. ఆఖరు వరకు పోరాడినా నిరాశే ఎదురైంది. 6-6 తర్వాత వెనక్కి తగ్గినా.. 12-12తో స్కోరు సమం చేసి రేసులో నిలిచారు. కానీ ద్వితీయార్థంలో పాయింట్లు కోల్పోవటం దెబ్బతీసింది. 18-21తో తొలి గేమ్‌లో మనోళ్లు వెనక్కి తగ్గారు. కీలక రెండో గేమ్‌లో గాయత్రి, ట్రెసా గొప్పగా పుంజుకున్నారు. నువ్వా నేనా అన్నట్టు సాగిన గేమ్‌లో విరామ సమయానికి 9-11తో వెనకడుగు వేశారు. ఆ తర్వాత సైతం కొరియన్ జోడీ వరుస పాయింట్లతో చెలరేగింది. 12-17తో ట్రెసా, గాయత్రి దాదాపుగా మ్యాచ్‌పై ఆశలు కోల్పోయిన పరిస్థితి. ఇక్కడే మ్యాచ్ మలుపు తిరిగింది. వరుసగా ఐదు పాయింట్లు గెల్చుకున్న మనోళ్లు 19-19తో స్కోరు సమం చేశారు. వరల్డ్ నం.6 జోడీని నిలువరించి 21-19తో రెండో గేమ్‌ను ఖాతాలో వేసుకున్నారు. మ్యాచ్‌ను నిర్ణయాత్మక మూడో గేమ్‌కు తీసుకెళ్లారు. డిసైడర్ గేమ్ సైతం ఆద్యంతం ఉత్కంఠగా సాగింది. కానీ ఈ గేమ్‌లో గాయత్రి, ట్రెసా ఆరంభం నుంచీ ముందంజలో నిలిచారు. 5-5 తర్వాత వరుస పాయింట్లతో 9-5తో ముందంజ వేశారు. విరామ సమయానికి 11-9తో ఆధిక్యం నిలుపుకున్నారు. కొరియన్ షట్లర్లు వెంబడించినా.. 18-17తో ఆధిక్యం నిలుపుకున్నారు. 19-19 వద్ద స్కోరు సమం చేసిన వరల్డ్ నం.6 జోడీ.. ఉత్కంఠను తారాస్థాయికి తీసుకెళ్లింది. ఒత్తిడిలో ఏమాత్రం పొరపాటు చేయని గాయత్రి, ట్రెసాలు అద్భుతంగా ఆడారు. 22-22తో సూపర్ టైబ్రేకర్‌కు వెళ్లిన గేమ్‌లో 24-22తో మెరుపు విజయం సాధించారు. వరల్డ్ నం.6పై విజయంతో మహిళల డబుల్స్ సెమీఫైనల్లోకి ప్రవేశించారు.

# కూర్పుపై కసరత్తు.. టీ20 ప్రపంచకప్ సన్నాహాల్లో టీమ్‌ఇండియా

**నేడు భారత్, బంగ్లా వామప్ మ్యాచ్**

**స్టార్‌స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం**




ప్రతిష్ఠాత్మక టీ20 ప్రపంచకప్ పోరుకు భారత్ సర్వశక్తులతో సిద్ధమైంది. ఈసారి ఎలాగైనా కప్ కొట్టాలన్న పట్టుదలతో ఉన్న రోహిత్‌సేన.. అమెరికా గడ్డపై త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించేందుకు సమాయత్తమవుతున్నది. 13 ఏండ్లుగా ఊరిస్తూ వస్తున్న ఐసీసీ ట్రోఫీని దక్కించుకునేందుకు పక్కా ప్రణాళికతో బరిలోకి దిగబోతున్నది. ఐపీఎల్‌తో గత వారం వరకు బిజీగా గడిపిన భారత క్రికెటర్లు ఇక పొట్టి ప్రపంచకప్‌పై దృష్టి పెట్టారు. గతానికి భిన్నంగా ఈసారి 20 జట్లతో జరుగుతున్న మెగాటోర్నీలో సత్తాచాటేందుకు తహతహలాడుతున్నారు. అమెరికా వాతావరణ పరిస్థితులకు అలవాటు పడేందుకు బంగ్లాదేశ్‌తో వామప్ మ్యాచ్ ఆడబోతున్నారు. నేడు జరిగే పోరు ద్వారా టోర్నీకి ముందు సరైన కూర్పు కోసం టీమ్‌ఇండియా ఒక అంచనాకు వచ్చే అవకాశముంది.

న్యూయార్క్: ఐసీసీ మెగాటోర్నీల్లో భారత్‌కు కప్ కలగానే మిగిలిపోతున్నది. మహేంద్రసింగ్ ధోనీ సారథ్యంలో చివరిసారి 2013లో చాంపియన్స్ ట్రోఫీ గెలిచిన టీమ్‌ఇండియా అప్పటి నుంచి ఇప్పటి వరకు మళ్లీ ఆ ఫీట్‌ను పునరావృతం చేయలేకపోయింది. నిరుడు సొంతగడ్డపై జరిగిన వన్డే ప్రపంచకప్‌లో ఫైనల్ చేరినా..ఆస్ట్రేలియా చేతిలో ఓటమితో రోహిత్‌సేన రన్నరప్‌తో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. దీంతో గత 11 ఏండ్లుగా ఐసీసీ ట్రోఫీ కోసం చకోరా పక్షిలా ఎదురుచూస్తున్న టీమ్‌ఇండియా ఈసారైనా తమ కలను సాకారం చేసుకునేందుకు పట్టుదలతో ఉన్నది. ఐపీఎల్‌లో మెరుపులు మెరిపించిన క్రికెటర్లు ఐసీసీ టోర్నీలోనూ సత్తాచాటాలన్న కసితో ఉన్నారు. బంగ్లాదేశ్‌తో శనివారం జరిగే ఏకైక వామప్ మ్యాచ్ ద్వారా భారత్ కూర్పుపై ఒక అంచనాకు రానుంది. జూన్ 5వ తేదీన ఐర్లాండ్‌తో జరిగే తమ తొలి మ్యాచ్ నాటికి జట్టు కూర్పుపై స్పష్టత కోసం టీమ్ మేనేజ్‌మెంట్ ప్రయత్నాలు చేస్తున్నది. ముఖ్యంగా రెండు అంశాలు భారత్‌కు ప్రధానంగా కనిపిస్తున్నాయి. ఓపెనింగ్ కాంబినేషన్‌తో పాటు రెండో పేసర్ ఎవరన్న దానిపై ఒక అంచనాకు వచ్చే అవకాశముంది.

ఓపెనింగ్‌కు ఎవరు?

ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్‌కు ఆడిన యశస్వి జైస్వాల్‌ను ఓపెనింగ్‌కు పంపడంపై మేనేజ్‌మెంట్ ఆలోచిస్తున్నది. కెప్టెన్ రోహిత్‌శర్మకు జతగా జైస్వాల్‌ను పంపాలా లేక.. విరాట్‌కోహ్లీ, రోహిత్ ఓపెనర్లుగా వెలితే బాగుంటుందా అన్న ఆలోచనతో ఉంది. ఒకవేళ రోహిత్, కోహ్లీ ఓపెనింగ్‌కు వస్తే..మిడిలార్డర్‌లో పేస్ ఆల్‌రౌండర్ శివమ్‌దూబేకు లైన్‌క్లియర్ అవుతుంది.

దీంతో దూబే రూపంలో అటు హార్డ్‌హిట్టింగ్ బ్యాటింగ్‌కు తోడు స్లోమీడియం పేస్ బౌలర్‌గా వాడుకునే చాన్స్ ఉంది. లేదు జైస్వాల్ జతగా రోహిత్ ఓపెనింగ్‌కు వస్తే..అప్పుడు తుది జట్టులో దూబేకు చోటు దక్కడం కష్టం అవుతుంది. ఐపీఎల్‌లో సిక్సర్ మెషీన్‌గా మెరుపులు మెరిపించిన దూబేనా లేక.. జైస్వాల్ వైపు మొగ్గు చూపుతారా అన్నది వామప్ మ్యాచ్‌లో తేలనుంది.

బుమ్రా జతగా ఎవరు?

యార్కర్ స్పెషలిస్టు జస్‌ప్రీత్ బుమ్రాకు జతగా మహమ్మద్ సిరాజ్, అర్ష్‌దీప్‌సింగ్‌లో ఎవరిని తీసుకోవాలనేది ఇప్పుడు జట్టుకు తలనొప్పిగా మారింది. ఐపీఎల్‌లో సిరాజ్, అర్ష్‌దీప్ అంతగా ఆకట్టుకోలేకపోయారు. అయితే అమెరికాలో కొత్తగా తీసుకొచ్చిన 'డ్రాప్ ఇన్ పిచ్' ఎలా స్పందిస్తుంది అనేది వామప్ మ్యాచ్ ద్వారా అంచనాకు రావచ్చు. అయితే రెండో పేసర్‌గా సిరాజ్ కంటే అర్ష్‌దీప్ బెటర్ అని మాజీ క్రికెటర్ల అభిప్రాయపడుతున్నారు. ఈ పిచ్‌లపై వైవిధ్యం ప్రదర్శించే బౌలర్లకు వికెట్లు పడే అవకాశముందని వారు చెప్పుకొస్తున్నారు. పేసర్లకు తోడు స్పిన్నర్లు కీలకం అయ్యే అవకాశముంది. మొత్తంగా బంగ్లాతో వామప్ మ్యాచ్ ద్వారా భారత్ ఓ అంచనాకు రానుంది.

# బంగ్లాతో టీమిండియా వార్మప్ మ్యాచ్..

టీ20 ప్రపంచకప్-2024 ఫీవర్ తారస్థాయికి చేరింది. అమెరికా-వెస్టిండీస్ వేదికగా జరగనున్న ఈ మెగా టోర్నీ జూన్ 1(యూఎస్ కాలమానం ప్రకారం)న మొదలుకానుంది.

ఆతిథ్య అమెరికా- కెనడా మధ్య దలాస్ వేదికగా ఈ ఐసీసీ ఈవెంట్ ఆరంభం కానుంది.

కాగా వరల్డ్‌కప్ లీగ్ దశలో టీమిండియా తమ మ్యాచ్‌లన్నీ అమెరికాలోనే ఆడనుంది. జూన్ 5న ఐర్లాండ్‌తో తమ ప్రయాణం మొదలుపెట్టనుంది. న్యూయార్క్‌లోని నసావూ కౌంటీ అంతర్జాతీయ స్టేడియం ఇందుకు వేదిక. అయితే, అంతకంటే ముందు ఇక్కడ రోహిత్ సేన బంగ్లాదేశ్‌తో ప్రాక్టీస్ మ్యాచ్ ఆడనుంది. ఈ నేపథ్యంలో భారత జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ మాట్లాడుతూ.. "గతంలో ఎప్పుడూ ఇక్కడ ఆడలేదు కాబట్టి ముందుగా మేం పరిస్థితులను అర్థం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నాం. జూన్ 5న ఇక్కడ తొలి మ్యాచ్ ఆడే సమయానికి ఏదీ కొత్తగా అనిపించకుండా ఉండటం ముఖ్యం.

డ్రాప్ ఇన్ పిచ్

కు అలవాటు పడటం కూడా కీలకం. ఒక్కసారి లయ అందుకుంటే అంతా సజావుగా సాగిపోతుంది. కొత్త వేదిక చాలా బాగుంది. మైదానమంతా ఓపెన్‌గా ఉండటంతో మరింత ఆకర్షణీయంగా కనిపిస్తోంది. న్యూయార్క్ వాసులు ఇక్కడ తొలిసారి జరుగుతున్న వరల్డ్‌కప్‌లో ఎంతో ఆసక్తి చూపిస్తున్నారు. అభిమానుల తరహాలోనే మేం కూడా మ్యాచ్‌ల కోసం ఎంతో ఉత్సాహంగా ఎదురు చూస్తున్నాం. టోర్నీ బాగా జరుగుతుందని ఆశిస్తున్నా"



అని పేర్కొన్నాడు. ఇక అసలైన పోరు మొదలుకావడానికి ముందు టీమిండియా- బంగ్లాదేశ్ మధ్య జరుగుతున్న వార్మప్ మ్యాచ్ కోసం కూడా అభిమానులు ఆతురతగా ఎదురుచూస్తున్నారు. ఈ మ్యాచ్‌కు సంబంధించిన వివరాలు ఇవీ:

టీమిండియా వర్సెస్ బంగ్లాదేశ్

సమయం: భారత కాలమానం ప్రకారం శనివారం రాత్రి ఎనిమిది గంటలకు ఆరంభం

వేదిక: నసావూ కౌంటీ ఇంటర్నేషనల్ స్టేడియం, న్యూయార్క్

ప్రత్యక్ష ప్రసారం: టీవీలో స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లో మ్యాచ్‌ను వీక్షించవచ్చు. ఇక డిజిటల్ మీడియాలో డిస్నీంహాట్‌స్టార్‌లో అందుబాటులో ఉంటుంది.

జట్లు

టీమిండియా: రోహిత్ శర్మ(కెప్టెన్), యశస్వి జైస్వాల్, విరాట్ కోహ్లి, సూర్యకుమార్ యాదవ్, సంజూ శాంసన్, హార్దిక్ పాండ్యా, రిషబ్ పంత్( వికెట్ కీపర్), శివమ్ దూబే, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్, అర్ష్‌దీప్ సింగ్, యజువేంద్ర చహల్.

బంగ్లాదేశ్: లిటన్ దాస్, సౌమ్య సర్కార్, నజ్ముల్ హుస్సేన్ శాంటో(కెప్టెన్), తౌహిద్ హ్రిదోయ్, షకీబ్ అల్ హసన్, మహ్మదుల్లా, జకర్ అలీ(వికెట్ కీపర్), మెహదీ హసన్, రిషద్ హుస్సేన్, టస్కిన్ అహ్మద్, ముస్తాఫిజుర్ రెహ్మాన్, షోరిఫుల్ ఇస్లాం, తాంజిద్ హసన్, తన్జీమ్ హసన్ సకీబ్, తన్వీర్ ఇస్లాం.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI NO:- TELTEL 02048/2021, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**